# జీవితం



విశ్వస్ఫూర్తి

# జీవితం

విశ్వస్ఫూర్తి

**స్ఫూర్తి పబ్లికేషన్స్**

**నెం. 8, సూర్య సత్య అపార్ట్‌మెంట్స్,**

**హోటల్ మురళీ ఫార్చ్యూన్ ప్రక్క రోడ్, రెవెన్యూ కాలనీ,**

**విజయవాడ - 10. ఫోన్: 6666677,9030306677**

# నా దృష్టిలో...

జీవితమంటె, జీవులకు – బ్రతకడమె సుమా!
మనిషికీ అంతె–మరి– మామూలు మీనింగ్‌లో!
అయినా పేరుంది సుమా...,
తెలివైన జాతిగ – విలువైన జన్మగ!
కావచ్చు కొందరే – కారకులు, అందుకు.
అలవాటు జీవితం – అనుకరణ దారిలో...,
సమాజ జీవితం – పౌరధర్మంగ...,
నాగరిక వృద్ధి – సంస్కృతీ సమృద్ధితో...,
విద్యా, సారస్వతం – సైన్స్, సాంకేతికం...,
వివిధ రంగాల సమ్మేళనం – వ్యవస్థ స్వరూపం.
'కడగాలు', కుటుంబం – వ్యవస్థా సౌధానికి.
హక్కు, బాధ్యతలతో – అభివృద్ధి పథాన...,
పయనించాలి సమాజం – ప్రగతి మార్గాన.
హక్కులేని బాధ్యత – బానిసత్వమే సుమా!
బాధ్యతలేని హక్కు – విస్శృంఖలతే
'స్వేచ్ఛ'తో మనిషికి – పెరుగుతుంది బాధ్యత!
జవాబుదారీతనమె – దాని అంతర్గత హృదయం.
ఆకలికే, పరిమితం – ఆర్థిక బానిసత్వం...,
మానవతకే 'శాపం' – మానసిక దాస్యం!
మరుగైతే బాధ్యతలు. హక్కుల 'హోర్'లో...,
పౌరధర్మానికది – పూర్తి సమాధే!
గుర్తించి వర్తించాలి – గురుతర బాధ్యతలతో!
వర్తిస్తూ సాధించాలి – వ్యక్తిగత హక్కులను.
సామాజిక స్వేచ్ఛకు – సమష్టి ఉద్యమమే మార్గం!

జండర్ ద్వేషం – 'సరండర్' న్యాయం...,
సహజతకే విరుద్ధం – మానవతకే మచ్చ!
జాతిగ మానవులు – జీవించాలి, స్వేచ్ఛగ!
స్త్రీ పురుష భేదాలు – పరుష పోరాటాలుగ...,
అనాగరిక మార్గాన్ని – అనుసరిస్తే ఉద్యమం...
వ్యవస్థకే పతనం – వ్యక్తికే నాశం!
సంసార బాధ్యత – సమాజ భద్రత...,
బంధుత్వ 'బలం' – సర్కారు రక్షణ...,
తప్పుదు వ్యక్తికి – స్థానమేదైనాగాని!
సకారణ సామరస్యతే – సాధిస్తుంది సత్ఫలితాన్ని!
జాతిగ పౌరులు – ఉంటేనే ఒకటిగ,
నిలుస్తుంది స్వాతంత్ర్యం – దేశసమగ్రతగ!
అయినా...,
స్వార్థం ధ్యేయంగ – వ్యామోహ కేంద్రంగ,
కామ ప్రేరణతో – కంటిపొరలతో...,
పవిత్ర ప్రేమ – పాతాళంలోకి...,
విచిత్ర గమనం – వికృత వేషాలతో...,
ఆకర్షణ భ్రమతో..., ప్రేమ భ్రమరం,
సాగిస్తే భ్రమణం – పరిభ్రమణం...,
జనరేటర్లై, అవినీతి – ఎలివేటర్లై, అనుకరణ,
చూపుతాయి, పతన మార్గాలు – భావి జనరేషన్‌కు.

•••

మనిషి జీవితం, 'మల్టీ' కాకపోయినా...,

మెనీ మ్యానర్స్ (Manners) తో మార్గాలలో కదులుతూ వుంటుంది. జీవ పరిణామక్రమంలో, మానవ జీవి తుది స్థానానికి, స్థాయికి చేరినా, గత పరిణామ అవశేషాలు, గుత్తగ, గుప్తంగా, మనిషిలో,

నిక్షిప్తంగానే వున్నాయి.

జాతిగ, జీవుల విభజనలో, ప్రతి జాతి, ప్రత్యేకంగా, 'తన' జాతి లక్షణాన్ని కలిగి వుంటుంది. ఈ లక్షణమే, వాటిని ప్రత్యేక సంఘజీవితంగ, వేరుగ వుంచుతుంది. ఆకార సారూప్యత, వున్నా, జీవిత, జీవన విధానంలో భిన్నత, ప్రతి జాతిలోనూ వుంటుంది. మానవజాతి, యిందుకు అతీతం కాదు. మానవ జీవిది కూడ, ప్రాథమిక, మానసిక 'స్పర్శ', పూర్తిగ, యిదే అయినప్పటికీ..., ఆలోచన, అనుకరణ, విచక్షణ, మేధ, కారణంగా... మానవజాతికి, సంఘజీవితంతోపాటు, సమాజ నిర్మాణం, వ్యవస్థ వృద్ధి, వాటి స్వరూప స్వభావాలుగ, పలు రీతులుగ పురోగమించాయి. ఇందుకు, కుటుంబ వ్యవస్థ ప్రాతిపదిక!

వ్యక్తి–కుటుంబం, జాతి – తెగ. సంఘం – సమాజం, సామాజిక వ్యవస్థ – రాజ్య వ్యవస్థ..., యిలా, కాలానుగుణంగ, మానవజాతి, జీవిత, జీవన విధానంలో, మార్పుచేర్పులు జరుగుతూనే వున్నాయి. ఇందుకు తగినట్లుగ, భౌతిక (విషయ) జ్ఞానం, ఆధ్యాత్మిక సమాచారంతో, సైన్స్ – శాస్త్రవృద్ధి, జరుగుతూనే వుంది.

'స్వేచ్ఛ', అనేది, జీవిస్థాయిలోనే, వ్యక్తిగతమైంది. జీవ జాతులన్నిటిలోనూ, యీ, వ్యక్తిగత స్వేచ్ఛ, పుట్టుకతోనే వస్తుంది. అయితే, మనిషికి సంబంధించి, సమాజ జీవితంలో, వ్యక్తిగతానికి, కొన్ని, పరిమితులు తప్పనిసరి! ఉదాహరణకు, వ్యక్తిగత స్వేఛ్ఛ, యిష్టం..., కుటుంబ పరిధిలో, కొంతమేరకు..., అలాగే, మత – సామాజిక, సర్కారు స్థాయిలో, మరింతగ..., నియంత్రణకు, గురి కావలసి వస్తుంది. బాధ్యత, పౌరధర్మం మత ఆధ్యాత్మిక, విషయాలలో, వ్యక్తి స్వేచ్ఛ, హద్దుల్లో వుండక తప్పదు. పుట్టుకతో యేర్పడిన, ఆడ – మగ, జండర్ భేదంతో, 'భార్య –భర్తగ', ఇద్దరు వ్యక్తులు, కలిసి జీవించడంతోనే, కుటుంబం..., దరిమిలా, ఆ బేస్‌గానే, రిలేషన్స్, యేర్పడతాయి, నైతిక – సామాజిక, మత, ఆంక్షలతో, ఈ రిలేషన్స్ వుంటాయి. ఇదంతా, మానవజాతి,

సమష్టి, సమాజ, జీవిత ధ్యేయంతో, జరిగిన యేర్పాట్లే! వ్యక్తిగత స్వేచ్ఛ, అధికారం, వాటి వినియోగంలో, విచ్చలవిడితనాన్ని, అరాజకాన్ని, అరికట్టడానికే, నైతిక, మత నిబంధనలు, సాంఘిక, ఆచార, నియమాలు, సర్కారు చట్టాలు, వుంటాయి. వీటి ఉల్లంఘనే, తప్పుగ, పాపంగ, నేరంగ, భావించడం జరుగుతోంది.

నైతిక బాధ్యత, కుటుంబానికి ఆచార, మత ఆనవాయితీ నిబంధన కట్టుబాట్లు, సమాజానికి..., రాజకీయపాలన, వ్యవస్థకు... వాటి స్వభావాలను, విధానాలను నిర్ణయిస్తాయి... వీటన్నింటా, ప్రత్యక్ష, పరోక్ష రీతిలో, 'వ్యక్తిస్వేచ్ఛకు' కొంత 'బ్రేక్' పడుతూనే వుంటుంది... అందుకు ఎంతైనా 'ధిక్కరణ' వుంటూనే ఉంటుంది. పాజిటివ్ - నెగిటివ్..., టు - ఇన్- ఒన్,' కదా! అయినా, పౌర క్షేమం, సామాజిక భద్రతే, యిందులోని అంతర్గతం!

కుటుంబం - సమాజ - సర్కారు సంబంధాలు, బాధ్యత, హక్కులలో, భార్య - భర్త సంబంధం నైతిక బంధం, ముఖ్యమైనవి. ఆ తరువాతే, రిలేషన్స్. కుటుంబ స్థాయిలో, వ్యక్తిగత స్వేచ్ఛ, హక్కులు, బాధ్యతల నిర్వహణతోనే, ముడివడి వుంటాయి, ఆ యిద్దరి వ్యక్తిగత స్వేచ్ఛ, సాంఘిక తోడ్పాటుతో, దాంపత్య సంబంధ, ప్రేమ, ఆప్యాయత, అనురాగం, ఆదరణ, వగైరా, నిజజీవితంలోనే కలిసిపోయి వుంటాయి. నిజానికి, కుటుంబ స్థాయిలో, వారిద్దరి బంధం, పరస్పర, బాధ్యతలే సుమా! నైతిక దృష్టే, దాంపత్యానికి, ఆలంబన! వారి వయసులు, రేషియోలో, సమతుల్యంగానే పెరుగుతూ వుంటాయి కనుక, మానసికంగా, శారీరకంగా, వారిద్దరూ..., వయస్సు అనుమతించిన మేర, వృద్ధాప్యమైనా, వారి దాంపత్య బంధం, అనుబంధం, 'ఇంటాక్ట్'గానే వుండవలసిందే మరి! బాధ్యతలను మరచి, కేవలం హక్కుల దృష్టితోనే స్వేచ్ఛను కోరుకుంటె, అది వ్యక్తిత్వ విశృంఖలతకు దారితీసి, కుటుంబ వ్యవస్థ బీటలువారుతుంది పౌరుల జీవితంతోపాటు, వ్యవస్థ, నైతిక

పతనంపాలవుతుంది. ఇది, ఆధునికం కాదు, నాగరికత అసలేకాదు.

నాగరిక, సమాజ జీవితానికి సంబంధించి, కుటుంబ వ్యవస్థ, దాని ప్రాధాన్యత, నైతిక పవిత్రత, అందుకు, ముఖ్యకారకులైన భార్య - భర్త సంబంధం, వయస్సు వృద్ధితో సంబంధం లేకుండా, వారిద్దరి మధ్య వుండవలసిన, అనురాగ బంధం, వారి, సామాజిక బాధ్యతలు, హక్కులకు సంబంధించి, హద్దులు, పరిమితులు, వగైరా, సాధారణ మానవజీవితాన్ని స్పృశిస్తూ..., ఈ చిన్నపుస్తకం వ్రాయడం జరిగింది. సహృదయ, సదవగాహనను, పాఠకులనుండి ఆశించడం కూడ... యిందులో భాగమే! నైతిక పతనం, వ్యక్తిస్వేచ్ఛను హరిస్తుంది. హద్దులేని స్వేచ్ఛ, విచ్చలవిడితనం, వ్యక్తిత్వాన్ని వికృతంచేస్తూ... చివరికి, మనిషిని, మానసిక బానిసత్వానికి, చేరుస్తుంది. ఇందుకు, భౌతిక - ఆధ్యాత్మిక భేదంలేదు.

బాధ్యతానిర్వహణలో వ్యక్తిస్వేచ్ఛ తప్పనిసరి. అలాగే. బాధ్యతా రాహిత్యంలో, వ్యక్తి స్వేచ్ఛ, సమాజానికి, సవాలుగ పరిణమిస్తుంది. ముఖ్యంగా హక్కు - బాధ్యతల, సమన్వయతాలోపమే యీ స్థితిని ప్రోత్సహిస్తుంది. కనుక, ఆ మేరకు, వ్యక్తిస్వేచ్ఛకు, హక్కులకు, నియంత్రణ అవసరమే సుమా!

అందరికీ ఆశీస్సులు...

**విశ్వస్ఫూర్తి**

# ‘జీవితం’ పై నా మాటలు

## పాలు–నీరు

జీవితాన్ని ద్వంద్వాల (Pairs of Opposites) పరంపరగా అంగీకరించడం అందరికీ అనివార్యం. ఆ ‘ద్వంద్వాల’ (ద్వైతాల) జీవితంలో సాధనీయ స్థితిని ‘అద్వైతం’ అనవచ్చు. అంటే కష్టం–సుఖం, నష్టం–లాభం, దురదృష్టం– అదృష్టం, చీకటి–పగటి వేళలు, వగపు–వలపు సన్నివేశాలు అన్నింటినీ సమానభావంతో అధిగమించాలన్నదే ‘విశ్వస్ఫూర్తి’ వర్యుల దివ్య సందేశం. ‘పాలు–నీరు’ అన్నవి వేరు చేసి చూడాలంటే ‘హంస’ తత్వం కావాలి. ఎందుకంటే జీవితంలో కష్టాల్లో సుఖాలు, సుఖాల్లో కష్టాలు పెనవేసుకొని విడదీయడానికి అసాధ్యంగా ఉంటాయి. అలా వేరుచేసి విచక్షణాత్మకంగా చూచి అవగాహన పెంచుకోవడమే కావలసింది. ‘ఇది ఇలా ఎందుకుంది? నాక్కావలసినట్లు ఎందుకు ఉండదు? అని ఘర్షణపడి అశాంతిని కొనితెచ్చుకునేకంటే అది అలా ఉండటమే సహజం. దాన్ని వక్రంగా అర్థం చేసుకోవడమే అసహజం.

డబ్బులెక్కువ తీసుకున్నా ‘కల్తీరహిత క్షీరాన్నే పోయమని ఎంత ప్రాధేయపడినా విద్యాధికుడైన నిరుద్యోగి పాలవ్యాపారి మాత్రం ససేమిరా అనడం ఆశ్చర్యం కలిగించకమానదు. అయినా కల్తీతత్వాన్ని వదలలేనంతగా అలవడిన వ్యవస్థ పట్ల ఏవగింపు పెంచుకోవాలో, చిత్త కాలుష్యం అది తెలియనంతగా బలపడిపోయి సరిదిద్దుకోలేనంత స్థిరపడిపోయిందోనని జాలిపడాలో అర్థంకాని ఒక వింత స్థితి నేడు సమాజాన్ని ఆవరించి ఉంది. వ్రత విధానాలు, పూజా విధానాలు టేపుల్లో, సి.డి.ల్లో లభ్యమవుతూ అనేకమంది పురోహిత వృత్తికి విఘాతం కలగడం కృత్రిమత్వ వ్యాప్తికి మరొక ఉదాహరణ.

వ్యాపారులకు అన్ని సమయాల్లో లాభాలు రావని, అందువల్ల కల్తీ అనివార్యమన్నట్లు 'దూధ్‌వాలా' సమర్థించుకోవడం వింతగా ఉంటుంది. ఆర్థిక–సాంఘిక వ్యత్యాసాలు, అవినీతి రాజకీయాలు, వ్యక్తి స్వార్థం వంటి 'వ్యతిరేక ధోరణులు' కల్తీలకు కారణాలవుతున్నాయి.

ఇక్కడ ముఖ్యంగా 'గమనీయ' అంశం ఏమంటే విజ్ఞతను కోల్పోయి ఏదో మిషతో తెలిసీ తప్పుదోవ పడతామనటం భావ్యమా? చెప్పండి.

'అన్‌రిజర్వ్‌బుల్' కులంలో పుట్టిన పాపానికి విద్యావంతుడైనా కుల వృత్తికి అవకాశం లేక ఇలా 'కల్తీ పాల' వ్యాపారానికి ఒడిగట్టవలసిన అగత్యం ఏర్పడిందని ఒప్పుకుంటూనే ఆ తప్పు తనదికాదు, సమాజంలోని ఇతర పరిస్థితులనటం తప్పించుకోవటమే అవుతుంది. అది అసమర్థనీయం.

'పాలట్రిక్స్' కంటె 'పాలిటిక్స్' బెటర్ కాదనటం వింతగా ఉంటుంది.

దృక్కోణం మారాలి గాని దృశ్యం మారదు, అలాగే 'వస్తు సముదాయం' అనే స్ఫూర్తియుత వాక్యం శిరోధార్యం.

## స్నేహం

లోకంలో 'శ్రేయము', 'ప్రేయము' అన్నవి రెండిటినీ మనం చూస్తూంటాం. శ్రేయము అంటే 'హితము', 'ప్రేయము' అంటే ప్రియము అని అర్థాలు. చనువుగా ఉంటూ అవసరాన్ని బట్టి కాఠిన్యాన్ని కూడా వహించగలిగినవాడే 'స్నేహితుడు'. ఇది 'డాక్టర్' వృత్తి వంటిది. అంటే అవసరమైతే చేదు మాత్రలను మింగించటం, కొంచెం నొప్పి కలిగే ఇంజక్షన్ చేయటం. ఇంకా అవసరపడితే 'ఆపరేషన్' చేయడం వంటి సమయోచిత ప్రక్రియలను ఎలా చేపడతాడో అలాగే విందులు, వినోదాల వంటి సమయాల్లో కూడా ఉంటూ సంతోషం కలిగించినా,

ఇక ‘తప్పదు’ అనుకున్నప్పుడు నిందలు, నిష్ఠూరాలు భరించి అయినా స్నేహితునికి ‘హితాన్ని’ కూర్చడం అనే విశిష్టమైన బాధ్యతను వహించడం ప్రధానాంశంగా ‘విశ్వస్ఫూర్తి’ గురువర్యులు వివరించారు.

‘మిత్రద్రోహం’, ‘కృతఘ్నత’గా కానవచ్చే కొన్ని నిత్యజీవిత సంఘటనలలో కూడా ఇటువంటివి అరుదుగా ఉండవచ్చు. ‘సాధారణ’ ప్రవర్తనకు ‘అసాధారణ’ రీతిలో ప్రవర్తించడమే గొప్ప విషయం. తాత్కాలికంగా తృప్తిని, ఊరటను, సంతోషాన్ని కల్గించే అంశాలు ‘లాంగ్ రన్’లో ప్రతిబంధకాలుగా పరిణమించవచ్చు. ప్రస్తుతానికి అంతా అస్తవ్యస్తంగానూ తారుమారుగానూ కనిపించేవి కొన్ని ఈ ‘స్నేహం’ వ్యాసంలోలా సుఖాంతం కావచ్చు.

సారాంశం ఏమిటంటే ‘చిత్తశుద్ధి’తో చేసే పని ఏదయినా మబ్బు తొలగిన ‘సూర్యుడి’లా ప్రకాశించి సంతోషాన్ని, అమూల్యమైన తృప్తిని కలిగించటమే కాక ఒక ఆదర్శాన్ని సమాజానికి చూపుతూ ‘కరదీపిక’గా భాసిస్తుంది.

‘హితాన్ని’ కాంక్షించే వారే ‘స్నేహితులు’ అనే దివ్య సందేశాన్ని అందజేసిన రచయిత వాక్యాలు స్ఫూర్తిదాయకమైనవి.

## స్వేచ్ఛ

'Much can be said on both sides' అనే న్యాయశాస్త్ర నిశ్చయాత్మక నిర్వచనంలా సాగింది ‘స్ఫూర్తీజీ’ చర్చ ఈ వ్యాసంలో.

‘పురుషాహంకారం’, ‘స్త్రీ దాస్యం’ ఇలా రెండు విభిన్న దృక్పథాలలో ఉన్నాయి ప్రధానాంశాలు.

‘జీన్స్ వేసుకుంటే జెండర్ మారదు’

‘ఆడవాళ్ళ ఓట్లకై అంగలార్చటం – మీ అన్‌డ్యూ ఇంపార్టెన్స్‌కి కారణమయింది.’

‘మనిషి తనలోని ‘ఆత్మ’ను మరచి మరో లోకాలలో దేవుణ్ణి చూడాలనుకున్నట్లు...’ ‘స్వేచ్ఛ’ను అనుభవించేది మనస్సు మాత్రమే!’

'హోదా సహజత్వాన్ని మార్చలేదు.'

''లెఫ్ట్‌హ్యాండర్' కుడి - ఎడమలు మారతాయని భావించినట్లుంటుంది'

'క్రోమోజోముల అమరిక మారదు' అనే పురుషవాదం ఆసక్తికరంగా సాగింది.

'ప్రాణం లింగాతీతం'

'జెండర్ డిఫరెన్స్' 'ఇండివిడ్యువల్ ఇండిపెండెన్స్'కు అబ్‌స్ట్రక్షన్ కాకూడదు.

"భార్య - భర్త - ఇద్దరికీ ఎవరి స్వేచ్ఛ వారికి ఉండటమే సబబు."

- అమ్మగారి వాదం ఇది.

"ఆవేశం వదలి, ఆశయాల వేడిని తగ్గించుకొని, ఆలోచనలోకి వచ్చి ప్రకృతి సహజతను పరిశీలించు, వాస్తవం నీకే బోధపడుతుంది"

"కుటుంబంలో, సమాజంలో చివరికి మతాచారాలలో కూడా స్త్రీ ప్రాధాన్యతను, బాధ్యతలను, హక్కులను ప్రకృతే ప్రసాదించింది స్త్రీకి! వాటిని భద్రంగా కాపాడుకోవాలి"

"ప్రకృతిని ధిక్కరించడం పతనానికి ప్రారంభం". ఉద్యమాల ఉపన్యాసాలు, విన్యాసాలు జీవితానుభవానికి దూరం! నాయకుల ఉద్బోధనలు, ఉద్ఘాటనలు నీలాంటి ఇతరులకే! కూర్చున్న కొమ్మను నరుక్కోబూనటం కుబుద్ధికి నిదర్శనం.

ఇలా సాగింది స్ఫూర్తివర్యుల సందేశం 'పురుషవాదం' అనే సందర్భంలో.

It is nothing but a clash of male and female egos.

ప్రగతిశీల భావాలు కలిగిన ఒక స్త్రీ - సంప్రదాయాన్ని విశ్వసిస్తూ జీవించే మరో స్త్రీ మధ్య జరిగిన - చర్చ ఆసక్తిదాయకంగా ఉంది.

"మగజాతి మీసాలకు కొమ్ములొచ్చాయి."

"ఆడదాన్ని 'అబల' అనడం – మగవాడు, తాను మొనగాడిని అనుకోవడం – ఇదే పురుషాహంకారం"

కాలి మెట్టెల నుంచి చెవిదుద్దుల వరకు ఆడది కట్టుబాట్లలో ఉండాలనేందుకు ఆలంకారిక చిహ్నాలట.

అందుకే 'సంసార తిరుగుబాటే' 'మహిళా పోరాటానికి' నాంది.

అలాకాకపోతే ఎలా? ఆనాడు అంతా కలిసి చేసిన 'దేశదాస్య విముక్తి పోరాటం', ఈ రోజు 'సంసార దాస్య విముక్తి'కి మహిళా పోరాటం. 'ప్లేసెస్ – పర్సన్' మారాయంతే!

"తాళి కట్టించుకున్నంత మాత్రాన కట్టుబానిసగా జీవితాంతం బ్రతకాల్సిందేనా?"

"సంసారాల్లో జరగవలసినవి హక్కుల పోరాటాలు కాదే! బ్రతుకు ఆరాటాలు మాత్రమే"

'కుటుంబ వ్యవస్థే ఆడవారికైనా మగవారికైనా పునాది. అదే ఇద్దరికీ భద్రత ఇచ్చేది. సమాజంలో గౌరవానికి అదే ఆధారం. నేలవిడిచి సాము అర్థరహితం ' అంటూ సందేశమిచ్చిన కవి హృదయం ఆదర్శప్రాయం.

వివాదం–విడాకుల వరకు రావటంలో కథ అడ్డం తిరిగింది. టెన్షన్‌తో అరుణ ఆరోగ్యం దెబ్బతింది. అటు పుట్టింటికి ఇటు మెట్టినింటికి దూరమైంది పాపం ఆమె!

'కరుణ–అరుణ'ల సంభాషణ స్త్రీ జాతికి కనువిప్పు కలిగించేలా ఉంది. 'నినాదాలు – ప్రచారం' ప్రధానంగా సాగే స్త్రీవాద పిడివాదం ఏమైనా సాధించిందీ అంటే అది కేవలం స్త్రీల సహకారంతోటే కాదన్నది వాస్తవం.

మారిన దేశ కాలమాన పరిస్థితులను బట్టి కొన్ని మార్పులు

అవసరమే. సాంప్రదాయపు పునాదిని కదిలించేదిగా స్త్రీవాదం వెర్రితలలు వేయటం గర్హనీయమన్న శ్రీగురువిశ్వస్ఫూర్తి భావం సందేశంగా మనం భావించాలి.

## మళ్ళీ పెళ్ళి

'షష్టిపూర్తి'కి ముందు పారిజాతం ఆడిన 'మళ్ళీ పెళ్ళి' నాటకీయ రచన అత్యంత రసవత్తరంగా, అతి సహజంగా సాగింది. మొగుడు–పెళ్ళాల సూటీపోటీ మాటలు కలహ శృంగార రసాల సమ్మేళనంగా సాగి పాఠకులను ఉత్కంఠకు గురిచేశాయి. సంభాషణలు సహజసిద్ధంగా ఉండి చివరిదాకా వాస్తవంగా విడిపోతారేమో వాళ్ళిద్దరూ అన్నంత రాద్ధాంతం జరిగి ఆఖరున సుఖాంతం చేయడం గురువర్యుల రచనాపాటవానికి మచ్చుతునకగా పేర్కొనవచ్చు.

ఈ కథానికలోని 'భార్య భర్త' వాదోపవాదాలు ఛలోక్తులమయంగా సువ్యక్త సుందరంగా సాగాయి. ఉత్కంఠభరితంగా కూడా ఉండి పాఠకులను రంజింపచేశాయి.

భావ కవితలయిన "సారస్వతం"లో బజారు కేరాఫ్ భావి పౌరులకు నాగరిక ప్రగతి – సాంస్కృతిక వున్నతి పాలనావ్యవస్థ– పౌర ధర్మం... సాగర సంగమమే సుమా– ఆటవిక న్యాయమే మరి, అన్న వాక్యాల్లో "దిశానిర్దేశం'లేని యువత పోరంబోకుల్లా తయారయి సమాజానికి అసాంఘిక శక్తులుగా తయారయి క్రమంగా 'ఉగ్రవాదం' వైపు మళ్ళుతున్నారన్న ఆవేదన కేవలం ఆధ్యాత్మిక కోణాన్నే కాక వారి సామాజిక స్పృహను అద్దంలో చూపుతోంది.

మూఢనమ్మకాలను మూర్ఖత్వ పోకడలను వదిలేసి పూర్తిగా – కదలాలి నవతరం అంటూ వారికి చక్కని మార్గదర్శనం చేస్తారు శ్రీ గురూజీ.

ఇక 'సాహిత్యం' అనే కవితలో యుగాల ధర్మం – వేరువేరుగా ఉంటే... కలియుగానికేల గత యుగాల ధర్మం? చెల్లలేదు కృతం –

త్రేతానికి, మారింది త్రేతం... ద్వాపరానికి, లేదా కలియుగానికి ప్రత్యేక ధర్మం? అని నిక్కచ్చిగా ప్రశ్నిస్తారు.

'బ్రతుకు బాధ్యత' కవితలో "కర్మ కంపల్సరీ – సుఖం టెంపరరీ! పుట్టుకే – పునాది – అది గిట్టుటె సమాధి! ఆర్తి – తృప్తి, పూర్తి... కావాలి సమాప్తి" అని బ్రతుకు నిజాలను కళ్ళకు కట్టినట్లు చూపిస్తారు.

"ఏదో వుందంటూ... ఎవరో చెబుతోంటే చూచుటేల నింగివైపు – వదలి నీలోనిది? ఉంది నీలోనే అది"

"బుద్ధి జీవి మనిషి – వృద్ధి బాటె తనది" – ఆహా ఎంత సింపుల్‌గా చెప్పారో మనిషి ఏమిటో!

కథానికల్లో హేతుబద్ధవాదం, భావకవితల్లో మనకు ఎంత ఆలోచించినా అర్థంకాని క్లిష్ట అంశాలను అరటిపండు ఒలిచి చూపినంత సుస్పష్టంగా చూపటం శ్రీ విశ్వస్ఫూర్తి గురజీ 'కలవిన్యాసం' అనటం ఎంతో సమంజసంగా ఉంటుంది అని నా మనోగతం.

**– పొక్కులూరి సుబ్బారావు**

స్క్రిప్ట్‌రైటర్, ట్రాన్స్‌లేటర్

భగవద్గీత ప్రచారకులు.

# కనక పుష్యరాగం

## శ్రీశ్రీశ్రీ విశ్వస్ఫూర్తి మహోదయుల విశిష్టమైన వ్యాసమంజరి 'జీవితం'

– ఈ వ్యాస సంకలనాన్ని ఆమూలాగ్రం అత్యంత ఆసక్తితో చదివాను. రస సమన్వితమైన కవితల్ని కూడా చవిచూచాను.

ఆధ్యాత్మిక రంగంలో నిష్ణాతులైన విశ్వస్ఫూర్తి గురువర్యుల అమృత లేఖిని నుండి, జాలువారిన కమనీయ వ్యాసాలు నన్ను ఆశ్చర్య చకితుణ్ని చేసాయి. 'జీవితం' నందనోద్యాన సుందరవనంలో విరబూసిన పారిజాతం. సురుచిర భావ సంపదతో విరబూసిన మధుర స్వప్నం. ఆనందార్ణవంలో పైకి ఎగసిన ముగ్ధ మనోహర కెరటం. ఇది నగ్నసత్యం. కానీ అస్తవ్యస్తమైన కలుషిత రాజకీయాలు, విదేశీయమైన సంస్కృతీ ప్రభావం, దురభిమానం, స్వార్థ పరాయణత్వం, పాశ్చాత్య విద్యా వ్యామోహం, కుసంస్కారం, పరనింద, వికసించని మానసిక స్థితిగతులు ఇవన్నీ జీవితాన్ని కలుషితం చేస్తున్నాయి. శాంతిని దూరం చేస్తున్నాయి. ఆత్మీయతను, మంట కలుపుతున్నాయి. మమతను సుదూరంగా తీసుకొని వెడుతున్నాయి. అగమ్య పరిస్థితిని పాదుచేస్తున్నాయి. ఎటు చూసినా చీకటే. అంతా అశాంతియే. అంతా అయోమయ పరిస్థితే. వీటి ప్రభావం సమాజంలో అందరూ అనుభవిస్తున్నదే.

శ్రీ విశ్వస్ఫూర్తిగారు తన వ్యాసాలలో, ఈనాటి రాజకీయ పరిస్థితులను సామాజిక రుగ్మతలను, దాంపత్య జీవితంలోని సప్త స్వరాలను, భిన్న–విభిన్న భావ ఘర్షణలను, ఊహాతీతమైన మానసిక ఒత్తిళ్ళను, అంత్ఞ కరణ శుద్ధిని, చిత్త నైర్మల్యాన్ని, మనోనేత్రాలకు కనపడేటట్లుగా ఒక దృశ్య కావ్యంగా తీర్చిదిద్దారు. వీరి కథా కథన

శిల్పం ఎంతో హృద్యంగా, మనోజ్ఞంగా, రసజ్ఞంగా వుంది. వ్యాసాలలోని పాత్రలలో 'పరకాయ ప్రవేశం' చేశారా అన్నట్టు ద్యోతకమౌతోంది. 'సూర్య కిరణం ప్రవేశించని ప్రదేశంలో కూడా, కవి చూపు ప్రవేశిస్తుందనే నానుడికి, వీరి వ్యాసాలే ప్రత్యక్ష సాక్ష్యం. పాత్రోచితమైన సంభాషణలు, వీరి వ్యాసాలకే నిలువుటద్దాలు. సరసమైన విరసమైన వీరి పద ప్రయోగాలు గుండెలోతుల్ని హత్తుకుంటాయి. మానవ జీవితానికి సంస్కారం, నిజమైన భూషణం. ఆ సంస్కారం ఏ మాత్రం లోపించినా అది సభ్యతకు దూరమౌతుంది. విమర్శలకు హేతువౌతుంది. సంఘర్షణలకు దారి తీస్తుంది. ఈ వ్యాసాలలోని పాత్రల సంభాషణలు, వారి హృదయాలకు దర్పణాలుగా నిలుస్తాయి. మచ్చుకు కొన్ని సంభాషణ రీతుల్ని పరిశీలిద్దాం.

"కలవడం-కలపటం- కరగటం, ఇదే జీవితమంటే."

"దేవాలయాలలో భక్తుల సంఖ్య పెరిగిందికానీ మనిషిలో భక్తి తరిగిపోతోంది. దేవుడి దర్శనం కూడా 'ఫ్యాషన్ ప్రదర్శనగా' మారిపోయింది."

"ఆ వయసులో భోగాలు ఈ వయసులో రోగాలు. మేఘం కమ్మిన సూర్యుడిది శాశ్వత మరుగుకాదు కదా!"

"కాలం మారింది. కళ్ళు తెరవండి"

"ఆడదంటే మగవాడికి ఊడిగం చేసే మరబమ్మ కాదు. జీన్సు వేసుకుంటేనే జండరు మారదు. ఆడది ఉద్యోగం చేస్తేనే తూర్పు పడమరలు తారుమారు కావు."

"సినిమాలు, టి.వి.లలో ఆడవాళ్ళు ఒళ్ళు దాచుకోకుండా చేసే వికార విన్యాసాలు, భావి పౌరులను సెక్స్ బానిసలుగా మారుస్తున్నాయట."

"స్వేచ్ఛ అంటే వ్యక్తి తనకు తోచినట్లుగా తిరగడం కాదు. ప్రవర్తించడమూ కాదు, అలాంటి దానిని 'విచ్చలవిడితనం'

అంటారేగానీ 'స్వేచ్ఛ' అనరు"

"శోభనం గది శోక గృహంగా మారింది"

"ప్రేమ ఒకరితో పెళ్ళి మరొకరితో!"

"తాళిలేని ప్రేమకు విలువ వుంటుందేమో కానీ ప్రేమలేని తాళికి జీవం వుండదు."

"ఓటు రాజకీయం బోటు మల్లయ్యే"

"సాధించలేనిదేది? సాధన వుంటే మనిషికి"

"ఆధిక్య పోరాటమే ఆనాటికీ... యీనాటికీ!"

"కానా–పీనా। మకానా కావాల్సినవే అవి పిపీలికానికైనా"

"కర్మ కంపల్సరీ – సుఖం టెంపరరీ"

"పుట్టుకే పునాది – అది గిట్టుటే సమాధి"

"సత్యం జ్ఞానం అదే స్వయం భు"

"సాకార నిరాకార నిత్యత్వమే సృష్టి"

కవి క్రాంతదర్శి. అపారమైన కావ్య ప్రపంచంలో ఆయనే ప్రజాపతి. ఈ లక్షణాలన్నీ గురువిశ్వస్ఫూర్తిగారిలో ప్రస్ఫుటంగా గోచరిస్తున్నాయి. ప్రతివ్యక్తి జీవితానికి ఒక ఆదర్శం వుండాలని, ఆశయం ఉండాలని, గమ్యం వుండాలని, లక్ష్యం వుండాలనీ విశ్వస్ఫూర్తిగారి భావన. ధర్మ వర్తనమే జీవితానికి పునాది. నైతిక విలువలే అనుసరణీయాలు. మానవుడు హిమాలయమంత మహోన్నతుడు కావాలంటే, జీవితాన్ని మానవీయ విలువలతో చక్కదిద్దుకోవాలి. "కన్ను తెరిస్తే జీవితం. కన్ను మూస్తే మరణం! ఈ మధ్యకాలంలో వున్న జీవితాన్ని సుఖశాంతులతో గడుపుకోవటం ఒక కళ. మనిషి జీవించి వున్నప్పుడు ఎన్ని వాహనాలెక్కినా, చివరికి ఏనుగు అంబారీనెక్కినా ఆఖరికి ఎక్కవలసింది నలుగురు భుజాలపైకి. ఈ సత్యాన్ని తెలుసుకొంటే రాగం లేదు, ద్వేషం లేదు. మోహం అంతకంటే లేదు. ఇదే సనాతన ధర్మ ప్రబోధం. మహర్షుల ఉపదేశసారం. ఆధునిక

సమాజానికి అందుబాటులో ఉండేటట్టుగా, గురు విశ్వస్ఫూర్తి గారు ఈ సందేశాన్ని సద్యోహృద్యంగా, సహృదయ నైవేద్యంగా 'జీవితం'లో అందించారు. సాహిత్య సత్యవ్రతులు, రసజ్ఞ రాజశేఖరులైన పాఠకులు ఈ కృతిని సాదరంగా స్వీకరిస్తారని ఆశిస్తూ...

**'పండితరాజు సరస్వతీ కంఠాభరణ'**

– ఆచార్య ప్రభాకర శ్రీకృష్ణభగవాన్

# శుభాకాంక్షలు

విశ్వస్ఫూర్తి గురుదేవుల విరచితమైన ఈ గ్రంథం జీవిత సత్యాలతో విభిన్న శీర్షికలతో శోభిల్లింది. 'పాలు-నీరు' శీర్షికలో "రిజర్వేషన్‌కు అవకాశంలేని కులంలో పుట్టిన దోషానికి చదువు సర్టిఫికేట్‌తో ఉద్యోగం సంపాదించలేకపోయాను. అందుకే ఉద్యోగాన్ని కొనలేక... పాలు కొని అమ్ముకుంటున్నానండీ!... ఏమైనా మానవ ప్రయత్నం విధి నిర్ణయానికి, సబార్డినేట్, 'సరండరే గదండీ!" అని పలికించడం లోక న్యాయాన్ని నిర్ణయిస్తుంది.

'స్నేహం' శీర్షికలో "నీతి నడిపిస్తుంది స్నేహాన్ని! దానిని తప్పిన వానితో పోల్చడానికి, పశువు, మృగం కూడ అంగీకరించవ్... మేఘం కమ్మిన సూర్యుడిది శాశ్వత మరుగు కాదు కదా!.. స్నేహం కోసం నిందలు, దూషణలను కూడా భరించాలి. అవసరమైతే తీవ్రశత్రుత్వాన్ని సహితం, జీర్ణించుకోవాలి."

'స్వేచ్ఛ'లో మతాచారాలలో కూడా స్త్రీ ప్రాధాన్యతను, బాధ్యతలను, హక్కులను ప్రకృతే ప్రసాదించింది స్త్రీకి! వాటిని భద్రంగా కాపాడుకోవాలి. ప్రకృతి ధిక్కరణ పతనానికి ప్రారంభం... కరుణ సలహా కోర్టులను నమ్ముకొని కాపురాలు కూల్చుకోవద్దు. ఉద్రేక ఊహలతో, జీవిత భద్రతను కోల్పోకు అనడం ఎంత సబబో అర్థమవుతుంది. 'తాళి'లో శైలజ పాత్రచే కవి దుర్మార్గుడైన భర్త పెట్టే హింసతో అలవాటు పడవచ్చునేమోకాని, మాట్లాడని మంచి భర్తతో బ్రతికేది ఎలాగని ప్రశ్నిస్తుంది.

'బ్రతుకు బాధ్యత'లో కవి నిగ్రహం, నిజజీవితంలో - అనుగ్రహ భాషణే సుమా! అని చెప్పడం, ఆశించాలి దేనినైనా, ఆర్జించాలి తెలిసి అన్న నీతిని బోధించారు.

కావ్యం యశస్సేర్ధకృతీ
వ్యవహార విధే, శివేత రక్షతే
పద్య పర నిర్వృబుతే కాంతా
సమ్మితయా య్యుపదేశయుజే" అన్న

ఆర్యోక్తిని ఈ గ్రంథం వాస్తవం చేయాలని, గ్రంథ రచయిత కలం నుండి ఎన్నో అనర్ఘరత్నాల వంటి గ్రంథాలు వెలువడాలని ఆశిస్తూ, అభినందిస్తూ...


అభిలాషి

**జి.రెజీనా**

రీడర్, తెలుగుశాఖాధ్యక్షురాలు,

మేరిస్ స్టెల్లా కళాశాల,

విజయవాడ.

# స్పందన

"కన్ను తెరిస్తే జననం- కన్ను మూస్తే మరణం - రెప్పపాటేగదా జీవితం"

ఒక ఆధునిక కవి జీవితకాలానికి ఇచ్చిన నిర్వచనం ఇది.

'తెలుసు మనిషికి - పుట్టుక- చావుల సంగతి

అయినా బ్రతకాలి - ఆ మధ్యదే జీవితమని '

శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి జీవిత రహస్యానికి ఇచ్చిన వాస్తవ వాక్యం ఇది.

సత్య దర్శనం, వాస్తవ దృక్పథం ఈ రచయితకు మూల సూత్రాలు. రచనకు కేంద్ర బిందువులు.

రెప్పపాటుగా వుండే ఈ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు - ఆందోళనలు, ఆవేశాలు - స్నేహాలు, శత్రుత్వాలు - ఉద్యమాలు , ఉద్రేకాలు, సంప్రదాయాలు, సందేహాలు, - వేషాలు, మోసాలు, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు - కట్టుబాట్లు, నియమాలు - తెగతెంపు ధోరణులు, మందలింపు సందేశాలు, సంసారాల్లో కలతలు, సంతానాల్లో స్వార్థాలు, ప్రేమానుబంధాలు, మమతానురాగాలు, మొగుడు పెళ్లాల మృదు కలహాలు, వృద్ధ దంపతుల దురవస్థలు, బ్రతకటానికి అడ్డదారులు, అధికారానికి దుర్మార్గాలు, ఇలా ఎన్నో వాస్తవాలు యీ 'జీవితం'లో రాశి పోసుకున్నాయి. అంతేకాదు మారుతున్న మానవత్వపు విలువలు, మృగ్యమౌతున్న అనుబంధాల అభరణాలు - ఈ 'జీవితం'లో నిలబడి మరీ వెక్కిరిస్తున్నాయి.

ధన సంపాదనే జీవిత లక్ష్యంగా, స్వార్థమే పరమావధిగా, స్వసుఖమే పూలపాన్పుగా భావించి, అనుభవించడమే ఆనందంగా, అది కొందరి మార్గంగా ఈ 'జీవితం' వారి ముసుగులన్నీ విప్పుతున్నది.

ఇటువంటి కలి కల్మషకాలంలో మంచి మార్గంలో వున్నా పట్టించుకోరు. గురువులు చెప్పినా అర్థంకాదు. పుణ్య పురుషులు చూపినా కనిపించదు. మహాత్ములు ఆచరించినా గుర్తించరు. వేదాంత బోధలు వ్యర్థం పురాణగాథలు చెవుల్లో దూరవు. వినే సమయం, కూర్చునే ఓపిక నర మాత్రునికి లేవు.

మరి ఎలా! అన్నీ చూస్తూ, అందరినీ పరిశీలిస్తూ కూర్చోవటమేనా సత్పురుషుల లక్షణం - ఎన్నటికీ కాకూడదు! చెప్పగలిగినవారు చెప్పాలి. చెప్పే రీతిలో చెప్పాలి. హత్తుకునేట్లు వివరించాలి. అందంగా కూర్చాలి. ఆనందం కలిగించాలి. ఆలోచించి, ఆచరించేట్లు చెప్పాలి. అందుకే కావ్యం కాంతా సమ్మితంగా, ఉ పదేశాత్మకంగా సాగాలి. 'జీవితం' ఆ కాంతా సమ్మిత వుపదేశ గ్రంథం.

ఇవన్నీ పూలహారంగా గుది గ్రుచ్చుకున్నాయి ఈ 'జీవితం'లో. శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి దైవాంశ సంభూతులుగా జన్మించి ఆలోచనలో, ఆచరణలో, 'విశ్వమానవులకు స్ఫూర్తి కలిగించేట్లు, గురుస్థానంలో ప్రత్యక్షంగా పరోక్షంగా ప్రజలనే శిష్యులుగా భావించి చేసిన బోధ ఈ 'జీవితం' ఈ కథామృతం, అక్షరసాక్షిగా 'అపూర్వమే' అనగలను. చిత్తశుద్ధిగా, ఆత్మసాక్షిగా చెప్పగలను. ఇది 'అనన్య సదృశమని.'

సమాజాన్ని, కుటుంబాన్ని, వ్యక్తిని, ఎన్నో కోణాల నుంచి చూసి, మరెన్నో దృక్పథాల నుంచి విశ్లేషించి, చూపిన "జీవితం" తప్పక చదవవలసిందే. వ్యక్తిస్వభావాన్ని, మానవ మనస్తత్వపు దృష్టిలోంచి గమనిస్తే ఎలా వుంటుందో, స్వేచ్ఛ స్వాతంత్ర్యం అనేవి ఎంతటి ఎండమావులవంటివో, సంప్రదాయపు తిరుగుబాటు ఎంత పతనానికి దారి తీస్తుందో - రచయిత కథాకథనం ద్వారా పరమ అద్భుతంగా వివరించారు.

కథాబలం, సన్నివేశాల కూర్పు సంభాషణల నేర్పు. వ్యంగ్యం, చమత్కారం రచనలో పొదగటం మరీ విశేషం.

జీవితానికి కావలసిన ఉపదేశాలు జీవనానికి కావలసిన సందేశాలు మానవులకు కావలసిన హితోక్తులు, మనుగడకు కావలసిన మంచి మాటలు – ఈ 'జీవితం'లో ఆణిముత్యాలు.

శ్రీశ్రీశ్రీ గురు విశ్వస్ఫూర్తి మహోదయులకు నా వినమ్ర ప్రణామములు.

**– చివుకుల సుందరరామశర్మ**

విజయవాడ.

శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి... ఈ పేరే ఒక మహామంత్రం. ఒక ప్రచోదనం. మానవాళి మేధోతులను పట్టి కుదిపే ప్రభంజనం... ఇది అనుభవైక సత్యం.

భారతీయ ఆధ్యాత్మిక సంస్కృతి పరంపరలో తాత్త్విక, వేదాంత పారలౌకిక రహస్యాలను, విజ్ఞానాన్ని సామాన్య జనావళికి పంచిపెట్టిన గురు పుంగవులు ఎందరెందరో వున్నారు.

'లౌకికం మిధ్య - బ్రహ్మసత్యం' అని నుడివిన మహానుభావులకూ మనకు కొదువలేదు. అయితే మనిషి జన్మించాక జీవించడాన్ని మిధ్యగా భావించడం ఎందరికి సాధ్యం? అందుకే ఆధ్యాత్మిక రహస్యాలతోబాటు, సామాన్య జీవితం ఎలా వుండాలో ఆచరణాత్మకంగా బోధించడానికి దిగివచ్చిన వెలుగే శ్రీశ్రీశ్రీ విశ్వస్ఫూర్తి గురుదేవులు.

లౌకిక-పారలౌకిక విషయాలు విశేషంగా రంగరించి, సంసార సాగరాన్ని కూలంకషంగా మధించి, జీవనసారాన్నీ, జీవిత పరమార్థాన్నీ అందునుండి అమృతమయంగా వెలికితీసి 'జీవితం'గా అందించిన ఆత్మీయతామూర్తి శ్రీశ్రీశ్రీ గురువిశ్వస్ఫూర్తి.

ఇంతటి మహోన్నతమైన గ్రంథాన్ని ప్రచురించడానికి మమ్మల్ని అనుగ్రహించిన గురుదేవులకు ముందుగా వినమ్ర ప్రణామాలు. అలాగే మేము కోరిన వెంటనే ఎంతో వాత్సల్యంతో ఈ గ్రంథానికి ముందు మాటలు రాసి యిచ్చిన ఆచార్య ప్రభాకర శ్రీకృష్ణ భగవాన్, శ్రీ పొక్కులూరి సుబ్బారావు, శ్రీ చివుకుల సుందరరామశర్మ మరియు జి.రెజీనా గార్లకు కృతజ్ఞతలతో...

**- స్ఫూర్తి పబ్లికేషన్స్**

# 1. పాలు-నీరు

"పాలలో నీళ్ళేవుంటున్నాయి?"

"ఏమిటో! పెద్దవారు, అన్నీ తెలిసినవారు, మీరే యిలా అంటే..., ఎలాగండీ? పాలలో నీళ్ళుకాక, నీళ్ళలో పాలుంటాయటండీ?"

"పాలలో సహజంగా వుండే నీళ్ళను గూర్చికాదు, నేననేది! నేనడిగేది, నీవు కలుపుతున్న వాటిని గూర్చి!"

***"కలవడం, కలపడం, కలగడం..., యిదేగదండీ జీవితమంటె...,*** సృష్టి ధర్మమంటె...! ఆ యిద్దర్నీ కలుపుతారు, కళ్యాణం పేరుతో కలుస్తారు వారు, భార్య-భర్తగ దరిమిలా, కలుగుతారు పిల్లలు, వారి ప్రేమ గుర్తుగ!... అలాగే, కుడితిలో నీరు కలపాల్సిందేగదండీ! దాహమైతే పశువుకు వాటిని తాగించాల్సిందే గదండీ!"

"పాలలో నీవు కలిపిన నీళ్ళ గురించి నేనడుగుతుంటె... పిల్లల్ని కనడం, కుడితిపెట్టడం, అంటావేమయ్యా బాబు!"

"చూడండి! తమకు తెలియందేమీలేదు. మనలోమాట! అసలు, నీరంటే ఏమిటండీ!? హైడ్రోజన్ - ఆక్సిజన్, కలిస్తేగదా దాని ఉత్పత్తి! తమకు తెలుసు, ఆక్సిజన్ అంటె, జీవవాయువు, అదే ప్రాణవాయువు! జీవులు, నీటిలో పుట్టి, నేలమీదికి చేరి, ఆకాశంలోకి ఎగురుతున్నాయి. ఇలా, జీవకోటి యావత్తూ బ్రతికేది నీటితోనే! 'నారాయణ' అంటే నీరే కదండీ! అందుకే, జీవ జన్మకారణం నారాయణేనంటారు. ఇంతకూ, కల్మషాలను కడిగేసి, దేనినైనా నిర్మలం చేసేది నీరే! అంటె, గంగ! అలాగే, సర్వదోషాల్ని కాల్చేసి, పవిత్రతను

చేకూర్చేది అగ్ని! అది, వాయువులో వుంది. శరీరాలు, ఎన్నో కల్మషాలను కలిగివుంటాయి. లోపలా, బయటా, నీటితోనే గదండీ, వాటిని తొలగించి, క్షాళన చేసుకోవలసిందీ? అలాగే, పశువులనుండి తయారయ్యే, పాలలోకూడ, అనేక కల్మషాలు, దోషాలు కలిసివుంటాయి. పైగా, ఎన్నో పశువులనుండి, మేము పాలను సేకరిస్తూవుంటాం! కనుక, వాటిద్వారా అన్ని రకాలైన కల్మషాలు ఒక చోటుకు చేరతాయి... అందుకే, ఆ కల్మషాలను కడిగి, వాటిని తొలగించే నీటిని, అంటె పవిత్ర గంగను, సేకరించిన పాలలో, కలపవలసిరావడం, తప్పనిసరి అవుతోంది. అలాగే వంటలోనూ, నీళు ్ళ కలుస్తాయి  పెరుగులో కలిసిన నీరు, దానిని చల్లగా మార్చి, జీర్ణక్రియకు ఎంతగానో సహకరిస్తోంది... ఇలా, పాలలో ప్రారంభంలోనే నీళ్ళు కలవడం ద్వారా, తెలియని రీతిగ, ఎంతో మేలు జరుగుతోంది, జనానికి! ఇప్పటికైనా తమరు గ్రహించారో లేదోగాని, మందు బిళ్ళ, టానిక్ సహా, దేనినైనా నీరును కాదని వాటిని ఉపయోగించలేం కదండీ!... అంతేనా, సోడానీరు కలవందే..., తమకు తెలియందేముంది?”

“పాలలో నీళ్ళు ఎక్కువ కలిశాయన్నందుకు, యింత పురాణం చదివావ్! ఇహ, నీ కల్తీ వ్యాపారానికి తిరుగేముందిలే కానీయ్... నీ యిష్టం!”

“తమరే పురాణ ప్రస్తావన తెచ్చారు కనుక, సందర్భశుద్ధిగ, తమకు, ఒక చిన్న ఉదాహరణ చెబుతాను  నన్ను తప్పు పట్టకండి!... ‘నారాయణ’ అంటె, సాధారణ అర్థం నీరని అనుకున్నాం కదా! అలాంటి నీటి ప్రతిరూపుని శాశ్వత నివాసం, క్షీరసాగరమేగదండీ! దీనిని బట్టే తెలుస్తుంది తమకు, నీటికి, పాలకు గల అవినాభావ బంధం -

సంబంధం! అంతేనా, సాక్షాత్తూ ఆ పరమశివుని శిరసుపైనుండి జాలువారే, గంగాజలం, దేవుడి తీర్థం  పవిత్ర నిలయాలేకదండీ! అంతెందుకు, నెత్తురులో నీరుంది  నేత్రంలో నీరుంది  మేఘంలో నీరుంది  మందులో నీరుంది  మేనిలో నీరుంది... ఇన్నిటిలో వుండగా, వాటన్నిటినీ వదిలేసి, నేను పోసే పాలలోనే నీళ్ళున్నాయని, నన్ను నిలదీస్తున్నారు. ఇది అన్యాయమండీ"

"బోర్‌లో నీళ్ళు గంగాజలమటయ్యా?"

"తమకు ఏమీ తెలియనట్టు అడుగుతున్నారుగానీ, భూగర్భంలో నీరు, బాటమ్‌కు పోయి, బోర్లన్నీ ఎండిపోతోంటె... వాటిలో, నీళ్ళెక్కడివండీ స్వామి! రాజకీయాల నట్లుబోల్టులతో, ఎగువ ఆనకట్టల తలుపులు బిగుసుకుపోయి, దిగువ నదీప్రవాహాలు వట్టిపోతోంటె, ఇహ, కాలువల్లో కన్పిస్తాయటండీ నీళ్ళు? సాగునీరు కాదుగదా, త్రాగు నీటికే కటకట యేర్పడిన యీ రోజుల్లో, పాలలో కలపడానికి, నీళ్ళ సేకరణ ఎంత కష్టమో, తమరే యోచనచెయ్యండి!"

"అలా అయితే, ఒక పని చెయ్యవయ్యా! ఆ కష్టమేదో, మేమే పడతాంగాని, నీళ్ళు కలపడం ద్వారా, నీకు అదనంగా వచ్చే లాభాన్ని, లెక్కచూచుకుని, దానిని, పాలరేటులో కలిపేసి, నీళ్ళు కలవని పాలనే, మాకు పోసే యేర్పాటుచూడు."

"అది, సాధ్యపడేదికాదు స్వామి! ఎందుకంటారా, ఆ లెక్కలు డొక్కలు, అంత తేలికగా తేలేవికావు. ఒకవేళ, తమబోటి వారికోసం, అంత శ్రమకు పూనుకున్నా, మీకు సర్వీసు చార్జీలు అదనం. అవి, మాకు భారమవుతాయి. ఏ రాయి అయితేనేమండీ..."

"అదేవిటి? నీటి లాభం, పాలరేటులోనే కలిసిపోతోందిగా, సర్వీసు చార్జీలు అదనం, అంటావేమి?"

"ఏమిటో మీ మనసు! నాకు అర్థంకావడంలేదు. తమకు, సర్వం తెలిసికూడ, అన్నీ, నా నోటితోనే చెప్పించాలని చూస్తున్నారు తమరు. నాకు తెలిసింది, నేను చెబుతానుగాని, నన్ను మీరు, అన్యథా భావించవద్దు... నిర్ణయించిన స్కేలు ప్రకారం, యింత అని, జీతం వుంటుందిగదా ఉద్యోగికి! అయినా, దేశంలో ప్రజలకెవరికీ కరవు కాటకాలు లేనట్లు ఉద్యోగులకే అవి వున్నట్లు, చిన్నా పెద్దా తేడాలేకుండా, కరవు బత్తెం కలుస్తోంది, వారి జీతాలకు. పూటబత్తెం పుల్లవెలుగన్నట్టు, అంత లెవెల్లో వున్న వారికి కరవు 'బత్తెం' ఏమిటండీ, ఈ మాట వినడానికే ఎబ్బెట్టుగావుంది. అందుకే కాబోలు దాన్ని గౌరవంగా 'డి.ఎ' అని అంటున్నారు...ఇంతేనా, ఇతర సౌకర్యాలతోపాటు, బోనస్ అదనం! ఏమోలెండి, ఇచ్చేవారు - పుచ్చుకునేవారి యిష్టంలెండి అది. అలాగే, మార్కెట్‌లో వస్తుధరతోపాటు, టాక్సలు అదనం. సెస్‌లు, సర్వీసు చార్జీలు, 'ప్లస్'! సేల్స్‌తో వ్యాపారికి లాభం! టాక్సలతో సర్కారుతోపాటు, మరెందరికో లాభం! చదువు కొనుగోలు గూర్చి వేరుగ చెప్పేదేముంది. పెద్దపెద్ద ఫీజులతోపాటు, డొనేషన్లు, డెవలప్‌మెంటు చార్జీలు, బిల్డింగ్‌ఫండ్, వగైరా వగైరా! ఇదంతా మీకు తెలుసు అయినా, పాల విషయంలో తమరు చెప్పినట్లు, లెక్కలు కట్టినందుకు 'సర్వీసు చార్జీలు అదనం', అన్నందుకు, 'అదేమని,' తమరు ప్రశ్నిస్తున్నారు. యీ కలియుగంలో, ధర్మం, న్యాయం యింకా ఎక్కడ మిగిలున్నాయండీ?... ఉద్యోగుల మామూళ్ళు, అధికార్ల లంచాలు, రాజకీయ అవినీతి, ప్రజాపాలకుల దోపిడీలు, యివన్నీ అందరి కళ్ళముందే జరుగుతున్నా వీటిని గూర్చి మీరు, ఎవరినైనా ప్రశ్నించి, సమాధానం రాబట్టగలిగారా?

"నీవు చేసేది పాలవ్యాపారమే అయినా, చూస్తోంటె, నీవు

మాట్లాడడం, 'ఆల్-యిన్-ఒన్', వ్యవహారంగా వుంది. నీవు, బాగా చదువుకున్నవాడివనుకుంటా!"

"సర్టిఫికెట్ చదువుకు, లోకజ్ఞానానికి సంబంధం ఏమిటండీ? పూర్వాశ్రమంలో, పౌరోహిత్యం చేసేవాణ్ణి! మంత్రాలూ బాగానేవచ్చు శ్రమించి నేర్చుకున్నా... అయినా, బయట గిరాకీలేక, గుళ్ళో పూజారిగ చేరాను. అక్కడకూడ, ***నానాటికీ భక్తుల సంఖ్య పెరిగిపోతోందిగాని, అంతకంటె వేగంగ, మనిషిలో భక్తి తరిగిపోతోంది. దేవుడి దర్శనం కూడ ఫ్యాషన్ ప్రదర్శనగ మారిపోయింది.*** అధికారహోదాలు అధికమైనాయి. భక్తులుకూడ, తెలివిమీరిపోయారు సుమా! దైవదర్శనానికి వచ్చినవారు, సరాసరి, గర్భగుడివైపు చూస్తున్నారుగాని, ప్రవేశద్వారంవద్ద వేచివున్న, దేవుడి సేవకుడైన, పూజారిని ఎవరూ గమనించడంలేదు. ఆఖరికి, కొబ్బరిచిప్ప ప్రసాదం స్వీకరణలో కూడ, భక్తులు, పెద్దదాన్నే ఎంచుకుంటున్నారు...హారతిపళ్ళెం పట్టినా, అందులోని కర్పూరం కరిగిపోవడమేగాని, పైసలు పడడంలేదు. దీనికితోడు, హైటెక్, ఐ.టి వృద్ధితో, పౌరోహిత్యమంతా, టేపులలోకి చేరిపోతోంది. బ్రాహ్మడి అవసరం లేకుండానే, అన్నీ జరిగిపోతున్నాయి. ఇహ, మాలాటివారికి భుక్తి కరవై, ఉపవాసాలే శరణ్యమైనాయి...ఈ స్థితిలో వృత్తిని వదలి, వ్యాపారంలోకి వచ్చాను. ఆ పరమేశ్వరుని దయవల్ల యీ పాలవ్యాపారంతో పచ్చనోట్లు పోగుపడుతున్నాయి. బ్రతుకు పచ్చగానే గడిచిపోతోందిలెండి, మీలాంటివారి దయవల్ల!"

"నీ కల్తీ వ్యాపారంలోకి, ఆ దేవుణ్ణెందుకు లాగుతావ్?"

"చూడండి, తమకు తెలియనిదేముందిగాని, శివాజ్ఞ లేనిదే చీమైనాకుట్టదనే సంగతి, తమకూ తెలుసు. నా పాలవ్యాపారంలోని అనుపానులు. ఆయనకూ తెలుసు, తమలాటి వారికీ తెలుసు. ఇందులో

తెలియని దాపరికమేముంది చెప్పండి? చెప్పక చేస్తే పాపంగాని, యిలాటి ఓపెన్ వ్యవహారంలో దోషమేముందండీ?"

"నీ ఫిలాసఫీలో చాలా చిక్కులున్నాయిగాని దాన్ని అలావుంచు, ఇంతకూ, నీళ్ళపాలు పోయడం, మానేదిలేదంటావ్... అంతేనా"?

"ఇందులో, ప్రత్యేకంగా, నేను చేయగలిగేది ఏముంది మహాత్మా! మానవులు నిమిత్తమాత్రులు. 'కర్మచేయడమే మీ వంతు, ఫలితంతో మీకు సంబంధం లేదనే'గా గీతాకారుని ఆజ్ఞ! అందుకే, పాలలో నీళ్ళు కలిపే కర్మ నా వంతు. ఫలితం ఖాతాదారులకే వదిలేస్తున్నా. అందునా, క్షీరసాగరానికి, నారాయణమూర్తికిగల, అవినాభావ సంబంధమే యీనాటి పాలు – నీటికిగల సంబంధమండీ! ఇది యీ నాటిదికాదు, సృష్టి ప్రారంభం నుండీ వుండే వుంటుంది. దైవనిర్ణయం! దానిని తప్పింప ఎవరితరం? మానవమాత్రులం, మనం చేయగలిగినదేముంటుందండీ? దాని మూలమే అంత! – వాటి యింటర్ రిలేషన్ అంత స్ట్రాంగ్! అంతా ఆ విష్ణుమాయ!"

"ఈ కల్తీ వ్యాపారంతో పాపం పెంచుకోవడంకంటె, చదువుకున్న వాడివి కనుక, ఏదో ఉద్యోగంలో చేరిపోవలసింది..."

"భారత్ ప్రజాస్వామ్యంలో, పేదరికాన్ని నిర్ణయించేది కులమే కావడంతో, రిజర్వేషన్‌కు అవకాశంలేని కులంలో పుట్టిన దోషానికి, చదువు సర్టిఫికేట్‌తో, ఉద్యోగం సంపాదించలేకపోయాను. అందుకే, ఉద్యోగాన్ని కొనలేక..., పాలు కొని, అమ్ముకుంటున్నానండీ... వాస్తవం చెప్పవలసివస్తే..., నా అంతరాత్మ నిజాయితీతో, నిత్యజీవిత మనసుకు, నిత్యం జరిగే ఘర్షణ గడబిడతో, మధ్యలో నలిగిపోతోందండీ, ఈ జీవితం! ఏమైనా మానవ ప్రయత్నం విధి నిర్ణయానికి, సబార్డినేట్,

సరండరేగదండీ!"

"అయినా, పైవారికి లోబడి చేసే ఉద్యోగం కంటె, స్వయం పోషకత్వంలోనే వ్యక్తిత్వం వుంటుంది. యిదే మంచిపని!"

"ఏవో కొన్ని కేసుల్లోతప్ప, స్వయంపోషకత్వ వ్యవహారాలలో, లభించే స్వేచ్ఛకు తగినట్లుగ వ్యాపార లాభాలుండవండీ! పెట్టుబడి, దానికి వడ్డీలు, మార్కెట్ గిరాకీ తారుమార్లు, లాభనష్టాలు, అంతా, పాలు - నీళ్ళు తీరేనండీ! ***సాధారణంగ, ఆర్థిక అసమానతలే, సమాజంలో వ్యక్తి స్థానాన్ని, స్థాయిని నిర్ణయిస్తాయి...*** అన్యాయాలు, అక్రమాలు, ఆందోళనలు, ఆర్థికదోపిడీలు, పెత్తందారీతనం, పాలనాధికారం, పార్టీవ్యవస్థ, వ్యక్తి ఆరాధన...వీటన్నింటికీ, ఆర్థిక, సాంఘిక అసమానతలే పునాదులుగ పనిచేస్తున్నాయి. అంతటా వున్న అవినీతి రాజకీయం, వ్యక్తి స్వార్థం, యిందుకు నాయకత్వ పాత్రను పోషిస్తున్నాయి. ఇందుకు పరోక్ష మార్గంలో రాజముద్రను కూడ వేయించుకుంటున్నాయి."

"నీవు పాలిటిక్స్‌లో చేరితే, పాలవ్యాపారంలో కంటె, అధిక లాభాలు చేరేవికదా!"

''పాలిటిక్స్ ద్వారా సంపాదించే దానిని, లాభం అనకూడదండీ! అది, ప్రజాధన దోపిడీ సొమ్ము! దానిలో పేదప్రజల ఉసురు వుంటుంది. పైగా పైవారికి, వైట్‌కలర్ ఊడిగం చేస్తూవుండాలి. పాలలో నీళ్ళు కలపడంలో అంత శ్రమవుండదు పైగా పాపం పాలు తక్కువే! ఐదో పదో లాభంతో తృప్తిపడవచ్చు... తమరు సెలవిచ్చినట్లు, రాజకీయాలతో, వందలు వేలకోట్లమేర ఆదాయ ప్రవాహం వస్తుంది... కాని, అందుకు కొంత శ్రమవుందండీ! హావభావ నటనాచాతుర్యంతో, సందర్భానికి తగినట్లుగ ప్రజాసేవ డైలాగులు చెప్పాలి. మీడియాను

మేకప్ చేసుకోవాలి. రౌడీయిజాన్ని పోషించాలి. ఇది నేటిస్థితి. రాజకీయాలలో కళంకరహితులైన త్యాగమూర్తులు స్వాతంత్ర్య ఉద్యమకాలంలో వుండేవారు. వారి వారసులు అలా వుండలేరుగదండీ! ఇవన్నీ నాకు సాధ్యంకావని తెలిసే, రాజకీయాలవైపు చూడడంలేదండీ! నకిలీ ప్రజాసేవ, ప్రచార రాజకీయం కంటె, పాలు - నీళ్ళ కాంబినేషన్‌తోనే, కొంత నిజాయితీ వుందనేది, నా వ్యక్తిగత నమ్మకం!"

"ఏమైనా, నీ మాటకారితనం, రాజకీయానికి బాగా సరిపోతుంది."

"అదొక్కటే చాలదండీ! కెమెరాలకు పోజుకొట్టడంలో యాంగిల్స్ తెలియాలి ప్రజా సమస్యలను విన్నప్పుడు, చలించిపోయినట్లు, పబ్లిక్‌గా కన్నీరుకార్చాలి ప్రజల్ని నమ్మించే స్థాయిలో వాగ్దానాలు, ప్రతిజ్ఞలు చేయాలి ఇలా నవరసపోషణ హావభావాలతో, నటనాచాతుర్యాన్ని ప్రదర్శించాలి... నాకు తెలిసినంతవరకు, నాయకుల నటన, కపట ప్రకటనలు, పాలకుల దగా, దోపిడీ... యిదే ప్రజాస్వామ్యం..."

"నీ అవగాహన తప్పు. వ్యక్తుల్ని బట్టి వారి వికార చేష్టల్ని చూచి, ప్రజాస్వామ్యానికి, యిలా అర్థంచెప్పడం సరికాదు... ***చూపు తేడాతో, వస్తువు, అసలు రూపు, రంగు, గుణం, మారవు...***"

"డబ్బులిప్పించండి! కలక్షన్ల పని చాలావుంది."

J J J

# 2. స్నేహం

"ఏవిటమ్మా నీవనేది? సంపాదనంతా సరదాలకు, సహవాసాలకు తగలెట్టి, భార్యా పిల్లల బాగోగులను గాలికొదిలేసి, బాగోతాలాడి తిరిగినదానికి ఫలితంగా, ఆ వయస్సులో భోగాలు, యీ వయసులో రోగాలు! దానికి, ఎవరేం చేస్తారు? అప్పుడు సుఖం యిప్పుడు బాధే!... అనుభవించాల్సిందే! ఎవరు మాత్రం ఎంతని చేస్తారు? ఎంతకాలం చేస్తారు?

"అలా అనకురా! బాధపడే మనిషికి, ఓదార్పునివ్వాలిగాని, మరింత బాధపెట్టే మాటలు అనకూడదు. జరిగిందేదో జరిగిపోయింది అప్పుడేదో జరిగిందని, యిప్పుడేమి అనుకున్నా, వుపయోగం వుండదుకదా! ఈ పరిస్థితులలో, కొడుకుగ, నీవే యిలా అంటె, ఆయనకు దిక్కెవరు? ఎలాగో గడిచిపోయింది ఆయన జీవితం... ఆ రోజులలో, ఆయన ఎలా బ్రతికినా..., తన రూపాయితోనేగదరా, నిన్ను చదివించింది  ఉద్యోగం వేయించి, నీకు సంపాదన మార్గం చూపించి, నీ బ్రతుకు నీవు హాయిగా బ్రతికేలా చేసింది? కనీసం, ఆ కృతజ్ఞతతోనైనా, ఆయనకు వైద్యం చేయించు."

"కన్నందుకు అదంతా మీ బాధ్యత!... మీరేకాదు. ఏ పేరెంటయినా చేసేపని అదే! అదేదో గొప్ప ఘనకార్యంగ, దాన ధర్మం చేసినట్లుగ మాట్లాడతావే?"

"పోనీ, అలాకాకపోయినా, నీ తల్లిగ, నిన్ను అర్థిస్తున్నాను. చావు బ్రతుకులమధ్య సతమతమవుతున్న నా భర్తకు, మానవత్వంతో వైద్యం చేయించు."

"కొడుకుగా, యిప్పటికే నేను చేయగలిగినదంతా చేశాను. అప్పులపాలయ్యాను... ఇహ, నా వల్లకాదు. నేనూ, నా భార్య పిల్లల భవిష్యత్ చూచుకోవాలి. ఆయనలాగ, బాధ్యతను వదిలేసి, ప్రవర్తించలేను. పైగా, డాక్టర్లు చెప్పిన దానినిబట్టి... ఆయన, ఎక్కువకాలం బ్రతికే అవకాశంలేదు. తెలిసీ, అనవసరంగా ఖర్చుపెట్టి, ఉన్నవాళ్ళను అవస్థలపాలు చేయడం దేనికి? ఈ వయస్సులో, ఆయనకు ఏ మందూ పనిచేయదని, డాక్టర్లు తేల్చిచెప్పేశారు. ఆయన ఉన్నన్నాళ్ళు, భార్యగ, నీవు, సేవచేసుకో! అది, నీకు తప్పదుకదా!... ఆ తరువాత, కొడుకుగా, వారసునిగా, నా బాధ్యత నాకు ఎలాగూ వుంది. ఉపయోగంలేని ఖర్చు, వృధా చేయడమేగదా! తండ్రిగ, ఆయన నాకు, నా పిల్లలకు యిచ్చింది ఏమీ లేకపోయినా, కొడుకుగా, యిప్పటికే నా శక్తికి మించి, ఖర్చు చేశాను... ఇహ, నావల్లకాదు."

"కన్న తండ్రి విషయంలో, నీవు, యింత కఠినంగ, కర్కశంగ, మాట్లాడతావనుకోలేదు."

"నీకు, అది కఠినంగాను, కర్కశంగాను అనిపించవచ్చు. అది, వాస్తవ పరిస్థితి. నేను, వేరుగ చెప్పవలసిందేమీ లేదు. ఇహ, మీరు, ఏమైనా, ఎలాగైనా అనుకోండి నాకు బాధ్యతలేదు... వెళ్తాను, ఆఫీసుకు టైం అయింది."

m m m

"ఎందుకేడుస్తావ్?"

"అంతకంటె, నేనుగ, చేయగలిగిందేముందండీ? కడుపున పుట్టినవాడే, కన్నతండ్రిని, యిలా, కసాయిగ మాట్లాడితే...!"

"అందులో తప్పేముంది? వృధా ఖర్చు, వాడికి యిష్టంలేదు...

అది, మంచి పద్ధతేగదా! వాడన్నట్లు, డాక్టర్లు ఏంచెప్పినా చెప్పకపోయినా, ఇహ జీవించే అవకాశం లేదని, నాకే తెలుస్తోందిగా! వాణ్ణనుకోవడం దేనికి? వాడి ఫ్యామిలీ సేఫ్టీ, సెక్యూరిటీ, వాడు చూచుకోవాలిగా!"

"డాక్టర్లు, అలా చెప్పలేదండీ! వాడు, అబద్ధం చెబుతున్నాడు. ఖర్చు కాస్త ఎక్కువైనా, పెద్ద హాస్పిటల్‌లో చూపిస్తే... కేసు నయమవుతుందని చెప్పారు నేను విన్నాను. అందుకు ఖర్చవుతుందని తప్పించుకునే మార్గంలో, వాడు అలా చెబుతున్నాడు అంతేగాని మీకు తప్పక, నయమవుతుందండీ! నాకా నమ్మకం వుంది."

"నీ నమ్మకం ఎలావున్నా, అందుకు డబ్బుకావాలిగా! అది, మనకు సాధ్యంకాదు."

"మా అన్నయ్యను అడుగుతానండీ, పోనీ, అప్పుగానైనా యిమ్మని!"

"వద్దు! ప్రస్తుతం, నా పరిస్థితి 'హోప్‌లెస్', అని తెలిసికూడ, అతను అలాటి సాహసం చేయడు... ఒకవేళ, చెల్లివి అడిగావని, అతను యిచ్చినా, మనకు, అప్పు తీర్చే మార్గమేదీ? మరణం ఖాయమనుకున్నప్పుడు, మనసును, దిటవు చేసుకుని, అందుకు రెడీగా వుండడమే మంచిది. ఇప్పటికే నీ జీవితమంతా, నాతో బాధలు అనుభవించడంతోనే గడిచిపోయింది. ఏనాటి ఋణానుబంధమో యిది? ఇది చాలక పోతూ పోతూ, నీకు అప్పు మిగిల్చి, ఇంకా పాపం మూటకట్టుకోలేను. నా చావుతోనైనా, అది పూర్తి కావాలి!"

"అలా అనకండీ! కష్టమైనా, సుఖమైనా, మీతోపాటు అనుభవించడానికే, మీ జీవితంలో చేరాను. అన్నీ అనుభవించాను. మీరు, నాకు ఏలోటూ చేయలేదు. అది, అనుభవించిన నా

అంతరాత్మకు తెలుసు... వాడు, మూర్ఖుడు! పొందిన మేలును మర్చిపోయిన కృతఘ్నుడు!..., అయినా వాణ్ణనుకుని, వుపయోగంలేదు మంచివాణ్ణి, అంత కఠినుడిగ, స్వార్ధపరునిగ మార్చివేసింది మెట్టినింటికొచ్చిన ఆ మహాతల్లి!"

"వద్దు! ఎవరినీ అలా అనవద్దు! వాడన్నదీ నిజమేగదా! ఎవరైనా, మొదటిగ జాగ్రత్తపడవలసింది తన గురించి, తన కుటుంబం భవిష్యత్ భద్రతను గూర్చి! వాడు, అదే దారిలో వున్నాడు అందుకు, మనం సంతోషించాలి!... అయితే..., ***మనిషి కోరికలు, జాగ్రత్తలే, అన్నివేళలా, జీవితాన్ని నడిపించవ్! చాలా సందర్భాలలో 'తానొకటి తలస్తే...' అన్నట్లు జరుగుతూ వుంటుంది. దానిని, మానవ మేధస్సు తెలివి మాత్రమే తప్పించలేవు. దానినే 'విధి'గా భావించి మౌనంగ అనుభవించవలసిందే!*** గత నా అనుభవమూ అదే! ఇప్పుడైనా, నీ భర్తను గురించి, నీకు వాస్తవం తెలియాలి ఈ చివరి దశలో నీకు ఒక నిజం చెబుతున్నాను అంటె, దానర్థం, జీవితమంతా నీతో అబద్ధాలు చెప్పాననికాదు సుమా! నీ కొడుకు ఆరోపించినట్లు, నా సంపాదనంతా నా సరదాలకు, వ్యసనాలకు 'వేస్ట్' చేయలేదు. అలాంటి అలవాట్లు, బలహీనతలు ఏమీ నాకులేవు. నిజం చెప్పాలంటె, కనీసం, నా వ్యక్తిగత అవసరాలకు కూడ పిసినారిగానే బ్రతికాను. అయినా కుటుంబ అవసరాలకు ఎలాంటి యిబ్బంది కలగనీయలేదు. ఆ విషయం నీకూ తెలుసు. కుటుంబ భవిష్యత్‌కోసం, చాలా జాగ్రత్తపడ్డాను. ఒక రకంగా, కొందరికంటె ఎక్కువగానే సంపాదించాను. గతంలో, యీ విషయాలేవీ నీకు చెప్పలేదు. నా ప్రవర్తనతో విసిగి, కొన్ని సందర్భాలలో నీ మనసుకు బాధకలిగి, కోపంతో నీవు నన్ను ఎన్నివిధాల నిందించినా మౌనంగా వుండేవాణ్ణి!

అంతేగాని, ఏ సందర్భంలోనూ అబద్ధం మాత్రం ఎన్నడూ చెప్పలేదు... అందుకే, నేను నా వ్యసనాలకు ఖర్చుపెట్టుకుంటున్నాననే, నిర్ణయానికి, నీవూ నీ కొడుకూ, వచ్చారు... మరి, ఆ సంపాదనంతా యేం చేసినట్లు, అని అడుగుతావేమో! ఒక వ్యక్తిని మిత్రునిగా నమ్మాను. ఎంప్లాయిని కావడంతో, సంపాదించినదంతా, అతని దగ్గరవుంచాను... అంత వరకే మనిషి జాగ్రత్త!... విధి నిర్ణయం, మరోలా వుంది...అతను... దానిని... అపహరించాడు... అది, అక్రమసంపాదన కనుక, వేరే ఆధారాలుండవు. కనుక లీగల్‌గ చేయగలిగిందీ ఏమీలేదు... నేను అనుభవించనూ లేదు మిమ్మల్ని సుఖపెట్టనూలేదు. కష్టార్జితమంతా లోకులపాలైంది. నేను, పాపర్‌గ మిగిలాను... ఆ షాక్ భరించలేక, ఆత్మహత్యకు ప్రయత్నించాను... చావలేదు. మనోవేదన దానికి తోడైంది. అదే, నన్ను యీ స్థితికి తెచ్చింది... మరణించేముందైనా, యిన్నాళ్లూ నేను మనసులో దాచింది నీకు చెప్పాలి... అందుకే యిలా..."

"ఎవరండీ అతను?"

"ఎవరైనా, మనం చేయగలిగిందేమీలేదు. దానిని, గతంగా మర్చిపోవడమే!"

"ఇంత చెప్పినవారు అతనెవరో చెప్పడానికేమి? అది కూడ నాకు తెలియకూడదా?"

"దాహంగావుంది..."

"అతనెవరో తెలిస్తే, మా అన్నయ్యను తీసుకుపోయి, అడుగుతాను. ప్రస్తుతం మీ పరిస్థితి తెలిసైనా, అతనికి జాలి కలగదా?... పాపకైనా, ఏదో దారి చెయ్యాలిగదండీ!"

"ఒకరు చేసేదేముంది? విధి ప్రకారం, ఎవరి దారి వారికే

వుంటుంది. నేను చెప్పినవన్నీ మర్చిపో! ప్రస్తుతం మనం వున్న బాధలతోపాటు, మరో ఆవేదన ఎందుకు? నీ కొడుకు నీతిసూత్రం ప్రకారం, ఉపయోగం లేదని తెలిసినదాన్ని గూర్చి, ప్రయత్నం మానుకోవాలి. నా మాటవిని, మనసును ప్రశాంతంగ వుంచుకో! జరగవలసిన దానిని తప్పించలేం! విధివిధాన విన్యాసంలో మనిషిది ప్రేక్షకపాత్రే! ఈ నిస్సహాయ స్థితిలో, నీవు, అపేక్షను వదలి, ఉపేక్షాభావాన్ని అలవాటుచేసుకో!"

"అప్పుడే చెప్పివుంటె... ఏదైనా మార్గం దొరికేది. మనసులో మురగబెట్టుకుని యింతకాడికి తెచ్చారు."

"వద్దు! అది, నాకు గుర్తుచేయకు... బాధ ఎక్కువగావుంది. టాబ్లెట్ యివ్వు. ఏమైనా ఉపశాంతి కలుగుతుందేమో!"

m m m

"అమ్మా!"

"ఏమిటే...?"

"అమ్మా! నీకు తెలియకుండా నేను ఒక పనిచేశానమ్మా! నాన్నగారిని, అన్నయ్య అన్ని మాటలన్నాడుగా!... నా మనసు బాగోలేక, కాలేజీకి వెళ్తూ, దారిలో నా ఫ్రెండ్ యింటికి వెళ్ళాను. ఆమె బ్రదర్ మెడిసిన్ చదువుతున్నారు. నాన్నగారి విషయం, ఆయనతో చెప్పాను... ఆయన మనింటికి వస్తానన్నారు."

"ఎందుకు?"

"నాన్నగారిని చూచి, ఏదైనా సలహా చెబుతారేమోనని... నేనే రమ్మన్నాను."

"డాక్టరైతే, ఏదైనా చెబుతాడుగాని స్టూడెంటుకేం తెలుస్తుంది?

ఏం చేయగలడు?"

"ఆయనకు, చాలామంది డాక్టర్లు తెలుస్తారు గదమ్మా! వాళ్ళ సలహాతో, నాన్నగారికి, ఏదైనా ట్రీట్‌మెంటుచేసే అవకాశం వుంటుందేమోగా?"

"ఉపయోగంలేదని, ఇదివరకే డాక్టర్లు చెప్పినట్లు, నీ అన్న అన్నాడుగా! ఒకవేళ, ఆ అబ్బాయి, ఎవరినైనా డాక్టరును తీసుకొస్తే ఆయనకు మనం ఫీజు ఎలా యిచ్చుకోగలం? మెడికల్ బిల్లు చెల్లించలేంకదా?"

"అదికాదమ్మా! అన్నయ్య చెప్పింది. నిజమో, కాదో, నాన్నగారి పరిస్థితిని స్వయంగా చూసిన తరువాత, స్టూడెంటయినా, ఎంతో కొంత తెలుస్తుందికదా! ఆయన చెప్పినదాన్నిబట్టి, నాన్నగారి రోగ పరిస్థితి కొంతైనా మనకి తెలుస్తుందికదా! నీవు కాదనవనే నమ్మకంతో, నాన్నగారి పరిస్థితికి ఏదైనా 'హోప్' వుంటుందేమోనని, ధైర్యంచేసి, ఆయన్ను, నా ఫ్రెండ్‌ను రమ్మన్నాను. వాళ్ళు వస్తారు. కాదనకమ్మా!... ఈ విషయం నాన్నగారితోచెప్పు నేను యిలా చేశానని. ఏమీ అనుకోవద్దని చెప్పు..."

"ఏమిటో! తండ్రి మీద నీకున్న ప్రేమలో, పిసరంతైనా, నీ అన్నకువుంటె, వాడంత కఠినంగా మాట్లాడేవాడా? వాణ్ణి, అంతవాణ్ణి చేసినందుకు, చావు బ్రతుకులమధ్య వున్న తండ్రిని, అంతేసి మాటలు అనగలిగేవాడా?... వాడికి, పుట్టగతులుంటాయా?

"పోనీలే అమ్మా! తల్లిగా వాణ్ణి అలా అనకు... అదుగో, వాళు ్ళ వచ్చినట్లున్నారు... వెళ్ళి తీసుకొస్తాను... నీవు, నాన్నగారితో చెప్పమ్మా! వాళ్ళురావడం, నీకు యిష్టమేగదమ్మా?"

"అలాగే పద, నేనూ వస్తాను."

“హలో! వచ్చేశారా! లోపలికి రండి! ఈమె, మా అమ్మగారు!”

“నమస్కారమండీ!”

“రండిబాబూ! లోపలికిరండి. రా అమ్మా! అలా కూర్చోండి! యిప్పుడే వస్తాను... పాపా యిలా రామ్మా!”

“ఏమవండీ! మీకా శ్రమ అక్కర్లేదు. దారిలోనే కాఫీ త్రాగొచ్చాం! ముందు వారిని చూడాలి!”

“రండి”

“నమస్కారమండీ”

“ఎవరుబాబూ!”

“నేను మెడిసిన్ స్టూడెంటునండీ. మీ అమ్మాయి, మా సిస్టర్ స్నేహితులు. మీ విషయం చెబితే... చూడాలని వచ్చాను.

“ఏం చూస్తావు నాయనా? చివరి దశలోవున్నాను. రేపో, మాపో! ఈ స్థితిలో ఎవరుమాత్రం ఏంచేయగలరు? “హోప్‌లెస్” అని డాక్టర్లు యిదివరకే తేల్చేశారుకదా! మరణం తప్ప... నాకు, మిగిలిందేమీలేదు.”

“అలా అనకండి! మానవ ప్రయత్నం తుదివరకూ చేయాలిగా, నాకు తెలిసినంత వరకు, మీ పరిస్థితి డయాగ్నొసిస్ చేసి, నాకు తెలిసిన డాక్టర్ల సలహా తీసుకుంటాను... ఇదివరకటి మెడికల్ రిపోర్టు చూస్తాను.”

“అది సరే!... ఈ వాయిస్ ఎక్కడో విన్నట్లుందే! నీ పోలికలు ఎవరిలోనో చూచినట్లుందే...! నీ తండ్రి పేరు...?”

“లక్ష్మణరావుగారు! మీకు తెలుసా?”

“తెలుసు...! బాగా తెలుసు...! మహబాగా తెలుసు... కాంట్రాక్టరు కదూ?”

"అవును..."

"...ద్రోహి! మోసగాడు! స్నేహితునిగా నటించి, నన్ను నిలువునా ముంచి, నన్ను ఈ గతికి తెచ్చిన దుర్మార్గుడు!... వాడి కొడుకువా నీవు?... ఇప్పటి వరకు నిలిచివున్న యీ కాస్త ఊపిరిని తీయడానికొచ్చావా?... అసలు, నీవు ఎలా రాగలిగావ్?... ఓహో! అదా సంగతి! మా అమ్మాయికి తెలిసినవాడివా నీవు?...నా జీవితాన్ని సర్వనాశనం చేశాడు, నీ తండ్రి! అది చాలక, నా బిడ్డ బ్రతుకును పాడుచేయడానికి తయ్యారయ్యావా నీవు!... పో బయటికి! పో! నీ తండ్రి పన్నిన కుట్రయిది! నా బ్రతుకు ఎలాగూ ముగిసిపోయింది. పదికాలాలు బ్రతకవలసిన నా బిడ్డ జీవితాన్ని నీ నయవంచనతో నాశనం చేయకు. నీకు పుణ్యం వుంటుంది. ఆమె జోలికిపోకు! నీకు చెయ్యెత్తి దణ్ణంపెడతాను, ఆమె ఉసురుకట్టుకోకు! పో, బయటకు! పోతావా లేదా?"

"ప్లీజ్ ఎక్సైట్‌కాకండి!"

"నోర్ముయ్! పో...పో... అమ్మా! అమ్..."

"ఏమండీ బాబూ! వెళ్ళిపో నీవు"

"ఉద్రేకపడకండి! ఆయన పరిస్థితి ఏమీ బాగాలేదు. అన్ని విషయాలు తరువాత! వెంటనే హాస్పిటల్‌కు చేర్చాలి! దయచేసి మీరు అడ్డుచెప్పకండి ప్లీజ్! ఛాతీని మసాజ్‌చేస్తూ వుండండి... యిప్పుడే వస్తాను... ఎస్ ప్లీజ్! ఆంబులెన్స్ పంపండి! ఎస్! ఎమర్జెన్సీ! అడ్రస్ నోటుచేసుకోండి! ఎస్ సిట్యుయేషన్ సీరియస్!"

m m m

"బాబూ! దేవుడిలా వచ్చి, నాకు ప్రాణభిక్షపెట్టావు. నీ మేలు

జన్మలో మర్చిపోయేదికాదు  నాకు, నీ తండ్రి చేసిన, అపకారం గుర్తుకొచ్చి, నిన్ను చాలా దూషణగ మాట్లాడాను. అయినా భరించావ్! ఇదంతా నీ మనసులో వుంచుకోకు! ఆనాటి నా పరిస్థితిని, నీవు కళ్ళారాచూశావు కనుక, నన్ను, నా మాటలను అపార్థం చేసుకోకు! ఇంత చిన్న వయసులో, అంతటి ఓర్పు నీకు ఎలా వచ్చింది నాయనా? స్నేహితుణ్ణి మోసం చేసినవాడికి, యింత మంచి బుద్ధికలిగిన కొడుకు వుండడం...? అయినా, తండ్రి గుణాలే పిల్లలకురావాలని ఎక్కడుందిలే!"

"ప్లీజ్! మీరు, ఎక్కువగా ఆలోచన చేయకండి! ఓపెన్‌హార్ట్ సర్జరీ జరిగింది కనుక, ఎలాంటి పరిస్థితులలోనూ, ఉద్రేకం, ఆవేశం, కోపం, అమిత సంతోషం యిలాంటి వాటితో ఎమోషనల్ ఫీలింగ్స్‌కు మీరు లోనుకాకూడదు. దేనికీ ఎక్సైట్‌కావద్దు. కనుక, మీరు ప్రశాంతంగ, నిశ్చింతగ వుండండి! డాక్టర్ల సలహాలను మనం పాటించాలిగా"

"అది సరే! నీవు చెప్పినట్లే వుంటాను కాని..."

"ఏమిటి సందేహిస్తున్నారు?"

"ఏమీలేదు బాబూ! నా దగ్గర ఏమీలేదు. బిల్లు ఎలా చెల్లించావ్?"

"అదెప్పుడో జరిగిపోయింది. ఇప్పుడు దానిని గురించి ఎందుకు? మీరు ప్రశాంతంగ వుండండి... త్వరలోనే మీరు, మామూలు పరిస్థితులకు రాగలరు."

"మెడికల్ బిల్లు విషయం ఆందోళనగా వుంది, ఆ ఒక్కటి చెబితే..."

"చెబుతాను. కాని, ప్రస్తుతంకాదు. మీరు మామూలు స్థితికి

వచ్చిన తరువాత, సమయం వచ్చినప్పుడు, మీకు, పూర్తి సమాచారం చెప్పిస్తాను. విని, మీరు తృప్తిగ వుండవచ్చు."

"ఎవరితో?"

"........."

"చెప్పుబాబూ! ఆ ఒక్కటి చెప్పి నా మనసుకు నెమ్మదిని కలిగించు. నీవు కుర్రాడివి. అంత డబ్బు, నీవు ఎలా సర్దుబాటు చేయగలిగావ్?"

"నేను చేయలేదు."

"మరి...?"

"మా నాన్నగారే, నాతో, ఇదంతా చేయించారు... ఇన్నాళ్లూ, మీరు ఆయన్ను అపార్థం చేసుకున్నారు. ఆయన మీకు మంచి స్నేహితుడు... మనసారా, మీ మంచిని కోరే, మంచి మనిషి. అప్పటికీ యిప్పటికీ, మీ విషయంలో, ఆయనలో ఎలాంటి మార్పురాలేదు... నాకు తెలిసింది యింతవరకే! ప్లీజ్! నా మాటలను నమ్మండి. మనసును ఎక్సైట్ కానివ్వకండి!... మీరు హాస్పిటల్‌లో వున్నంతకాలం, ప్రతిరోజూ, మీకు కన్పించకుండానే, మిమ్మల్ని చూచివెళ్తూ వుండేవారు. ఎప్పటికప్పుడు, డాక్టర్లతో అన్ని విషయాలు మాట్లాడేవారు. హాస్పిటల్‌లో మీరు ఎడ్మిట్ అయినప్పటినుండి అక్కడి అన్ని యేర్పాట్లు ఆయనే స్వయంగా చూసేవారు. మీరు పూర్తిగ మామూలు స్థితికివచ్చాక,... మీరు, సమ్మతిస్తే ఆయనే వచ్చి మీతో మాట్లాడతానని చెప్పమన్నారు."

"...నేను అపార్థం చేసుకున్నాను... నీవు చెబుతున్నావుగా... అదే, నిజంకావచ్చు. అదేదో, అతని ద్వారానే ఋజువుపరచుకుంటాను... నిజంగా, నాకు ద్రోహం చెయ్యాలనుకున్నవాడైతే... యిదంతా ఎలాచేస్తాడు. మీ ఫాదర్‌ను

అడుగు. అతను యిక్కడికి రావడంకాదు. నేనే మీ యింటికి వస్తాను... తన్ని చూచి చాలా కాలమైంది..."

"ప్రస్తుతం, మీరున్న కండిషన్‌లో, కొంతకాలంపాటు, అలాటి ఆలోచన చేయవద్దు. ప్లీజ్ నా మాట వినండి!"

"కాదు, అలా జరిగితేనే, నేను త్వరగా కోలుకోగలను... నేను... అతన్ని... చూడాలి."

"అలాగే! ఆయనతో మాట్లాడి, మీకు చెబుతాను... అయినా, నా మాటవిని, కొద్దికాలం ఆగండి! ఇలా, మెడికల్ స్టూడెంటుగా నేను చెబుతున్నమాట! చిన్నవాడినైనా, నా మాటలను కాదనకండి, ప్లీజ్!"

"సరే బాబూ! అలాగే! అయితే, నాదొక కోరిక! నీవు, త్వరగా మెడిసిన్ చదువు పూర్తి చేసి, డాక్టరువై మంచి మనసుతో నాలాంటి పేదవాళ్ళకు, ప్రాణభిక్షపెడుతూ వుండు. అయినా, అంత ఖర్చుపెట్టి చదివించిన మీ నాన్న, నీవు, పేదలకు సేవచేయడానికి ఒప్పుకోకపోవచ్చు! కాంట్రాక్టర్‌కదా! డబ్బు మనిషి!... అయినా, నీవు, నీ మంచి మనసును ఇంకా యింకా పెంచుకో బాబూ!... మానవసేవే మాధవసేవకదా! 'వైద్యోనారాయణ'' అన్నారుకదా! దాన్ని సార్ధంచేసుకో!"

"ఇహ, నేను వెడతానండీ! మెడిసిన్స్ రెగ్యులర్‌గా వాడండి! డాక్టర్లతో మరొకసారి మాట్లాడతాను. మందులు మార్చాలేమో మరి!... వస్తానండి."

"అలాగే! నేను చెప్పిన మాట మనసులో వుంచుకో బాబూ!"

"ఏ మాట?"

"అదే, మీ ఫాదర్‌తో..."

“మీరు వర్రీకాకండి! సమయం వచ్చినప్పుడు, నేనే, ఆయన్ను తీసుకొస్తాను...నిజం చెప్పాలంటె, మిమ్మల్ని చూడాలని, మీతో మాట్లాడాలని, మీకంటె, ఆయనకే తొందరగా వుంది. ఆయనకూ యిదే మాట చెప్పాను. కొన్నాళ్ళపాటు వీలుకాదని... వస్తానండీ.”

“.......”

“బాబూ! వెడుతున్నావా?”

“అవునమ్మా! ఏమి?”

“ఏమీలేదు, ఆయనకు ఫర్వాలేదుగా?”

“ఆ డౌట్ మీకు అవసరంలేదండీ! ఆయన పూర్తి ఆరోగ్యంతో తిరగగలుగుతారు. ఇది, నా మాటకాదు, డాక్టర్లు చెప్పిందే! గతంలో, ఆయనకు ఏ చెడు అలవాటు లేకపోవడం యిందుకు ప్లస్ పాయింటయ్యింది. మీరు ధైర్యంగా వుండండి. మెడిసిన్స్ మాత్రం. రెగ్యులర్‌గా, పంక్చువల్‌గా యిస్తూ వుండండి, చాలు,”

“అలాగే, మరోమాట!... మా యింట్లో, నీవు భోజనం చేయకూడదా బాబూ! ఎన్నిసార్లు అడిగినా, కాదంటున్నావు”

“వద్దమ్మా! హాస్టల్‌కు వెడతా! ఫ్రెండ్స్ చూస్తుంటారు... వస్తానమ్మా! ఆయన్ను జాగ్రత్తగా చూస్తూ వుండండి.”

“అలాగే బాబూ! మంచిది, వెళ్ళిరండి...

ఇహ, మీరు లేవండి. భోజనం చేద్దుగాని”

“ఇప్పుడే వద్దు! నా మనసు బాగోలేదు.”

“మెడిసిన్స్ వేసుకోవాలి, లేవండి! ఆ అబ్బాయి యింతగా చెప్పిన తరువాత కూడ మీ మనసెందుకు బావుండదు? లేచి, ముందు భోజనం చేయండి. అంతా బాగానే వుంటుంది. దేనిని గురించీ ఆలోచన చేయవద్దని, ఆందోళన పడవద్దని ఆ బాబు చెప్పింది,

మర్చిపోయారా?... లేవండి?"

m m m

"ఏవండీ! నాన్నగారొచ్చారు..."

"నమస్కారమండీ! రండి!"

"ఏమ్మా! బావున్నారా?"

"మా బాగు, మీకు తెలియందేముంది అన్నయ్యగారూ!"

"నేను, వాడి దగ్గరకు రావచ్చునో లేదో నీవు, ముందుగా తెలుసుకో అమ్మా!"

"...రానక్కర్లేదు... నేనే వస్తున్నా... ఒరే లక్కీ! ఎన్నాళ్ళయిందిరా నిన్ను చూచి?

"లోపలికిపోదాం పద!... ఎలా వుంది?"

"ఎలా వుంటుంది? నీ కొడుకు నాకు ప్రాణదాతగా అవతరించాడుగా! బాగానే వున్నాను. నీవెలావున్నావ్? ఆరోగ్యం మంచిగా వుందా?... ఒళ్ళు కొంచెం తగ్గినట్లుంది. కాంట్రాక్టులు చేస్తూనే వున్నావా?"

"మానేశాను. ఈమధ్య టెండర్ల పరిస్థితులు ఏమీ బాగాలేవు. ప్రాజెక్టులు, పథకాలన్నిటినీ రాజకీయమే పూర్తిగ ఆక్రమించింది. ఇది, యింకా ఎంతదూరం పోతుందో తెలియడంలేదు. పోటీలో, టెండర్లు ఎంత తగ్గించివేసినా, లాభాలు మస్తుగానే వస్తున్నాయి. ఎలాగనేది హైటెక్ రాజకీయ రహస్యం! అది, నావల్లకావడంలేదు"

"నీవు ఎంత పీనాసివైనా, నా కోసం, నీ కొడుకు నీచేత బాగా ఖర్చుపెట్టించాడు... అందుకే, ఒళ్ళుకాస్తా తగ్గిపోయినట్లుంది."

"సొమ్మొకరిది, పేరొకరిదన్నట్లుగ, నీ ఆపరేషన్‌కు ఖర్చుచేసిన

సొమ్మునీది. పేరువాడికి! మీ యిద్దరూ బాగానే వున్నారు. మధ్యలో, నేనేగా, ఎటూకాని వాణ్ణయ్యాను.”

“నిన్ను అపార్థం చేసుకున్నాను. దానిని మనసులో పెట్టుకుని ఆవేశంతో, నీ కొడుకును దూషించాను... నన్ను క్షమించు.”

“అలావీల్లేదు. జరిగిన విషయమంతా పూర్తిగ, వివరిస్తాను. అప్పుడు చూద్దాం. ఎవరు ఎవరిని క్షమించాలో... చెప్పమంటావా? అందరూ వినేటట్టుచెబుతా! నీకు యిష్టమేనా?... చెప్పమంటావా?”

“చెప్పుకో! నాకేంటంట? నీలాగ, నేనేమీ వెధవ వేషాలు వేయలేదు.”

“అమ్మా! నీ కూతురెక్కడ? అసలు కథానాయకురాలు ఆమె!”

“నమస్కారమండీ!”

“ఒరే బాబూ! నీవూ, నీ చెల్లి, వీడి కూతురు, ముగ్గురూ బయటకుపొండి! మేం మాట్లాడుకోవాలి!... అమ్మా! శ్రద్ధగా విను!... నీకు తెలుసునోలేదో, మేమిద్దరం ప్రాణస్నేహితులం! నేను కాంట్రాక్టర్‌ను కావడంతో, ఆఫీసు పనులన్నీ, వీడిద్వారానే జరిపించుకునేవాడిని. నాకు బాగానే మిగిలేది... వీడూ, సంపాదించేవాడు! అది ఎలాగో నాకూ స్పష్టంగా తెలియకపోయినా, ఇద్దరమూ దానిలోనివాళ్ళమే కావడంతో, మేము మంచి స్నేహితులుగా వుండేవాళ్ళం! వీడి సంపాదన దాచమని, నాకేయిస్తూ వుండేవాడు. అంటె, వీడికి నేను ‘స్విస్’బ్యాంకునన్నమాట! దానంతటికీ, వడ్డీతో సహా, యీనాటికీ, నాదగ్గర లెక్కలున్నాయి... బినామీగా నీ పేర ఆస్తికొనమని, నేనంటె, వీడు ఒప్పుకోలేదు. నీ కొడుకంటె, నీకు ప్రాణమని, మీ యిద్దరూ దానిని దుర్వినియోగం చేస్తారేమోనని, డౌట్‌పడ్డాడు. వాడి సొమ్ము వాడిష్టంకదా! అందుకు నేనేమీ అనలేకపోయాను. అది ఒక అధ్యాయం.

అయితే సర్వీసులో వుండగానే ఒకసారి, తన డబ్బు తనకి కావాలని అడిగాడు. ఎందుకని నేనడిగితే, ఎవరో ఒకామెకు యివ్వాలని చెప్పాడు. 'సరె అలాగే'నని నేను ఆమెనుగూర్చి ఎంక్వైరీ చేశాను. ఆమె మోసకత్తె అని, తన ఆడతనంతో, గతంలో ఎన్నో జీవితాలతో ఆడుకుని, సంసారాలను బీడు చేసిందని... తీరా చూస్తే అది, వీడివంతు వచ్చిందేమోనని అనుకుని, ఆ సంగతే వీడికి చెప్పి, అలా చేయవద్దని ఎంతగా చెప్పినా, వినకపోగా, నాతో తగాదా పెంచుకున్నాడు. దూషణగా మాట్లాడాడు. అయినా, నేను చలించలేదు. వీడితో విసిగిపోయి, చివరకు, ఆ డబ్బు సంగతే నాకు తెలియదని, చేతనైన పనిచేసుకోమ న్నాను... స్నేహితుని విషయంలో, అలా ప్రవర్తించినందుకు చాలాకాలం, మానసికంగా, ఎంతోబాధను అనుభవించాను. అయినా పెద్దప్రమాదం నుండి తప్పించి, ఒక మంచి స్నేహితునిగ నిరూపించుకున్నందుకు, తృప్తిపడేవాణ్ణి! వాడి మాటలకు బాధపడి ఆనాడే, యిచ్చేసివుంటె..., ఆ పరిస్థితిని ఊహిస్తేనే ఘోరంగా వుండేది... ఏరా, నేను చెప్పినదాంట్లో, అక్షరమైనా పొల్లుందా? ఉంటే చెప్పు! ముఖంవుంది అద్దంవుంది. చెప్పుమరి!"

"ఆమె, ఏదో ఆపదలో వుందని తెలిసి, మానవత్వంతో, సాయం చేద్దామనుకున్నాను, అంతేగాని, నీలాగ, రాంగ్ రూట్‌లో సెకండ్ సెటప్‌లు నాకులేవు..."

"అలా వుండకూడదనే, నీతో ఎన్ని నిందలు పడినా, చివరికి శత్రుత్వంయేర్పడినా, ఆనాడు అంత మొండిగా వ్యవహరించాను... దాని ఫలితం... యిప్పుడే తెలుస్తోందిగా నీకు!... ఏమ్మా విన్నావా జరిగిందంతా?"

"ఈ రోజు మీరు చెప్పేవరకు ఈ సంగతులేవీ నాకు

తెలియవన్నా! ఇంత దాపరికం గల మనిషితో చాటుమాటు పనులు, యింకా ఎన్ని జరిగాయో! ఆడవాళ్ళకు డబ్బు యివ్వాలనుకోవడంలోనే తెలుస్తోంది, చీకటిబుద్ధి!"

"అదేం లేదమ్మా! నాకు తెలిసినంతవరకు, వీడు మంచివాడేనమ్మా! ఏ చెడు అలవాటూలేదు. ఆ మాయలాడి పనే అది. తెలియని రీతిగ, ఆ మోసగత్తె ఊబిలో దిగబోయాడు. సకాలంలో తెలుసుకుని నేను చక్రం అడ్డంవేశాను. ఫలితంగా స్నేహం కాస్తా శత్రుత్వంకావడంతోపాటు, అందరిలోనూ నేను, చెడ్డవాడిగ, మోసగాడిగ అనిపించు కోవలసివచ్చింది."

"నీ మీద చెడ్డగ నేను, ఎవరికీ ఏమీ చెప్పలేదు."

"అదీ నాకు తెలుసు. ఒకవేళ చెప్పినా, అన్ని డబ్బులు నీకెక్కడివని ఎవరైనా అడిగితే, ఏమని చెబుతావ్? అందుకే, తేలుకుట్టిన దొంగలా, నీలో నీవే, నన్ను తిట్టుకున్నావ్. అంతేనా?... నాకు తెలిసినంతవరకు, ***నీతి నడిపిస్తుంది స్నేహాన్ని! దానిని తప్పినవానితో పోల్చడానికి, పశువు, మృగం కూడ అంగీకరించవ్. ఒకవేళ కొన్ని సందర్భాలలో, కొన్ని కారణాలతో సహవాసం, విడిపోవచ్చునేమోగాని, స్నేహం, మిత్రత్వం తరిగిపోకూడదు, చెరిగిపోకూడదు. మేఘంకమ్మిన సూర్యుడిది శాశ్వత మరుగుకాదుగదా!*** అది సరే! అసలు విషయానికొస్తాను. వీడి వైద్యానికి ఖర్చు పెట్టినదంతా వీడి ఎమౌంట్‌లోదే! మిగిలినది, తగిన సమయంలో, తిరిగి ఇచ్చేస్తాను. పనిలో పనిగా ఒకమాట చెబుతాను... వీడి కూతురు, నా కోడలని, ఎప్పుడో చెప్పాను. వియ్యమందితే స్నేహం చెడిపోతుందని, వీడు అడ్డుచెప్పాడు. అలా జరగదు. ఇప్పుడు అందరూ వినేటట్లుగ, మళ్ళీ చెబుతున్నాను వినమ్మా! నీ కూతురు నా యింటి కోడలు. ఇందులో,

ఏ మార్పూ వుండదు. అప్పుడు మా యిద్దరి మధ్య జరిగిన మాటల్ని నీ కూతురు ఎలా పసికట్టిందోగాని, నా కొడుకును ఎడ్వాన్స్ బుకింగ్ చేసేసింది. మావాడు నాకు అన్నీ చెబుతాడు. ఎవరా అని ఆరాతీస్తే అసలు విషయం తెలిసింది. నాకెంతో ఆనందం కలిగింది. ఆఫీసులో అందరిచేత మంచివాడనిపించుకుంటూనే ఎవరినీ, ఏ సందర్భంలోను బాధపెట్టకుండా, డబ్బు సంపాదించిన యీమె తండ్రి తెలివి, సైలెంట్ వ్యవహారం, కూతురుకొచ్చింది. చూడమ్మా! పైకి ఎంతో అమాయకురాలిగ కన్పిస్తూనే, సైలెంట్‌గ, ఎంత చక్రం తిప్పిందో! కధానాయకురాలై, దూరంగ జరిగిపోయిన మనందర్నీ, ఒక్క చోటుకు లాక్కొచ్చింది. ఎంత తెలివమ్మా నీ కూతురుది?"

"నన్నంటున్నారుగాని, అసలు చక్రం తిప్పింది మీ అమ్మాయే!"

"ఏయ్! నేనా?... సరే! ఇప్పుడెందుకులే! వస్తావుగా మా యింటికి కోడలుగ! అప్పుడు చెబుతాను నీ సంగతి! ఆడబిడ్డ అర్ధమొగుడు! ఈ సంగతి బాగా గుర్తుపెట్టుకో!"

"అప్పుడే, వదినా, మరదళ్ళుగా, సరసాలు మొదలైనాయమ్మా! మరో మాట చెబుతాను వినండి! వీడి కూతురు నా కోడలని చెప్పానుగదమ్మా! అయితే ఒక్కమాట! నా దగ్గరున్న వీడిడబ్బుల్ని కట్నంగా మార్చుకుంటానని, వీడు అనుకుంటాడేమో! అలాంటిదేమీ జరగదు. రూపాయికూడ కట్నం తేకుండా నీ కూతురు, కోడలిగ నా యింటికి రావాలి. నాకున్న ఆస్తిని, నా తదనంతరం నా యిద్దరు పిల్లలకు సమానంగ యిస్తాను. అలాగే, మా అబ్బాయి వాటాలో, మూడో వంతు, నా కోడలికి, యిష్టానుసారంగ చెందుతుంది. నా కూతురు, నీ కూతురు స్నేహితులే కనుక, ఆడబిడ్డ కట్నం సంగతి

వారిద్దరికే వదిలేస్తాను... ఏమిటమ్మా, నేను మాట్లాడుతుంటె, వీడు హాయిగా నిద్రపోతున్నాడు?"

"నిద్రకాదురాబాబు! నిన్ను, నేను ఏమనుకోవాలో, నాకు తెలియడంలేదు."

"ఏమనుకునేదేంటి? ఆనాటికి యీనాటికి...ఏనాటికీ... మనం ప్రాణస్నేహితులం! అంతే! ***స్నేహితులు, ఒకరికొకరు, వేరుగ, కోరుకునేదేమీ వుండదు. స్నేహం కోసం నిందలు, దూషణలను కూడా భరించాలి. అవసరమైతే తీవ్రశత్రుత్వాన్ని సహితం, జీర్ణించుకోవాలి... అనుకూల ప్రతికూలతలతో, నిమిత్తంలేకుండా, పరస్పర హితం కోసం, అంకితం, అర్పితం కావాలి.*** అందుకే, నీ కుటుంబ భవిష్యత్‌కోసం, ఎన్ని నిందలైనా భరించాను... ***మేఘాల మధ్యనైనా మెరుపుతీగగ ప్రకాశిస్తుంది స్నేహం!... ప్రేమ - ఆత్మీయతలు శాశ్వతాలు. మానవత్వం వాటికి ధర్మకాటా!...*** పిల్లలేరమ్మా!"

"వాళ్ళు ముగ్గురూ మీ యింటికి వెళ్ళారన్నా!..."

"ఏరా నన్ను వెళ్ళమంటావా?"

"అనను, ఎలా వెడతావ్, నన్నిక్కడ వదిలేసి?"

"రేపు మళ్ళీవస్తాను. మందులు క్రమంగా వాడుతున్నావా? డాక్టరు దగ్గరకు పోవలసిన అవసరం యీ మధ్య నాకూ ఎక్కువైంది. అయినా ఫర్వాలేదనుకో! వయసు మీరినవాళ్ళకు రోగాలు పొంచివుంటాయి గదా! నీవు మాత్రం ప్రశాంతంగా వుండరా! గుండె ఆపరేషన్ కదా! దానికి ఒత్తిడి కలగకూడదు... వెళ్ళనా?"

"నీ యిష్టం. రోజూ వస్తావుకదూ?"

"అలాగే! వస్తానమ్మా!"

m m m

“ఎందుకు బాధపడతారు? నిశ్చితార్థ విచ్ఛిత్తి విధి నిర్ణయం కావచ్చు. నడిచేది మనిషే అయినా..., అలా నడిపించే అదృశ్యశక్తి ఏదోవుంది. అది మానవాతీతమైనది కనుక, దాని నిర్ణయాన్నికాదని, మనిషి చేయగలిగిందేమీవుండదు. అలా, మనసుకు సర్దిచెప్పుకుంటేనే, జీవితానికి నెమ్మది.”

“సమయానుకూలంగ, సర్దిచెప్పడం, మీకు బాగా అలవాటైంది మామా! భార్యను, కొడుకును నమ్మకుండా, సంపాదనంతా స్నేహితుడి దగ్గర దాపరికం! రూపాయిలేదంటూ నటించి, అన్నిటికీ నాచేత ఖర్చుపెట్టించి నన్ను అప్పులపాలు చేయడం! అదేమంటె, కొడుకువుగా, అది నీ బాధ్యతని సర్దిచెప్పడం! ఇది, మీకే చెల్లింది. అందుకు తగిన శాస్తి జరిగిందిగా!... ఏమో... ఇదీ నటనేనేమో!... సర్దిచెప్పడంలో భాగమేనేమో!”

“ఒరె, అనవసరంగా మాట్లాడకురా! జరిగిందేదో తెలుసుకోకుండా, నోటికొచ్చినట్లుగా మాట్లాడతావే? ఆ పిల్లవాడి తండ్రికి, ఎప్పటినుండో సుస్తీ! అయినా, బాగానే తిరుగుతుండేవాడు. యింత త్వరలోపోతాడని ఎలా అనుకోగలం, నిశ్చితార్థం జరిగినాకే ఆయన పోవడం, వాళ్ళందరికీ అనుమానం కలిగింది. అది సహజమేగా! నిశ్చితార్థానికే ఇంటియజమానిపోతే, తీరా కళ్యాణమైతే, ఏమవుతుందో అనేది వారి భయం. అందుకే ధైర్యంచేసి, వాళ్ళు ముందుకు రావడంలేదు. అనుకున్నట్లుగా, ఆ కాస్త జరిగిపోయివుంటె... అందరికీ, బాగానే వుండేది మరి!”

“అందరికీ అనకు! నాకు అన్యాయం జరిగింది. ఆ దాచుకున్న మొత్తాన్ని, పెండ్లిపేరుతో ముందుగనే తెచ్చుకుని వుంటారు. అదే నిజం కాకపోతే, యిప్పటికైనా నిజం చెప్పాలి... స్నేహంపేరుతో ఆయన్ను,

ప్రేమ నటించి నీ మేనకోడల్ని, మోసగించిన వాళ్ళసంగతిని నేను తేలుస్తాను. ఆ డబ్బు ఎలారాదో నేను చూస్తాను... తండ్రిపోయాడు... సరే! ఇంతకాలం ప్రేమించాననని, పెండ్లికి నిశ్చితార్థం జరిపించిన ఆ ప్రేమికుడు, యిప్పుడు మొహం చాటెయ్యడం ఏమిటి? దీనినిబట్టి తెలియడంలా, వాళ్ళు మోసగాళ్ళని, అవసరాలు గడుపుకునేవాళ్ళని! అలాటి నమ్మక ద్రోహులతో పెళ్ళిసంబంధం ఏమిటి? ఈ షాక్‌నుండి, మీ బావగారు కోలుకోవడం ఎలావున్నా, ఆయన, మనతో కలిసివస్తే... వెళ్ళి, వాళ్ళ దగ్గరున్న మన డబ్బుమొత్తం వచ్చేలా ప్రయత్నిద్దాం!"

"డబ్బు సంగతి అలా వుంచరా! ముందు, నీ చెల్లిసంగతి ఆలోచించు."

"డబ్బులేకుండా, ఆలోచించేదేముంటుంది? వాళ్ళనుండి, రావలసింది వచ్చేస్తే... సంబంధాలే కరువా? వాళ్ళతో సంబంధం ఎలాగూ జరిగేదికాదు. ఒకవేళ, తప్పనిసరై జరిగినా, అలాంటివాళ్ళ కొంపలో, యిది, సుఖపడేదేముంది? ముందుగా, వాళ్ళదగ్గరున్న డబ్బును రాబట్టుకుని, ఆ సంబంధాన్ని వదులుకోవడమే అందరికీ మంచిది... ఆయన్నడుగు ఏమంటాడో! ఆయన ముందుంటేనేగదా, మనం ఏవైనా చేయగలం."

"ఏం, బావా! విన్నావుగా వాడిమాటలు. ఏం చెబుతావ్?"

"ఆయన చెప్పేదేమీలేదురా! ఎవరికి ఎలా జరగాలో, అలాగే జరుగుతుంది. 'విధి' అన్నావుగా! దాని పెళ్ళి విషయంలో, వాడికేమీ సంబంధంలేదు."

"నాకు సంబంధం లేదా?"

"అవున్రా! మా విషయంలో నీకేమీ సంబంధంలేదు. చావు బ్రతుకుల మధ్యవున్న తండ్రిని పట్టుకుని... నీ యిష్టంవచ్చినట్లు

నానామాటలన్నావ్... ఆనాడు ఏమన్నావో, గుర్తులేదా? ఆయన బ్రతికివున్నన్నాళ్ళూ, భార్యగ సేవచేసుకో... ఆ తరువాతే, కొడుకుగా, నీ బాధ్యతన్నావ్. ఆయనింకా జీవించేవున్నారు వుంటారు. భార్యగ నేను సేవ చేసుకుంటూనే వుంటాను. ఇహ మీదట మా విషయంలో నీకేమీ సంబంధం లేదు."

"సరే! చూస్తాను, ఈ పట్టుదలలు, బెట్టుసరులు ఎన్నాళ్ళో!"

"ఒరే, తప్పురా! నీవు, అలా మాట్లాడకూడదు."

"నీ దృష్టిలో, ఆమె అన్నది రైటే! నేనన్నది మాత్రం తప్పు! అంతేనా? అంతే మరి! ఆమెకు అన్నవుగా నీవు! అలాగే అంటావు మరి!"

"నీవూ, నీ చెల్లికి, అన్నవేగదరా?"

"సరే మీ యిష్టంవచ్చినట్లు చేసుకోండి. నా అవసరం. వచ్చినప్పుడె, వస్తాను..."

"వాడి మాటలకేంగాని, వాళ్ళతో నేను మాట్లాడతాను. ఆ కుర్రాణ్ణి కూడ అడుగుతాను. వాళ్ళ మనసుల్లోవున్న అనుమానాన్ని తొలగించే ప్రయత్నం చేస్తాను. మీరు వర్రీకాకండి. పీటల మీద పెళ్ళిళ్ళు ఎన్ని తప్పిపోవడంలేదు. అన్ని విధాల ప్రయత్నిద్దాం. అంతకీ అదికాకపోతే వేరే మార్గం చూద్దాం. దానికి మేనమామగ, నా బాధ్యత నాకు తెలుసు. మీరు నిశ్చింతగ వుండండి."

m m m

# 3. స్వేచ్ఛ

"కాలం మారింది  కళ్ళుతెరవండి! ఆడదంటె, మగవాడికి, వూడిగంచేసే, మరబొమ్మకాదు. మొగుడొదిలేస్తే! మొహమెత్తుకుని తిరగలేని కాలంకాదిది. సాగినన్నాళ్ళు సాగించారు మగవాళ్ళు సంసారాలకు 'బాస్'లుగ! ఇహ, దానికి 'ఫుల్‌స్టాప్' పెట్టుకోవాలి మీరు! మగవాడి పోషణలేకపోతే బ్రతకలేనిరోజులు పోయాయి. భర్త కేరాఫ్‌తోనే బ్రతకవలసిన అవసరం భార్యకులేదు. భర్తచాటు భార్య, కొంగుచాటు యిల్లాలుకాదు నేటి స్త్రీ. మారిన కాలాన్ని మన్నిస్తేనే, మన్నన, మర్యాద మిగులుతాయి, మగవారికైనా! డబ్బుతోనే వుంది బ్రతుకనుకుంటె, ఆ డబ్బును మగవాడే గడించక్కర్లేదు. అవకాశమిస్తే, అంతకంటె ఎక్కువగనే సంపాదించగలదు ఆడది. కండబలం, సమాజం అండ, ఆస్తిహక్కు, ఆచార పంజరాలు, యివి, యీనాడు చాలవు, స్త్రీని బానిసగ బంధించివుంచడానికి! ఆదాయ మార్గాలు, ఆస్తిహక్కు, ఆడవారికీవచ్చాయి. ఆచారశిథిలాలపై ఆధునిక సౌధాలు వెలిశాయి..."

"కాలం, మారదు  మారేదికాదది! ఇప్పుడూ రోజుకు యిరవైనాలుగు గంటలే! పగలూ రాత్రి, మామూలే! ఋతువులు క్రొత్తవికావు. నీ కళ్ళల్లో పొరలు పెరిగాయి. అంతే....! అదే మార్పు! అందుకే, ఉదయం సాయంకాలాలు తారుమారుగ కన్పిస్తున్నాయి. కుడి, ఎడమ, ఆడ మగ, భార్య - భర్త...., యివన్నీ నీకు అలాగే కన్పిస్తున్నాయి. రాజకీయానికి, యిది వరకు నోటు కోసమె కక్కుర్తి, యిప్పుడు ఓటు కోసం ముష్టి! రాజ్యాధికారంకోసం, రాజనీతిని మార్కెట్‌చేస్తూ, ఆడవాళ్ళ ఓట్లు కోసం, అంగలార్చడంతో, మీ

యింపార్టెన్స్ పెరిగిపోయింది. జీన్స్‌వేసుకుంటేనే జండరు మారదు. ఆడది, ఉద్యోగం చేస్తేనే, తూర్పుపడమరలు, తారుమారుకావు. ఆడ–మగ భేదం పుట్టుకతోనే వచ్చింది. హైటెక్, ఆడదాని 'నిక్కు', ఆ తరువాతే వచ్చాయి. నీవన్నట్లు నిజంగా ఆడదానిలో అంత సత్తావుంటె... కోటాలు కోరడం ఎందుకు? సీట్లు కావాలనడం ఎందుకు? మగవాళ్ళతోపాటు, అన్ని సీట్లకు, ఉద్యోగాలకు పోటీచేసి, వాటిని గెలుచుకోవచ్చుకదా! పులినిచూచి, నక్కవాతలు పెట్టుకున్నట్లు, వెర్రిమొర్రి వేషాలెయ్యకు. రోడ్‌షోలా డైలాగులు వాగకుండా, బుద్ధిగ, మొగుడితో కాపురంచేసుకో! పిల్లల్నికని, వాళ్ళను మంచి పౌరులుగ తీర్చిదిద్ది, ఇల్లాలివిగ ఋజువుచేసుకో! అలా, మంచి వ్యవస్థ నిర్మాణానికి నీ వంతుగ వుపయోగపడు. అందుకోసం మొగుడిపై తిరుగుబాటుచేసి విప్లవ వనితగా పిలిపించుకోనక్కర్లేదు. ***బాధ్యతతోనే హక్కులుంటాయి... ప్రవర్తనతోనే వ్యక్తిత్వముంటుంది. బాధ్యతలను వదిలేసిన వ్యక్తి బ్రతుకు, దారం తెగిన గాలిపటమే! అర్థం చేసుకో! మనిషి తనలోని ఆత్మను మరచి, మరోలోకాలలో దేవుణ్ణి చూడాలనుకున్నట్లు, వ్యక్తిని వదలి, స్వేచ్ఛ, ఎక్కడో వుండదు. స్వేచ్ఛను అనుభవించేది, మనసు మాత్రమే! అది, మనిషిలోనే వుంటుంది... కర్తవ్యం–కర్మకు, స్వేచ్ఛ–అనుభవానికి వుంటాయి.*** ఆలకించిన నా మాటలను ఆలోచన చెయ్యి... విప్లవ వేషాలతో, నినాదాలతో, ఊరంతా తిరిగినా..., వుండే చోటుకు చేరుకోవలసిందే ఎవరైనా! ఈ వాస్తవాన్ని గ్రహించి, పైత్య ప్రలాపాలు, మానుకో! రూపాయి సంపాదనతోనే, మనిషి రూపుమారిపోతుందా? హోదాలో చేరగానే, ఒరిజినాలిటీ పోతుందా? లెఫ్ట్‌హాండ్ రైటింగ్ నేర్వగానే, కుడి ఎడమలు, తారుమారుకావు. క్రోమోజోములు, చోట్లు మారవు."

"మీ సుదీర్ఘ హితోపదేశానికి థ్యాంక్స్! ఆకాశబరువునంతా, తనకాళ్ళతోనే మోస్తున్నట్లు అనుకుంటుందంట వెల్లకిలా పడుకునే అదేదోపిట్ట! తన కోడి లేకపోతే, తెల్లవారదనుకుందట, వెనకటికి ఎవరో ముసలి! అలా వున్నాయి మీ పోచుకోలు మాటలు, డబ్బా వాయింపు! ఊహతోనే గ్రహించాలి వివేకి! చూపుతోనే తెలుసుకోవాలి, తెలివైనవారు. అనుభవిస్తూ కూడ అర్థం చేసుకోలేనివారిని ఏమనాలో తెలియడంలేదు. మీరూ, ఆ బాపతే! ఆడదానిగానే కాదు, మనిషిగా, నాలో వుంది స్వేచ్ఛా – వాంఛ! రాజ్యాంగంలోనూ ఆ మాటేవుంది. లిబర్టీస్టాట్యూ కూడ, చెయ్యెత్తి, దానినే చాటుతోంది లోకానికి! బర్త్‌కు, డెత్‌కు వేరే బెర్త్‌లులేవు. గాలిపీల్చడానికి, ఆడ – మగలేదు. ఆకలికి – దాని నిద్రకు ఆ భేదంలేదు. ప్రాణానికీ అంతే! ఆత్మ వుందో లేదో తెలియదు. ఉంటె, దానికి ఆ తేడా వుండకూడదు. మతం – వేదాంతమూ అంతే మరి! ఇవి, యిలా వుంటె, కాపురానికే వచ్చిందా ఆడ – మగ, కుడి – ఎడమ భేదాలు! ఇదే చెప్పడం. ఆడ – మగ జెండర్ భేదంతో, వ్యక్తి స్వేచ్ఛను కాదనడమంటె..., ఉదయించే సూర్యుణ్ణి వద్దనడమే! ఇళ్ళమధ్య వీధులు, కాంపౌండ్‌వాల్సున్నట్లే – ఆడ – మగ, ఎవరి హద్దుల్లో వారుండాలి! గోడదూకి, మగవాడు, ఆడదానిపై అధికారం చెలాయించకూడదు. అది నేరం సుమా! సంసారంలో, భార్య – భర్త, ఎవరి స్వేచ్ఛను, వారు అనుభవించాలి. ఒకరికొకరు అడ్డురాకూడదు. ***స్వేచ్ఛలేని మనిషి జీవచ్ఛవమే! జనాభా లెక్కకే...!***

"స్త్రీవాదం, నీకు, బాగా తలకెక్కినట్లుంది. ఆ 'కిక్'తో, తలతిక్కగా, తలక్రిందులుగా మాట్లాడుతున్నావ్! దాని పరిణామ ఫలితం భవిష్యత్‌లో ఎంత తీవ్రంగ వుంటుందో, నీకు, యిప్పుడు

తెలియడంలేదు. చెప్పినా అర్థంచేసుకునే స్థితిలోలేవు. అనుభవిస్తేనేగాని, తత్వం బోధపడేటట్లులేదు. ఆవేశం వదలి ఆశయాల వేడిని తగ్గించుకుని, ఆలోచనలోకివచ్చి, ప్రకృతిసహజతను పరిశీలించు. వాస్తవం, నీకే తెలుస్తుంది. కుటుంబంలో, సమాజంలో, చివరికి మతాచారాలలోకూడ స్త్రీ ప్రాధాన్యతను, బాధ్యతలను, హక్కులను ప్రకృతే ప్రసాదించింది స్త్రీకి! వాటిని భద్రంగా, కాపాడుకోవాలి. ***ప్రకృతి ధిక్కరణ, పతనానికి ప్రారంభం!*** ఉద్యమాల ఉపన్యాసాలు, విన్యాసాలు జీవితానుభవానికి దూరం! నాయకుల ఉద్బోధనలు, ఉద్ఘాటనలు, నీలాంటి యితరులకే! వాటి వేడి, ఉష్ణం, బుద్ధికిపట్టి, కూర్చున్న కొమ్మను నరుక్కున్నట్లుగ, జీవితాలనే నాశనం చేసుకుంటున్నారు. నా మాటలలో అన్నిటినీ కాకపోయినా, కొన్నిటినైనా నీ ఆలోచనలోకి తెచ్చుకోగలవని నా నమ్మకం  నీ యిష్టం!"

m m m

"ఏంటీ, మీ ఆయనతో గొడవపడ్డావుట!"

"గొడవకాదది! స్వేచ్ఛకు, నిర్బంధానికి మధ్య జరిగిన పోరాటం! స్త్రీశక్తి – పురుషాధిక్యాల ఫేస్ టు ఫేస్ స్ట్రగుల్!"

"పెద్దమాటలెందుకుగాని, మామూలుగ మాట్లాడు, నేను యావరేజ్ మనిషిని కదా! సింపుల్‌గ చెప్పు సంగతేమిటో!"

"వేరుగ చెప్పేదేముంది? ఆడదాన్ని 'అబల' అనడం, మగవాడు, తాను మొనగాడిననుకోవడం, యీనాటిది కాదుకదా! తరాల సీనియారిటీవుంది దానికి, అదే, మా యిద్దరి మధ్య తలెత్తి చూచింది. నేను, ఎదురు చెప్పాను. దానితో, ఆయన పురుషాభిమానం దెబ్బతిన్నట్లుంది. సహించలేరుకదా! అదే, మా గొడవ!"

"నేను కామన్ పర్సన్‌ను కదా! తేలిక మాటలలో చెప్పు, జరిగినదేదో!"

"నీలాంటి కామన్‌పర్సన్స్ - మొగుడి బానిసలు - పతివ్రతలతోనే యీ మగజాతి మీసాలకు కొమ్ములచ్చాయ్. వాటితో ఆడదాని బ్రతుకులకు అన్నీ గాయాలే!"

"మీసాలకు కొమ్ములేంటేబాబు?"

"అదె, పురుషాహంకారమంటె! పెళ్ళాలపై మొగుడి అధికారం! రాజకీయ పార్టీలకు స్వాతంత్ర్య మొచ్చిందిగాని, ఆడదాని స్వేచ్ఛకు, అది, యింకా రాలేదు. దానికోసం, మరో స్వాతంత్ర్య ఉద్యమం సాగాల్సిందే!"

"అహంకారమనేది, అంతో యింతో, అందరిలోనూ వుంటుంది. అది సహజం! దానికి, మగవాణ్ణే అనుకోవలసినపనేముంది?"

"చెప్పానుగా, నీవు పతివ్రతవు... మొగుడి డిపాజిట్‌తోనే బ్రతుకుతావు. నీలాటి వారికి, అది సరిపోతుంది. అందరూ నీలాగే, మగవాడి కాలి చెప్పుగ నలగాలంటె, ఎలాకుదురుతుంది? మనిషికి, వ్యక్తిత్వం అవసరం."

"ఇంతకూ, ఏమంటాడు మీ ఆయన?"

"ఏమంటాడా? చెప్పమంటావా? అయితే విను. సమాజంలో జరిగే అక్రమాలకు, అత్యాచారాలకు ఆడదే కారణమట! ఫ్యాషన్లపేర, ఆడదాని విచ్చలవిడితనంతో, సమాజం చెడిపోతోందట! సినిమాలు - టి.విలలో, ఆడవాళ్ళు, ఒళ్ళుదాచుకోకుండా చేసే, వికార విన్యాసాలు, భావిపౌరులను సెక్స్ బానిసలుగ చేస్తున్నాయట. అర్ధరాత్రి సినిమాలు అందరినీ మ్యానియాలుగా మారుస్తున్నాయట. పడకటింటిసీన్లు, పబ్లిక్

పార్కులైతే ఎలా అని ప్రశ్నిస్తున్నాడు. ఆడదానికి, తాళికట్టడమే, కట్టుబాట్లలో బ్రతకమని చెప్పడమట!... కాలిమెట్లనుండి చెవిదుద్దుల వరకు, ఆడదాని అలంకారాలన్నీ, అందుకే గుర్తులట! తాళిని పర్సులోదాచి, శీలాన్ని చీలకు తగిలించి, బరితెగించి బజార్లలో బలాదూర్ తిరుగుతున్నారట గృహిణులు! అలా, అడతనాన్ని చూపించి, మగవాళ్ళను మాయలో ముంచుతున్నారట! హక్కుల పోరాట ఉద్యమాలతో, రాజకీయాలతో, కుటుంబాలు కూలిపోతున్నాయట! భార్యను అర్ధాంగిగా చెప్పుకుంటూ, స్త్రీని దేవతగ పూజించే మగభక్తులు అనవలసిన మాటలేనా యివి? ఇలాటి, బుద్ధి జ్ఞానంలేని మాటల్ని ఎన్నాళ్ళని ఓర్చుకోవాలి? పైగా, ఎలక్షన్ కోడ్‌లాగ, రోడ్‌రూల్సులాగ, కాపురం చేసే ఆడదానికి స్పెషల్ ఆంక్షలుండాలట! కుటుంబ పరువు మర్యాదలు, వంశగౌరవాలు, వాటి మంచిచెడులను ఆడదే కాపాడాలట! ఆడదానికే అన్ని బాధ్యతలైతే, మరి, మగవాడెందుకున్నట్లు? 'నాగోడు వినరా మగోడా అంటె... హద్దుమీరకే ఆడదానా' అన్నట్లు గోడకు తిరిగి పడుకునే మొగుడికి ఏమని చెప్పాలి? అంత లెక్కలేదా ఆడదంటె? పడకసీనూ ఆడదే! పిల్లల్ని కనడమూ ఆడదే! చాకిరేవుతో సహా చాకిరి చేసేదీ ఆడదే! వండిపెట్టేదీ ఆడదే, పండపెట్టేదీ ఆడదే!... సంపాదించే ఆడదానికీ తప్పడంలేదు యీ సంసార బానిసత్వం! ఆడదై పుట్టడమే అపరాధమా? తిరగమోతవేస్తేనే, కూరకైనా, పచ్చడికైనా, చారుకైనా టేస్ట్! తిరుగుబాటు చేస్తేనే ఆడదానికి బెస్ట్, రెస్ట్! అదే చేశాను మా మూర్ఖుడితో! దానితో రెచ్చిపోయాడు పిచ్చి మొగుడు! నిండా మునిగితే, చలే లేనట్లు, తెగించి సాగించాను, సంసార తిరుగుబాటు. అలా, అనుసరించాను మహిళా పోరాట మార్గాన్ని."

"దేనినైనా, తెగేదాకా, సాగతీయకూడదు. అయినా, ఎక్కడైనా

సాయుధ తిరుగుబాటు, ప్రజల తిరుగుబాటు, సాయుధ- పోరాటం వుంటుందిగాని, సంసార తిరుగుబాటంటావేంటి? ఎక్కడా వినలేదు మరి!"

"వినవులే నీవు! పతిసేవ నీకు సౌండ్ ప్రూఫ్! అదే నీకు రెయిన్‌కోటు కూడ! బాహ్య ప్రపంచం నీకు వినిపించదు, కనిపించదు. హక్కుల పోరాటం, సమాజ నిర్మాణం – నూతన వ్యవస్థ ఆవిర్భావం... ఇవి, అభిమానమున్న ఆడదానికి ఆశయాలుగ వుంటాయి. నీకు కాదులే!"

"అవన్నీ నాకు అర్థంకావుగానీ, నన్ను కుదురుగా కాపురం చేసుకోనివ్వు!"

"ఎవరొద్దన్నారే నిన్ను, కట్టుబానిస! కట్టించుకుంటె తాళి, కావలసిందే నా కట్టుబానిస? పశువుకూ వుంటుంది మెడలో తాడు! అది, దానిని పెంచుకున్న వారికి బానిస! ఆడదాని బ్రతుకూ అంతేనా? ఆలోచన అవసరంలేదా? విచక్షణా జ్ఞానం వద్దా? నీలాంటివాళ్ళ సంగతి కాదులే నేను చెప్పేది. నీవు, 'ప్రత్తి' వ్రతవు ఏకి, గింజలు తీసి, నూలుతీసి బట్టనేసి, కట్టుకుంటాడు నిన్ను నీ మొగుడు, అతుక్కుపోయి వుంటావు. అది, నావల్లకాలేదు. ఉతుకుడూ వుంటుందిలే అప్పుడప్పుడు!"

"ఇంత ఘోర్సున్న దానివి మగాణ్ణెందుకు చేసుకున్నావే బాబు? ఆ పనేదో నీలాటి మరో ఆడదానితో జరిపించుకుంటె, మొగోడి గోల వుండేది కాదుగా?"

"అది వ్యక్తిగత ఏకపక్షం!... అధికార ప్రతిపక్షాలుగ రెండుగ వుంటేనే అది ప్రజాస్వామ్యం. ఆడ – మగ, భార్యభర్త, వుంటేనే సమాజం. అప్పుడె, అది, ఆలు–మగల పోరాటం! అది ఏదైతేనేమి?"

"ఎక్కడ తిరిగినా యిల్లుంటేనే అది స్థావరం. ఏం చేయడానికైనా చేయించుకోడానికైనా, స్థానం కుటుంబమే! సంసారాలలో జరగవలసినవి పోరాటాలు కాదు అవి బ్రతుకు ఆరాటాలు మాత్రమే! భర్త – భార్య అందుకు సమరయోధులు! వారు శత్రువులుకారు... వారి తరాల భవిష్యత్, వారి ఆరాటం కావాలి. కనుక, ***దంపతుల మధ్య వుండవలసింది పరస్పర సహకార అవగాహనేకాని, అపార్థంకాకూడదు. వాళ్ళిద్దర్నీ కట్టేసి, పట్టేసి వుంచేది, పరస్పర ప్రేమ, అనురాగం, ఆప్యాయత, బాధ్యత! బాధ్యతను, భారంగ బానిసత్వంగ భావించరాదు. కుటుంబం, వ్యవస్థకు, పునాది. భార్య – భర్త, అందుకు కర్త, కర్మలు! పునాది బీటలు వారితే... కట్టడానికి 'రూపు' సరిగా వుండదు. దానితో వుపయోగమూ వుండదు. ఎవరి బాధ్యతలతో వారు, సంసార జీవితంలో భార్య – భర్తగా సమాన భాగస్వాములే!*** ఆలోచన విచక్షణ మానవ జాతి ప్రత్యేకత! జ్ఞానం – నాగరికత, సభ్యత, స్థిరత దానిలో వుంటాయి. ఆడ – మగ తమ మనసులు కోరిన వారిని చేరడం, బెదిరిపోవడం, సమాజ సభ్యతకాదు. అదే అయితే, త్రాగడం – తినడం – సుఖించడం, ఇంతవరకే తెలిసి, అలవాటుగ బ్రతికే మిగతా జీవులకు, మనిషికి భేదం కన్పించదు. ఆ స్థితిలో సంతానం 'స్ట్రీట్ చిల్డ్రన్' తెగకే చెందవలసి వస్తుంది. అదే తీరులో సమాజ స్వరూపాలు ఎలా తయారవుతాయి? యోచించు. అది, ఆటవిక స్థితే సుమా! ***'స్వేచ్ఛ' అనేది, స్థిరతలేని జీవితానికి సంకేతంకాదు. పౌరధర్మం, మానవజాతికి ప్రాథమికం... భార్య భర్తగ ఒక చోటుకు చేరిన వారికి, సివిల్ హక్కులుంటాయి. కుటుంబపరంగ పౌరబాధ్యతలూ వుంటాయి. పరస్పర అనుమానం, అసహనం, అయిష్టత, అపోహలే, వారిద్దరి మధ్య దూరాన్ని పెంచుతాయి.***

**సమాజంలో మనిద్దరం, అనుకోవడంతోనే, కుటుంబ వ్యవస్థ ప్రారంభమవుతుంది. అదే సమాజ శ్రేయస్సుకు, వుపయోగం! వ్యవస్థలోని, ప్రతి కుటుంబం, యీ అవగాహనతో వుంటె, కుటుంబాల సమష్టితే సమాజం కనుక, వ్యవస్థలో స్థిరత వుంటుంది.** ప్రజాస్వామ్యంలో రాజకీయం ప్రజలకు మేలు చేయవలసిందిపోయి, ప్రజల అవసరాలను, వారి బలహీనతను, తమ స్వార్థానికి వుపయోగించుకుంటూ, కుటుంబ వ్యవస్థను సమాజ సామరస్యతను ఛిన్నాభిన్నం చేస్తోంది. శత్రుత్వాన్ని వృద్ధి చేస్తోంది... నామాట ఆలకించి, వ్యక్తి – కుటుంబం, సమాజం, వాటిమధ్య వుండవలసిన సామరస్యం, పౌర బాధ్యతలు, హక్కులు – స్వేచ్ఛ... వీటిని గురించి యిప్పటి వరకు నీలో నినాదాల వేడి ఆలోచనలను, స్థిమితపరచి, మరో కోణంలో ఆలోచన చేసుకో! అది, అందరికీ మేలుగ వుంటుంది."

"నీ పాత చింతకాయ తొక్క ఉపన్యాసం యింతసేపు ఆలకించేటప్పటికి, నా తల ప్రాణం తోకకొచ్చిందిగాని... యిలాటి పనికిమాలిన చచ్చు సలహాలు, మరెక్కడా చెప్పకు. వినడానికే తలపోటుగ వుంది. ఇలాటిది మహిళా సమాజం దృష్టిలో పడిందంటె... నీ కాళ్ళూ – చేతులువేటికవే, పార్టులుగ విడదీస్తుంది... సాగిపోతోంది స్త్రీ శక్తి, ప్రగతి వైపు ప్రపంచవ్యాప్తంగా! పురుషాధిక్యతపై జరిగే పోరాటంలో. అంతిమ విజయం ఆడజాతిదే! నేటికే, పురుష ప్రపంచం అదిరి నడుమువరకు కదిలింది. అందుకే, దాని నుండి తప్పించుకోడానికి వీలులేని స్థితిలో స్త్రీ హక్కులకు సంబంధించి కొన్ని చట్టాలు చేయక తప్పడంలేదు. భర్త అహంకారానికి, అధికారానికి, ముక్కుతాడు పొడవడానికే, ఫ్యామిలీ కోర్టుల యేర్పాటు జరిగింది. అలాగే, తండ్రి ఆస్తిలో, మగపిల్లలతోపాటు, సమాన వాటాను

లభింపచేయడానికి, చట్టం చేయబడింది. ప్రజాప్రాతినిధ్యంలో, శాసనాధికారంలో, జనాభా ప్రాతిపదికన సీట్ల కేటాయింపు, ఉద్యోగ రిజర్వేషన్లు, అలాగే, ఉద్యోగ నిర్వహణలో సమాన వేతనం, అన్నింటా సమాజంలో గౌరవస్థానం – వీటికోసం, స్త్రీ శక్తి, పోరాటం సాగిస్తూనే వుంటుంది. అలా, సాంఘిక ఆర్థిక, రాజకీయ, విద్య – సాంస్కృతిక రంగాలన్నింటిలోనూ, సైన్స్ టెక్నాలజీలలో కూడ, పురుషాధిక్యతను తగ్గించి స్త్రీ, పురుష సమానతను సాధించడమే, మహిళా పోరాటధ్యేయం! అయినా, నీలాంటి తిరోగమన దద్దమ్మలు వెనుకకు నడిచే వీరమ్మలు, చచ్చు సలహాదారులు, సమాజంలో ఎప్పుడూ వుంటూనే వుంటారులే!"

"మీరేదో గొడవపడ్డారని, సర్దిచెప్పడానికి, స్నేహితురాలిగ నేనొస్తే..., విప్లవనారిగా, వుపన్యాసం చెప్పావు... ఇలా మళ్ళీ ఎప్పుడూరానుగాని, ఒక్కమాట! చట్టాలను చూచి, చంకలు గుద్దుకోవద్దు. కోర్టుల్ని నమ్ముకుని, కాపురాలు కూల్చుకోవద్దు. ఉద్రేక ఊహలతో, జీవిత భద్రతను కోల్పోకు... ఇహ, నీ యిష్టం!"

"రానంటావేంటి? ఉద్యమపోరాటానికి, వ్యక్తిగత స్నేహానికి సంబంధం ఏమిటి? నా యింటికి నీవు రాకపోయినా, నీ యింటికి, నేను రాకమానను. స్నేహితులుగ, మనిద్దరి మనసులు, మాట్లాడుకున్నాయిగాని, పోట్లాడుకోలేదుగా!... నేనూ ఒక మాట చెబుతాను. ఒకవేళ వ్యతిరేక పరిస్థితులలో నేను అన్నిటినీ పోగొట్టుకోవలసివచ్చినా... నిన్ను, నీ స్నేహాన్ని నిలుపుకుంటాను, తుది వరకు. ఇది, నా ప్రామిస్!..."

"అరుణా!"

"కరుణా! చనువుతో నేనన్న మాటలకు నొచ్చుకోవు కదూ!

నాతో స్నేహాన్ని, వదలుకోవుగదూ”

“మనది, అంతరాత్మ బంధం! ఆత్మీయతా రాగం! ఈ శరీరాలు వున్నంత వరకూ ఆ బంధం వుంటుంది. మన స్నేహం నిలుస్తుంది... వస్తా.”

“వెళ్దువుగాని ఇంకా, కొంతసేపుండు మనసు బాగోలేదు.”

“అది, మన చేతుల్లోనే వుందిలే!”

“కాఫీ తెస్తా వుండు!”

m m m

“మీ వివాదం, విడాకుల వరకు వచ్చిందని విన్నాను నిజమేనా?”

“నిజమేనండీ! అయినా! ప్రస్తుతం అది, అనుకోవడం వరకే ఆగివుంది.”

“అంతదూరం రానీయకుండా జాగ్రత్తపడాల్సింది.”

“జాగ్రత్తేముంది? ఎవరికైనా వ్యక్తిత్వం ముఖ్యం కదా! హక్కులు వదులుకుని, మొక్కుబడిగా, బ్రతకలేంకదండీ! స్వేచ్ఛను పోగొట్టుకుని జీవచ్ఛవంలా తిరగలేం కదండీ!”

“నీవనేది, నీ వరకు నిజమేకావచ్చు! దానిని నేను కాదనను. మహిళా ఉద్యమంలోని సీనియర్లలో నేనూ ఒకరిని. వయసు రీత్యాకూడ, నేను, నీకంటె, చాలా పెద్దదాన్ని కావడంతో ‘నీవు’ అని అంటున్నాను. మరేమీ అనుకోకు. నీవు, నా కూతురులాంటి దానివి. ఏ రంగంలోనూ నీకు, జీవితానుభవం, చాలా తక్కువే! వయసు వేడిలో, ఉద్రేకం, తొందరపాటు, సహజమే! ఆ వయసులో తీసుకునే నిర్ణయాలు అంత వేగంగానే ఉంటాయి. నా జీవిత అనుభవం నుండి, నీకు

కొన్ని విషయాలు చెబుతాను... వినగలవా?"

"చెప్పండి!"

"నిన్ను అలా చేయమని అననుగాని, నా మాటల్ని కాస్త శ్రద్ధగా ఆలకించు. స్టూడెంటు దశనుండి హక్కుల పోరాటాలతో నాకు సంబంధం వుంది. నాయకత్వ స్థాయిలో కూడ, పనిచేశాను... ఉద్యమ స్ఫూర్తి, నా రక్తంలో యిమిడిపోయింది. అందుకే, యీ నాటికి, అది, నన్ను వదిలిపోలేదు. జీవితాంతం పోదుకూడ! అయితే, వయసురీత్యా వివిధ దశలను అనుసరించి, ఆయా రంగాల వేదికలు మారాయి. అంతే! ఆయా విషయాలు అలావుంచితే... ఏ ఉద్యమాన్నైనా, ఏదో రూపంలో, రాజకీయమే నడిపిస్తూ వుంటుంది... స్వార్థ ప్రయోజనం, దానికి ముఖ్యం!–

ఆర్థిక, అధికార లాభం, ఆధిపత్యం, దాని ఆశయాలు. ప్రజాసేవ అనడం, పై ముసుగు మాత్రమే!... హక్కుల పోరాటాలు అనేకం. అందుకు ఉద్యమాలు తప్పనిసరి! నాయకత్వ నిజాయితీ, సమర్థతపై వాటి ఫలితాలుంటాయి. నాయకత్వాలు ఉద్యమ మార్గదర్శితాలు కావలసిందిపోయి, స్వార్థ ప్రయోజనాలతో, రాజకీయాన్ని ఆశ్రయించినప్పుడు, నిస్వార్థ కార్యకర్తలు బలైపోతారు. ఇది సర్వసాధారణంగ జరుగుతున్నదే!

ఇహపోతే, మనం, ఏ రంగంలో వున్నా, మన వ్యక్తిగతం మనతోనే వుంటుంది. ఏ పరిస్థితులలోనూ, దానికి భంగం కలగకూడదు... ***ప్రియాంబుల్ రాజ్యాంగానికి ఎలాటిదో... మనిషి వ్యక్తిగతం వ్యక్తిత్వం దాదాపు అలాటివే! మేటర్‌కు ఎలిమెంట్ మాదిరిగ, జీవికి ఫైవ్ సెన్సెస్, వ్యక్తిగతం, కుటుంబం, మానవజీవితానికి ప్రాథమికాలు. ఒకరి మంచిని గురించి ఆలోచించే మనని మరొకరు***

**ప్రశ్నించే స్థితిలో మనం వుండకూడదు.** మనిషి మంచిగ వుంటె చాలదు అలా ఉన్నట్లు కూడ తెలియాలి. అందుకే, సర్వీసులో ప్రవేశించేముందు, సెల్ఫ్‌సఫిషియంట్‌గ మనం వుండాలి. భర్తను వదిలేయడమే, పురుషాహంకారాన్ని ఎదుర్కోవడమా?... సంసార బాధ్యతలను లేకుండా చేసుకోవడమే, స్వేచ్ఛకి అర్థమా?... 'మీలాగ మమ్మల్ని కూడా భర్తల్ని వదిలేయమనా మీరు చెప్పేది' అని, ఎవరన్నా ప్రశ్నిస్తే, నీ దగ్గర సమాధానం, ఏముంటుంది? దీనినే, మగవాడు ప్రచారిస్తే, ఆడదాని పరిస్థితి ఏమిటి? ఇలా, వ్యక్తిగతంగా నేను నీకు చెప్పడంకాదు... రాజకీయంతో సహా, ఎవరు ఏ రంగంలో పనిచేస్తున్నా... ముందుగా వ్యక్తిగతానికే ప్రాధాన్యత వుంటుంది. అందుకు కుటుంబం ప్రారంభం! దాని స్వరూప స్వభావాలు ఎలావున్నా? ఆ స్థాయి వ్యక్తిగత బాధ్యతలు, హక్కులు అక్కడినుండే వస్తాయి.

నేనూ అంతే! నా పిల్లలు, స్టేట్స్‌లో వెల్‌సెటిల్డ్! నా భర్త వ్యాపారంలో సంపాదిస్తారు. ఆస్తివుంది. చెప్పానుగా! నాకు ఉద్యమాల చరిత్ర వుందని! అయినా, నా వ్యక్తిగత సంసార జీవితం, సుస్థిరంగానే వుంది. హోదానుబట్టే గౌరవం వున్నట్లు, మన వ్యక్తిత్వం, స్థితినిబట్టే సమాజం గుర్తిస్తుంది... వ్యవస్థ యింకా పురుషాధిక్యతలోనే వుంది కనుక, కేవలం, నినాదాలు మాత్రమే నిజాయితీని నిరూపించవు. సంసారస్థాయినిబట్టే, స్త్రీని అంచనా వేస్తారు, గౌరవిస్తారు. మనలోని మంచితనం ఒక్కటే, మన వ్యక్తిత్వాన్ని కాపాడదు...

స్వేచ్ఛ అనేది, ఎంతో విలువైనది. దానిని ఎంతో జాగ్రత్తగా వుపయోగించుకోవాలి... దానిని సాధించుకోవడమూ అంతే మరి! పబ్లిక్ లైఫ్‌లో సొసైటీ సర్వీసులో నాకున్న సుదీర్ఘ అనుభవంలో నేను

నేర్చుకున్నది నీకు చెప్పాను. ఇవి, ఒక జూనియర్‌కు సీనియర్ చెప్పే సలహాలు మాత్రమే సుమా!”

“మీరు చెప్పింది, నాకు అర్థం కావడంలేదు. ఇంతకూ, నన్ను ఏం చేయమని మీ సలహా?”

“ఏదో చేయమని, ప్రత్యేకంగా నేను నీకు చెప్పడం లేదమ్మా! ఏ రంగంలో వున్నవారైనా గుర్తించవలసింది, మొదటిగా, వ్యక్తిగతం, దాని స్పష్టత! ***ఉద్యమం అనేది, జీవితంలో ఒక భాగమేగాని, పూర్తిగ, జీవితమే ఉద్యమంకాదు, కాబోదు.*** ఉదాహరణకు స్వాతంత్ర్యోద్యమంలో ఉద్యమమే తానునుకుని, సర్వం త్యాగం చేసినవారి అవశేషాలు సహితం అదృశ్యమైపోయాయి. మహాత్ముడి వారసులు మట్టికొట్టుకుపోయారు. ముందుజాగ్రత్త పడినవారికే, తరాల వారసత్వాలు లభించి, లాభిస్తున్నాయి... అందుకే చెబుతున్నా..., ఏ మనిషీ, వర్తమాన ఉద్రేకాలతోనే మిగిలిపోకూడదు. భవిష్యత్ భద్రత కూడ అవసరం.

ఇప్పటికే ఏవేవో చెప్పి నిన్ను విసిగించాను. చివరగా, మరొక్క మాట చెప్పివెళతాను. భార్య మెడలో పసుపుతాడు, అదే మంగళసూత్రం దానిలో జీవంవుంది... శక్తివుంది. అందులో రెండు జీవితాలున్నాయి. క్రమ సంతానం వుంది... వంశం వుంది... తరాల ప్రొసీజరుంది... హక్కు వుంది... శుభకార్య అర్హత వుంది... ఐదోతనంవుంది... స్త్రీగా, దానిని గ్రహించు... వస్తానమ్మా! అప్పుడప్పుడూ కలుస్తూవుంటాంగా!

m m m

***“స్వేచ్ఛ, అంటె వ్యక్తి తనకు తోచినట్లుగ తిరగడంకాదు అనిపించినట్లు ప్రవర్తించడమూకాదు  అలాంటిదానిని విచ్చలవిడితనం అంటారేగాని, స్వేచ్ఛ అనరు...*** స్వేచ్ఛ పౌరునికి, స్వాతంత్ర్యం దేశానికి.

మరొకరి యిష్టాయిష్టాలకు లోబడి, కట్టుబడి బ్రతకడంలో మనిషికి స్వేచ్ఛలేనట్లే! మరో దేశం పాలనలోవున్న దేశానికి, స్వాతంత్ర్యం లేనట్లే! మొదటి దానిని వ్యక్తి బానిసత్వమని, రెండవదానిని పరాధీనత అనాలి... అయినా, **వ్యక్తిస్వేచ్ఛ వ్యక్తినిదాటి, సమాజానికి సవాలుగ, మారకూడదు. వ్యక్తిగతం చట్టాన్ని ప్రశ్నించే స్థాయికి చేరకూడదు. సమష్టిగ, శాంతియుతంగా, సర్కారు చట్టానికి, సమాజ వ్యతిరేకతను తెలియజేయవచ్చు...**"

"ఏమిటీ ఉపన్యాసం మొదలెట్టారు? ఇంటా బయటా యిదే స్టీరియోనా?"

"స్టీరియోకాదు అరుణా! మనిద్దరం పరస్పరం బానిసత్వంలో వున్నామా లేక పరాధీనంలో వున్నామా అనేది, నా బుద్ధికి అందడంలేదు... నీవైనా చెబుతావేమోనని...?"

"ఆ మాటేదో, డైరెక్ట్‌గా అడగొచ్చుగా! ఈ డొంకతిరుగుడెందుకు? అయినా, యిన్నాళ్ళ తరువాత, మీకీ అనుమానం ఎందుకొచ్చిందో!"

"అదీ తెలియడం లేదు నాకు స్పష్టంగా...!"

"స్త్రీ స్వేచ్ఛ, మహిళా సమస్యలు – పౌరహక్కుల పట్ల, మీకు మంచి అవగాహనే వుంది. వాటికి పరిష్కార మార్గాలు, విధానాలు అన్నీ మీకు స్పష్టంగా తెలుసు. నాకంటె ముందు నుంచే, ఈ ఉద్యమంలో మీరు కృషి చేస్తున్నారు. రచనావ్యాసంగంలోకూడ, మీ పుస్తకాలు ఎంతో ఉత్తేజంగా, సందేశాత్మకంగా వుంటాయి. వాటిలో, నా మనసు ప్రతిబింబం వుంది... అలాంటి మీరే, యిప్పుడు, స్వేచ్ఛ – స్వాతంత్ర్యం – బానిసత్వం – పరాధీనంలాంటివి అర్థంకావడం లేదంటున్నారు... నాకు అయోమయంగా వుంది..."

‘‘నేనన్నది, వాటికి సంబంధించిన థియరీకి సంబంధించికాదు. వ్యక్తిగతంగా, మనిద్దరిమధ్య అవి ఎలా పనిచేస్తున్నాయన్నదే..., నాకు అర్థంకానిది!”

“అర్థం సంగతి అలా వుంచండి! మీ మాటలు, నన్ను అయోమయంలో పడవేస్తున్నాయి. మనిద్దరికీ సంబంధించి, మీరనుకునేది ఏమిటి?... స్పష్టంగ చెప్పండి! మనం విప్లవభావాలను కలిగినవాళ్ళం! మాట – బాట – చేత కూడ స్పష్టంగా వుండాలి!... చెప్పండి, మనిద్దరిమధ్యా మీ బుద్ధికి అందనిదేమిటో!”

“ప్రారంభంలో మనం ఉద్యమ పరిచయస్తులం... తరువాత స్నేహితులం సన్నిహితులం... క్రమంగా, సంసార జీవితంలో కుదురుకున్నాం... అదీ యిద్దరి యిష్టంగానే! ఇది, మనిద్దరి వ్యక్తిగతమైన స్వేచ్ఛ! అయినా, యిది లీగల్‌గ, నైతికంగా సరియైనదికాదుగదా? భర్తకు దూరంగ, వ్యక్తిగతంగా, ఆయనతో నీకు ఏ సంబంధం లేకపోయినా, లీగల్‌గా, నీవు యిప్పటికీ ఆయన భార్యవే! దాంపత్య బంధంలో వ్యక్తిగత ‘స్వేచ్ఛ’... చట్టపరంగా నేరమేకదా! భార్య – భర్తను, వేరుగ, యిద్దరు వ్యక్తులుగ చూపించగలిగింది ‘లీగల్‌డైవోర్స్’ మాత్రమే! అది మీ విషయంలో జరగలేదు. కనుక, ఒకరి భార్యతో శారీరక సంబంధంతో, కలిసిమెలిసి జీవించడానికి, వ్యక్తిగతంగా, నాకు (మనకు) గల హక్కేమిటి? మనం మాట్లాడే మానవ హక్కులలో యిది భాగంకాదా? వ్యక్తి స్వేచ్ఛ, యిందుకు మినహాయింపా? సామాజిక నేరం కాదా యిది?...

చట్ట, సమాజ సమ్మతిలేక, కోరుకున్నవారితో కలిసి జీవించడం, వ్యక్తిగతస్వేచ్ఛ కావచ్చునేమోగాని, పౌరధర్మంకాదుగా?”

“ఇవన్నీ, యిప్పుడు గుర్తుకొచ్చాయా మీకు? మీ పుస్తకాలలో,

మీరు వ్రాసిన, వ్యక్తిగత స్వేచ్ఛ, స్త్రీ స్వాతంత్ర్యం యితరులకేగాని అవి మీకు వర్తించవా?"

"వర్తిస్తుంది. కాని, స్వేచ్ఛ అంటె, అది వ్యక్తిగత విచ్చలవిడితనమని, విచక్షణను వదిలేసి, ఎప్పటికప్పుడు, మనసుకు అనిపించింది చేయడమే, వ్యక్తిస్వేచ్ఛ అని, నేను ఎక్కడా వ్రాయలేదే! అలా చెప్పలేదుకూడ!"

"నిజమే! నేను అంగీకరిస్తున్నాను... అయినా, మీరనే విచ్చలవిడితనంతో యిప్పుడు మనకు అవసరం ఏమొచ్చింది?"

"వచ్చిందికనుకే, చెప్పవలసి వచ్చింది...'

"అంటె...?"

"స్పష్టంగా చెప్పాలంటె, వ్యక్తిత్వానికి ప్రాణపదమైన, వ్యక్తిస్వేచ్ఛను, నీవు, నీ వ్యక్తిగత బలహీనతలకు, విచక్షణా రహితంగా విచ్చలవిడిగా వినియోగించుకుంటున్నావ్! అయినా, దానిని ప్రశ్నించే లీగల్ హక్కు వ్యక్తిగతంగా నాకు లేకపోయినా, అండర్‌స్టాండింగ్‌గ యిద్దరం కలిసివుంటున్నాం కనుక, నైతిక 'బేస్'గ యిలా అంటున్నాను."

"ఎన్నాళ్ళనుండి చేస్తున్నారు. యీ నైతిక బేస్ ఆలోచన, పరిశీలన?"

"ఇన్నాళ్ళని స్పష్టంగా చెప్పలేనుగాని, మనం కలిసివున్నప్పటినుండీ, మనసులో ఏదోమూల యీ గిల్టీనెస్, కదులుతూనే వుంది. కాని, అప్పట్లో నేను, దానికి, అంత ప్రాధాన్యతను యివ్వలేదు."

"మరి, యిప్పుడు దానికి, ప్రత్యేకంగా ప్రాధాన్యతనివ్వవలసిన అవసరం ఏమొచ్చిందో!... అయినా, చేసేపని తప్పని తెలిసి, యిన్నాళు ఎందుకు చేయవలసివచ్చింది? నైతిక గిల్టీని మనసులో దాచుకుని,

మిమ్మల్ని మీరు మోసం చేసుకుంటూ, యింతకాలం, ఎలా గడపగలిగారు నాతో?”

“నిజం చెప్పవలసివస్తే నన్ను నేను మోసం చేసుకోవడంకాదు... వ్యక్తిగత బలహీనతకు, ‘స్వేచ్ఛ’ ముసుగుకప్పి, ముఖానికి, ‘సోషల్‌సర్వీస్’ మాస్క్ తొడిగి, కావలసిన రీతిగ కోరికలు తీర్చుకుంటూ, నిన్ను నీవు మోసం చేసుకుంటూ బ్రతుకుతున్నావ్!”

“చాలా దూరం వచ్చిందే...కత:”

“వచ్చింది కనుకే, కళ్ళు తెరచి, వాస్తవాన్ని చూడమని చెప్పడం!”

“సరే!... మీరేవిటో, వాస్తవం తెలిసింది కనుక, ఇహ, వాదన వద్దు. శరీరంలో ‘ఆత్మ’ వుంటుందంటారు. అది, నిజమోకాదో, నాకు తెలియదుగాని... మనసు దాచిన ‘అసలు’ను చెప్పేదే అంతరాత్మకావచ్చు. ఇన్నాళ్ళూ, మీ మనసుదాచిన, మీ ‘అభ్యుదయ’ నటన, దాని నిజరూపం, యిప్పటికైనా తెలిసింది... నమ్మడం...మోసం పోవడం...నా బలహీనత!”

“నమ్మకానికి నికరంలేనప్పుడు, జరిగేది మోసపోవడమేమరి! ఆ స్థిరత నీకు లేకపోవడమే, కథ యింత దూరం రావడం!”

“థ్యాంక్స్! ఇప్పటికైనా, నిజం చెప్పారు. ఇహమీదట మనం పరిచయంలేని ఆనాటి వ్యక్తులమే.!”

“ఆ తొందరపాటే, మీ...”

“...ప్లీజ్! నా నిర్ణయం చెప్పానుగా... అది, అంతే!”

“అది, ఏకపక్ష నిర్ణయమే!”

“మీ నిర్ణయం, మీ యిష్టం! దానితో నాకు ప్రమేయంలేదు.”

“కలిసి, కొన్నాళ్ళు జీవించాం...!”

"కాదు, యిన్నాళ్ళూ నటించాం! ప్లీజ్. యిహ, నన్ను మాట్లాడించకండి!"

mmm

"స్నేహితురాలివని, నీ మేలు కోరి, నేను చెప్పిన మాటల్ని, ఆనాడు నీవు లెక్కచెయలేదు... ఇప్పుడుచూడు, తలతిరిగి, ముద్దనోట్లోకొచ్చింది."

"అయితే ఏంటంట? వాంతి చేసుకుంటే, అదే పోతుంది. మళ్ళీ... ఫ్రెషప్!"

"నీకు బుద్ధిరాదేబాబూ!"

"కొత్తగా వచ్చేదేంటి? మనిషికి ఏదో ఒక బుద్ధి, ఎప్పుడూ వుంటూనే వుంటుంది వెరైటీగా!"

"నీ నిబ్బరానికి చెప్పుకోవాలె! తలబొప్పికట్టినా..., టోపీ పెట్టుకుని తిరుగుతావ్!"

"ప్రజాసేవలోవుండే వారికి, పాట్లుతప్పవ్! ఆటూపోట్లు మామూలే! వెన్నుపోట్లూ అంతే సహజం! అన్నిటినీ భరిస్తూ, ఏమీ జరగనట్లు, ముందుకుపోతూవుండాలి మరి! మడం త్రిప్పగూడదు."

"నీకు, పెళ్ళిలేకుండా వుంటె, బావుండేది!"

"అదీ నిజమే! అప్పటికి నాకు యీ నాలెడ్జి, ఎక్స్‌పీరియన్స్, లేవుగా! అలాగే, నీలాగ, బోడి సలహాలు చెప్పేవారూ లేకపోయారు."

"ఇంత జరిగినా...నావి బోడి సలహాలే నీకు!"

"ఏం జరిగింది? సునామీ వచ్చిందా? భూకంపం జరిగిందా? అగ్ని పర్వతం పేలిందా?... ఆ వెధవ నన్ను మోసం చేశాడు! వాడి దారిన వాడేపోయాడు. నాకు పోయిందేంటంట?

కావాలని, నేను వాడిదగ్గరికిపోలేదు. వాడే, ఎలావచ్చాడో, అలాగే పోయాడు... ఫినిష్! నాకేంటి నష్టం? మొగుడు లేకపోతే బ్రతకలేనా... మొగోడు లేకపోతే వుండలేనా?"

"ఉంటావ్! ఎందుకుండలేవ్? లక్షణంగా వుంటావ్! కన్నవాళు ్ళ దూరమైనా, చింతలేదు నీకు. కట్టుకున్నవాణ్ణి కాదన్నావ్, పెట్టుకున్నవాణ్ణి పొమ్మన్నావ్! పురుషాహంకారమంటావ్ సంఘసేవంటావ్! మహిళా హక్కులంటావ్! మానవ న్యాయమంటావ్! మడంత్రిప్పనంటావ్! ఏమిటిదంతా? సాయంకాలం, సైకియాట్రిస్ట్ దగ్గరికి పోదాంపద!"

"పెళ్ళిచేసి పంపించేసినవారు, దగ్గరుంటారా? చేసుకున్నవాడు పెత్తందారైతే... ఫ్యూడల్‌దొరలా పేట్రేగిపోతోంటె, వాడికాలిక్రింద చెప్పులా నలిగిపోవాలా?...

పౌరహక్కుల కోసం పోరాడుతున్నవాడు..., మానసికంగా, నా ఆశయాలకు దగ్గరైనవాడని అనుకున్నా! కలిసివుందామంటె, సరే అన్నా! ఒఠ్ఠి అనుమానపు జీవి! బెదురుగొడ్డని తేలింది. చెప్పే మాటలకు, చేసే ఆలోచనలకు, ఎంతదూరమో, అర్థమైంది... అంతే! 'తలాక్' చెప్పేశా!....!

"అది, మగవాళ్ళు చెప్పేదేబాబు!"

"ఎవరు చెబితే ఏంటంట? వదిలించుకోవడమేగా!"

"మరి..., నాకెపుడు చెబుతావ్ 'తలాక్'?"

"అరుణా!"

"అవును కరుణా! నిజం చెప్పాలంటె, నా ఆరోగ్యం ఏమీ బాగాలేదు. ఏ రోజుకు ఎలా వుంటుందో నా పరిస్థితి!"

"అదేవిటీ? అంత సడన్‌గా ఎలా వచ్చింది. అనారోగ్యం?"

"సడన్‌గాకాదు. రెండు మూడేళ్ళనుండీ, వుంది. గర్భసంచిలో బాధ! అవసరానికి, ఏవో మందులువాడి..., అలా గడుపుకొస్తున్నాను కాలం! ఎయిడ్స్ కాదులే, భయపడకు. ఈ మధ్య టెన్షన్ బాగా పెరిగిపోయింది. ఉద్యోగంలో కూడ పరిస్థితులు సమస్యలుగ వుండి... ఏమిటీ జీవితం?... ఆశలతో అత్తవారింటికొచ్చాను... ఆశయాలతో బయటికొచ్చాను. పుట్టింటిబంధాలు తెగిపోయాయి. మెట్టినింటి సంబంధాలు ఆగిపోయాయి. సమాజ అనుబంధాలు ఆవిరయిపోయాయి. అవమానాలతో మిగిలిపోయాను. అనారోగ్య బడితో సహవాసం! బహుశా, అవసాన దశకు చేరువవుతానేమో!... ఆశయాలను ఘనంగా చాటింపువేస్తుంది సాహిత్యం! నిజజీవితంలో అవి, మైనపు బొమ్మలేసుమా! వ్యవస్థలో స్త్రీకి స్వేచ్ఛ అవసరం లేదా? ఉందని వాదించినా కొందరు, లేదని, నిరూపిస్తూనే ఆడదాని బ్రతుకు... స్వేచ్ఛను కోరే స్త్రీకి సమాజం విధించే శిక్ష, పరాభవాలేనా?... కరుణా! మానసిక గాయాలతో, శరీర అనారోగ్యంతో 'మన' అనుకుని, నీ దగ్గరకొచ్చాను. నిరాశతో కాదుసుమా!"

"ఎలా అనుకుని వచ్చినా నీవు... 'మనం మనవే!' మానవత్వపు మనుషులవే! ఆత్మీయతా బంధువులవే! తొందరపాటుతో, అందరికీ దూరమైనా, నీవు నాకు దగ్గరే!... ఏవి వున్నాలేకపోయినా..., ఆడదైపుట్టినందుకు 'అమ్మా' అనే అమృత పిలుపుకు కూడ దూరమయ్యావు...***తల్లికాని ఆడది, తొలిచిన రాతిబొమ్మే!..***

"కరుణా!... చితికి నిప్పంటించేవారుకూడ లేరుకదా నాకు...

"భోజనంచేసి పడుకో... సాయంకాలం...డాక్టరు దగ్గరకెడదాం"

"వద్దు! మనసు బాగోలేదు... నీకు అభ్యంతరం లేకపోతే... నీ పూజ గదిలో పడుకుంటాను"

"ఇంకా నన్ను దూరంగానే వుంచుతున్నావ్!"

m m m

# 4. మళ్ళీ పెళ్ళి

"పారిజాతం! పకోడీలు చేశావా?"

"చేశానండి, చేగోడీలు...!"

"నేను చేయమన్నది, పకోడీలు...!"

"నేను చేసింది, చేగోడీలు...!"

"చెప్పింది చేయాలి..!"

"చేసింది చెప్పాలి...!"

"అడిగింది పెట్టాలి, పెళ్ళాం...!"

"పెట్టింది తినాలి, మొగుడు...!"

"అసలు, నీవు పతివ్రతవేనా...!"

"మొదట, మీరు సతివ్రతులేనా...!"

"ఏమిటి, మాటకు మాట. ధీటుగా చెబుతున్నావ్? టి.వి. కోచింగా? లేక మహిళా మండలి మార్చింగా...?"

"ఆన్సర్ టు ది పాయింట్ ! అనవసర మాటలెందుకని...!"

"నేనడిగింది, టి.వి. కోచింగ్ గూర్చి...!"

"నేను చెప్పింది..., మీ ప్రశ్నకు ఆన్సరు!"

"ఇలా అయితే, ఇహ, నిన్ను భరించడం, కష్టం!"

"భరించడం ఏమిటండీ, ఎత్తుకుని మోస్తున్నట్టు...!"

"మోయడం కాదు... సహించడమని అర్థం"

"నేనూ అంతే...!"

"నాతో సమానమా?"

"అర్ధాంగంటే... అదేగా, అర్థం!"

"ఇలా అయితే, ఇహ నీతో వేగడం కష్టమే!

"వేగడం ఏమిటండీ బాబు! పప్పుగింజలు వేగినట్లు"

"మందు కొట్టావా ఏం?

"మీ మందు మీకే వుందిలెండి, దగ్గు మందు త్రాగాను"

"ఏవిటి నీ పొగరు? ఇన్నాళ్ళూ ఎన్నడూ లేనిది, యీరోజు, యిలా చెలరేగిపోతున్నావ్?"

"లేచింది..."

"ఏవిటీ...?"

"లేచింది... లేచింది..."

"ఏవిటీ లేచింది? ఏవిటే బాబు, ఏదో అయింది నీకు!"

"లేచింది- లేచింది- లేచింది-మహిళాలోకం! దద్దరిల్లింది పురుష ప్రపంచం... లేచింది..."

"ఏవిటీ యీా విపరీతం? సినిమాపాటతో ఎగురుతున్నావేంటి?"

"అబ్బా! కలుక్‌మంది. కాస్త నడుం పట్టుకోండి, నొప్పిగా వుంది"

"సిగ్గు, బిడియం లేవు...!"

"ఎవరికి....?"

"నాకేలే...!"

"మరి, నన్నంటారే...?"

"నీకూ లేవని?"

"బుద్ధీ- జ్ఞానంలేవు...!"

"ఎవరికీ....?"

"నాకేలెండి....!"

"మరి, నన్నంటావేం?"

"మీకూలేవని...!" అయినా, మిమ్మల్ని అనడానికి, నేనెవర్నండీ బాబు! అనేవాళ్ళు వేరే వుంటారు"

"ఎవరువాళ్ళు?"

"మీ గాళ్ ఫ్రెండ్స్!"

"అదొక్కటా! కట్టుకున్నందుకు, నీతోనే తింటున్న తన్నులు బ్రతుకంతా... ఉండు... ఎందుకు నోరు మూస్తావ్?"

"అలాంటి మాటలనకండీ! అయినా కట్టుకోవడం ఏవిటండీ, బట్ట కట్టుకున్నట్లు, పళ్ళు కట్టించుకున్నట్లు? పైగా తన్నడం అంటారేవిటండీ బాబూ! మొగుళ్ళను తంతారా పెళ్ళాలు ఎక్కడైనా?"

"దేవుడిలాంటి మొగుణ్ణే తన్నింది, సత్యభామ! నేను, నీకొక లెక్కా!"

"అలా అని వ్రాసినాయన చూశాడా ఆ సీను బెడ్రూంలోకి పోయి? లేక, అసలాయనే చెప్పాడా అలా వ్రాయమని!"

"చూచినా, చూడకపోయినా, కళ్ళారా చూచినట్లే వ్రాయగలరు కవులు! అలా వ్రాసినవన్నీ నిజమని నమ్ముతున్నారుగా జనం!"

"ఎవరి నమ్మకం, వారిదండీ! మనకెందుకాగోల? మన సంగతి, మనం చూచుకోవాలిగాని!"

"ఏం చూడను? ఓపికలేదు. కట్టుడు పళ్ళన్నావుగా నావి! పైగా కాళ్ళ నొప్పులు కూడా!"

"నేనన్నదేంటి, మీరనేదేంటి?"

"రెండూ, ఒకటేగానీ... సంగతి చెప్పు, ఏవిటీ చూడమంటున్నావ్?"

"అల్లుడుగారు, అమెరికా వెళ్ళాలనుకుంటున్నారట! అమ్మాయి చెప్పమంది మీకు?"

"నాకు చెప్పడం ఎందుకు?"

"కట్నం తాలూకు, వాళ్ళకు మనం యిచ్చిన పొలాన్ని అమ్మి, ఆ డబ్బుతో పాటు, మరి కొంత కలిపి, తెమ్మన్నాడట!"

"తల మీద మిగిలిన, యీ నాలుగు యీకల్ని కూడ వుండనీయడా ఏంటీ?"

"అదేవిటండీ అలా అంటారూ? మనం యిచ్చినా, యివ్వక పోయినా, వాళ్ళకిచ్చిందైనా, వాళ్ళకి ఒప్పగించాలిగా మనం!"

"ఏమిటి నీవనేది? లోకుల సొమ్ము ఎగ్గొట్టేవాడిగా కనపడుతున్నానా నీకు? వాళ్ళ పిల్లలకుంటుందని ఆ పొలం యిచ్చా. అన్నీ అమ్ముకు తింటానంటె... చివరికి, వాళ్ళకు మిగిలేదేంటి?"

"ఆ మిగులూ, తగులూ, మనకెందుకండీ? మనం యివ్వాల్సింది, యిచ్చేస్తేపోలా?"

"దానితో, మనకేమీ సంబంధంలేదంటావ్, అంతేనా నీవనేది?"

"నేనేమన్నానని, తగువుకు తయారవుతున్నారు?"

"అదొకటే తక్కువైంది నీతో నాకు! వాళ్ళేదో అన్నారని సరాసరి, నాకు చెప్పడమేనా? నీవుగా, వాళ్ళకు సర్దిచెప్పడం, చేతకాలేదా?... పెళ్ళాంగా నీకా బాధ్యతలేదా?... అయిందానికీ, కాని దానికీ, మొగుణ్ణి సాధించడమేనా?"

"నేనేం సాధించాను మిమ్మల్ని? వాళ్ళు చెప్పమన్న మాట చెప్పాను..."

"కాదులే! ఈ మధ్య నీకు నోరు పెరిగిపోయిందిలే! మొగుణ్ణని కూడా చూడకుండా లెక్కలేకుండా మాట్లాడుతున్నావ్‌లే!"

m m m

"పారిజాతం.....!"

"..........."

"పడుకున్నావెందుకు? ఒంట్లో బాగాలేదా? డాక్టరు దగ్గరకెడదాం లే!"

"..............."

"పారిజాతం... పలకవా నాతో!"

"..............."

"అలనాడు, సత్యభామ కూడ యిలాగే, అలక పాన్పుపై పవళించింది... శ్రీకృష్ణ పరమాత్మ కూడ, యిలా, నాలాగే... (ఆమె) కాళ్ళవైపు కూర్చున్నాడు... మరి... ఆలస్యమెందుకు? జరగవలసిందేదో జరిపించెయ్. కోపం తగ్గుతుందేమో నీకు!"

"..................."

"పారిజాతం! తన్నకపోయినా, నీవు తన్నినట్లుగానే భావించి... యిలా, పాదాలు ఒత్తుతాను..."

"ఛీ! ఊరుకోండి! మనసు బాగాలేక పడుకుంటే... ఏంటి మీరు?"

"పారిజాతం! అలక వహించిన సత్యభామ కోసం, అలనాడు కృష్ణుడు, అమరావతికి పోయి, పారిజాత వృక్షాన్ని పెకలించి తెచ్చాడు. నీ కోసం నేను అలా చేయాలనుకున్నా... నీవే పారిజాతానివి! నీ కోసం, నేను, వేరుగ తెచ్చేదేముంటుంది చెప్పు?"

"ఏంటి మీరు! అనవసర ప్రసంగం చేస్తారు?"

"పారిజాతం! కటువుగ మాట్లాడి, నీ మనసును బాధ పెట్టానా?"

"కాదులెండి! ఈమధ్య, నన్ను చూస్తేనే చిరాకు

ఎక్కువైపోయింది మీకు!... దేన్ని చూచుకునోమరి!"

"అరవైలో ఏముంటుంది పారిజాతం, వేరే చూచుకోవడానికి. నీ అనుమానంగానీ!"

"బుద్ధి నిలకడలేని వారిని వయసు మాత్రం ఏం చేస్తుందిలే!"

"ఇంతకూ నా బుద్ధీ మంచిది కాదంటావ్? నాకొక 'కీప్' వుందంటావ్"

"ఉందోలేదో, నాకనవసరం! నాతో మాట్లాడ్డొద్దు!"

" ఇదే, నీ నిర్ణయమైతే... రాబోయే తీవ్ర పరిణామాలకు నీదే బాధ్యత!"

"నేననాలనుకున్నదాన్ని, ముందుగా మీరే అనేశారే! ఇద్దరిలో ఎవరంటే ఏంలెండి?"

"ఏవిటి నీవనాలనుకున్న తీవ్ర పరిణామాలు?"

"ముందుగా మీరే అన్నారుగా, మీరే చెప్పండి, ఆ తీవ్ర పరిణామాలేవిటో?"

"...విడాకులు! ఎలా వచ్చావో అలాగే, తిరిగి నీ పుట్టింటికి పోవలసి వస్తుంది..."

"నేనూ అదే కోరుకుంటున్నా... ఈ పాత మొగుడితో బోరు కొడుతోంది"

"ఏవిటీ, నేను, పాత మొగుణ్ణా?"

"కాక కొత్త మొగుడా, కుర్ర మొగుడా మీరు?"

"కొత్త మొగుడు కావాలా నీకు?"

"అవును. మీరన్నట్లు విడాకులైతే... ఏదో ఒక మంచి సంబంధం చూచుకుంటాను."

"సంబంధం చూచుకుంటావా?"

"అవును! ఎప్పణ్ణుంచో అనుకుంటున్నాను, మళ్ళీ పెళ్ళి చేసుకోవాలని!

"ఏమిటీ? పెళ్ళా! ఒళ్ళు తెలిసే మాట్లాడుతున్నావా? ఏమన్నా, మతి చలించిందా?"

"ఏదీ చలించలేదు. అంతా తెలిసే మాట్లాడుతున్నాను. ఓపికుంటె, మీరు నలుగుర్ని చేసుకోండి. ఎవరొద్దన్నారు?

"అయితే పిల్లని, నీవే చూడు చేసుకుంటాను."

"ముందు, విడాకులైతే గదా, ఎవరైనా ఏదైనా చూచుకోవడానికి, చేసుకోడానికి? మారోమాట! ముందుగా చెప్పలేదంటారేమో! మీరు కోరినట్లు, మనకు విడాకులు జరిగే ముందుగానే... అన్నీ సెటిల్‌మెంటు జరిగిపోవాలి! శత్రుశేషం రుణశేషం వుండకూడదు"

"అంటె....!"

"చెబుతా వినండి మరి! మొదటిది–నలభై సంవత్సరాల నాడు, మన పెళ్ళి సందర్భంగా మా నాన్నగారు, మీ దగ్గర డిపాజిట్ చేసిన, అక్షరాల లక్షన్నర రూపాయలకు ఆనాటి నుండి, యీనాటి వరకు అనగా, విడాకులు జరిగే రోజు వరకు, ధర్మవడ్డీని లెక్కకట్టి ఆ మొత్తాన్ని మీరు, నాకు తిరిగి చెల్లించవలసి వుంటుంది."

"అదేవిటి? అది నాకు కట్నంగా యిచ్చిన మనీ కదా! డిపాజిట్ వడ్డీ అంటావేంటి?"

"ఆనాటి పేరు అదే కావచ్చు. ఎందుకిచ్చారు? బుద్ధిగా కాపురం చేయించుకుంటారని, అన్ని వేళలా జాగ్రత్తగా చూచుకుంటారని, ఏలోటూ రానీయరని! అంతేగా, మధ్యలో విడాకులిచ్చి పుట్టింటికి తిరిగి పంపించేస్తారని కాదు. అయితే

నమ్మకద్రోహంతో విడాకులు కోరుతున్నారు కనుక కట్నం పేర, నాపేర డిపాజిట్ ఆవుతుంది. కనుక, వడ్డీతో సహా, డిపాజిట్‌ను తిరిగి యిమ్మనడం న్యాయసమ్మతమే అవుతుంది. రెండవది- ఈ నలభై సంవత్సరాలు, మీకు మీ సంతానానికి, నేను చేసిన సర్వీసుకు, రోజువారీగా గాని, నెలవారీగాగాని, జీతాన్ని లెక్కకట్టి, ఆ మొత్తం నుండి యింతకాలం నాకోసం మీరు చేసిన ఖర్చును మినహాయించి ఆ మిగిలిన దానిని డిపాజిట్ దాని వడ్డీకి కలిపి, మొత్తానికి డి.డి.లు తీసి నాకు యివ్వాలి! ఆ తరువాతే, విడాకుల వ్యవహారం! మరోమాట మర్చిపోయాను... జీవితాంతం, భార్యగా భావించి మంచి చెడులకు బాధ్యత వహిస్తానని, ఆనాడు, అందరి సమక్షంలో, అగ్నిసాక్షిగా, పెళ్ళి ప్రమాణాలు చేసి నమ్మించి, నన్ను నా వాళ్ళకు దూరం చేసి నా పుట్టింటి నుండి తీసుకొచ్చి, యిన్నాళ్ళు నాతో ఊడిగం చేయించుకుని, యిప్పుడు నన్ను కాదంటున్నారు కనుక. అందుకు నష్టపరిహారంగా, మీ పేరవున్న స్థిర చరాస్థిలో మూడోవంతుకు తగ్గకుండా, నాకు దఖలు పడాలి. ఇవన్నీ సక్రమంగా పూర్తయితేనే మీతో విడాకులకు సమ్మతిస్తాను."

"పెద్దప్లానే వేశావే! ఎన్నాళ్ళ నుండి పథక రచన?"

"ఎన్నాళ్ళయితే మీకెందుకు? విడాకులకు ముందు జరగవలసింది యిది! అంతవరకు యీ విషయంలో యిహ నాతో సంప్రదింపులు లేవు. మరో మాట! ఇదంతా మనసులో పెట్టుకుని కక్షసాధింపుగ నన్ను శారీరక మానసిక హింస సాగించారంటే.... నేనే ముందుగా ఫ్యామిలీ కోర్టులో కేసు వేస్తాను."

''ఏమని వేస్తావ్? అదనంగా కట్నం తెమ్మని బాధపెడుతున్నాననా?"

"అది కాదులె! పెళ్ళయి, యింతకాలానికి, ఆ పాయింట్ చెల్లకపోవచ్చు."

"మరి, ఏమని కేసు పెడతావ్ నా మీద?"

"మీరు, దేనినో కుఱ్ఱదానిని పెట్టుకుని, నన్ను అడ్డు తొలగించు కోడానికి హింసిస్తున్నారని, నా ప్రాణహానికి మీరిద్దరూ ప్లాను వేస్తున్నారని, నాకు తగిన రక్షణ కల్పించమని, కోర్టు వారిని వేడుకుంటాను..."

"అయితే ఏమవుతుందట?"

"ఆడ పోలీసులొచ్చి యీడ్చుకుపోయి 'త్రోబాల్' ఆడతారు మిమ్మల్ని! జైల్లో పెట్టి, చిప్ప చేతికిస్తారు. గంజిపోసి తాగమంటారు."

"అంతదాకా ఎందుకులే, రాజీగా, విడాకులు తీసుకుందాం! ఒకరి కొకరం సంబంధాలు చూచుకొని, పెళ్ళి చేసుకుందాం! నీదేగా యీ ప్రపోజల్!"

"నాకు మీరేమీ చూడక్కర్లేదు. నేను చూచుకోగలను. ఈ విషయంలో మీ బోడి సలహా అక్కర్లేదు... మీ ధోరణి చూస్తోంటె... ముందుగా డబ్బు సెటిల్‌మెంటు జరగకుండా చేయడానికి ఏదో ఎత్తువేస్తున్నట్లు అనుమానంగా వుంది."

"అదేం కాదులే. ముందు సెటిల్‌మెంటు అయితేనేగా విడాకులు తీసుకోవడం... పోనీ, ఒక పనిచేద్దాం. రెండోపెళ్ళికి నీకు తొందరగా వుంది కనుక, కోర్టు వ్యవహారం తేలాలంటే, చాలా కాలం పడుతుంది. కనుక, యిద్దరికీ యిష్టమైంది కనుక, ముందు పెళ్ళిళ్ళ తతంగం పూర్తి చేయిద్దాం. ఈ విషయంలో ఒకరి కొకరం అడ్డుపడే అవకాశం ఎలాగూ లేదుగా!"

"అలా కుదరదు. ముందుగా డబ్బు సెటిల్మెంట్ కావాల్సిందే!

పెళ్ళికి కాస్తలేటయినా ఫర్వాలేదు. ఏమంత వయసు పోయిందని నాకు?”

“పోనీ, మరో పని చేద్దాం! నీతోపాటు, పెళ్ళి చేసుకోవాలని నాకు తొందరగానే వుంది కనుక మీ పుట్టింటి వాళ్ళను, మా వైపు వాళ్ళను, ‘మన’ వాళ్ళను... అందరినీ పిలిపించి ప్రజాకోర్టును యేర్పాటు చేసి, మన విడాకుల వ్యవహారం అక్కడ దాఖలు చేస్తే... ఉభయ పార్టీల సమ్మతితో వ్యవహారం త్వరగా తేలిపోతుంది.”

“ఇదీ బాగానే వుంది... అయితే, మీ మాయ తెలివిని ప్రయోగించి, నాకు రావలసిన డబ్బును, ఎగేసే వ్యవహారం మాత్రం చేయొద్దు. ముందుగా ఆ లెక్కలన్నీ సరి చూచుకునే... ప్రజాకోర్టులో విడాకుల కోసం, జాయింట్ పిటిషన్ వేయాలి. ఈ మాయదారి మొగుడితో, యిప్పటికే, ఎంతో నష్టపోయాను. ఇహ మీదట అలా జరగడానికి వీల్లేదు... సరేనా సమ్మతేనా?”

“సరే! సమ్మతే! మరి, అంతవరకూ...?”

“.... భార్యగా సర్వీసు చేస్తాలెండి. దానికి కూడా రేటు కట్టాలి!... కాఫీ తెస్తానుండండి!......”

“ఇదేమిటి? – స్టీలు గ్లాసుతో తెచ్చావు కాఫీ?”

“మీ సామానులో కప్పు, సాసర్ లేవ్! యిదేవుంది మరి!”

“సామాను సెపరేషన్ కూడా అయిపోయిందన్నమాట! ఎప్పటి నుండి వుంది నీకీ ప్లాను?”

“మొగుడింటి కొచ్చిన పెళ్ళానికి. ముందు చూపుండాలి! నమ్మి చెడే కంటె... నమ్మక జాగ్రత్తే మేలు! ఏ టైంకు ఎలా వుంటుందో, ఎలా తెలుస్తుంది?”

m m m

''ఒరె అన్నయ్యా! మా అబ్బాయికి పెళ్ళి చేయాలనుకుంటున్నాం. మీ పారిజాతాన్ని యిమ్మని అడగడానికి వచ్చాను.''

“పారిజాతాన్నివ్వాలా? ఏం చూచి నీ కొడుక్కి పిల్లనివ్వాలే?”

“ఏంట్రా అలా అంటావ్? నా కొడుక్కి ఏం తక్కువని? దొరబాబులా వుంటాడు.”

“ఫిగర్ చూచి పిల్లనివ్వాలా? ఉజ్జోగం సజ్జోగంలేదు. పైసా ఆదాయంలేదు. సావాసగాళ్ళతో కల్సి పోజులు కొడుతూ తిరగడం పార్కుల్లో బాతాఖానీ కొట్టడం, కొంప కొంపకి తిరగడం ఇలాంటి రోడ్ రోమియోగాడికి, నేను పిల్లనివ్వాలా?”

“ఒరే! అనవసరంగా మాట్లాడుకురా! మేనమామైనంత మాత్రాన, వాణ్ణి అన్ని మాటలంటావా? నా కొడుకు బంగారం! వాడొక్కడే మాకు. ఉద్యోగం చేసి సంపాదించాల్సిన ఖర్మ వాడికిలేదు. వాడితో బిజినెస్ పెట్టిస్తాం. అయినా, ఆడపిల్ల గలవాడివి, నీవే నా దగ్గరకొచ్చి అడగాల్సిందిపోయి, నేనే వచ్చి సంబంధం కావాలని అడిగినందుకు యింత లోకువ చేసి మాట్లాడతావా? నీ పిల్లని చేసుకోడానికి, ఆ బాబు, కొడుక్కి అసలు యిష్టమేలేదు. పుట్టింటికి దారుంటుందని వాళ్ళని కాదని, నేనే వచ్చాను. నీవేమో యిష్టం వచ్చినట్లు మాట్లాడు తున్నావ్!”

“నీ కొడుకును చేసుకోవడానికి, మా పారిజాతానికి, అసలు యిష్టమేలేదు.”

“ఇష్టం లేకపోతే పోనీ! ఏంటంట? మా వాడికి పిల్లనిచ్చే వారేలేరనుకుంటున్నావా? భారీ కట్నకానుకలతో, మా వాడికి కన్యాదానం చేయడానికి, బొచ్చెడుమంది పోటీగా వున్నారు. అన్న

కూతురు కోడలిగా వస్తే నాకు అండగా వుంటుందని, ఆశతో వస్తే... మాకు ఎక్కడా పిల్ల దొరక్క, నీ దగ్గరకొచ్చినట్లుగ మాట్లాడుతున్నావ్! ఇదే చెప్పడం, మీరంతా బాగా ఆలోచించుకుని మాతో సంబంధం అందరికీ యిష్టమైతేనే కబురు చెయ్యి. వచ్చి నిశ్చితార్థం జరిపిస్తాం. లేదంటే లేదు. అదీ... నీవిచ్చే కట్న కానుకలు మాకు నచ్చితేనేసుమా! ఏ విషయమూ త్వరగా ఫోన్ చెయ్యి. నా కొడుకును అల్లుడుగా కోరుకునేవారు వెయిటింగ్‌లో వున్నారు.”

“చెప్పానుగదే, మా పారిజాతానికి యిష్టంలేదని! అంతకీ నీవు మా అమ్మాయే కావాలని పట్టుపడితే... దానిని ఒప్పించడానికి ప్రయత్నిస్తాం. కట్న కానుకల ప్రసక్తేలేదు. ఇందుకు మీకు యిష్టమైతే, మీరే ఫోన్ చెయ్యిండి. పారిజాతాన్ని కోడలిగా కోరుకునే వారు చాలా మందేవున్నారు. నీ కొడుకేం పెద్ద హీరో కాదు. వాడికే యివ్వాల్సిన అవసరమూ మాకులేదు.”

“నీవిచ్చేదేంటిరా? కావాలనుకుంటే నా కొడుకేవచ్చి, నీ కూతురు చెయ్యి పట్టుకుని లాక్కురాగలడు. అంతదాకా ఎందుకు? వ్యవహారంగా జరిగితేనే బావుంటుందని యిలా వచ్చాను.”

“సరె! యిప్పుడెందుకు? నా కూతురు చేయి పట్టుకోడానికి, నీ కొడుకు వచ్చినప్పుడు చూచుకుందాంలే!”

“వాడికి, ఆ హక్కు వుందని మాత్రమే అన్నాను. ఆ అవసరం మాకేం లేదు. ఏ సంగతీ ఫోన్ చెయ్యి!”

m m m

“పారిజాతం! చూస్తుంటే, నీవు క్రొత్త పెళ్ళి కూతురులాగానే వున్నావు. ఆనాటి మొదటిరాత్రి అపురూప సుందరిగా నీవు శోభనం

గదిలోకి వచ్చిన సీను. యిప్పుడు మళ్ళీ ప్రత్యక్షమైంది. నీ మనవడు నీకు తండ్రిగా, నా మనమరాలు నాకు తల్లిగా, అన్నాచెల్లెలు, మనకు షష్టిపూర్తి కళ్యాణం చేసి, శోభనం గదిలోకి పంపారు. మళ్ళీ పెళ్ళి చేసుకోవాలనే, మనిద్దరి ముచ్చట, తీయగా తీరింది. ఇంకా విచారంగా వున్నావే! ఇటు చూడు...సిగ్గా...?"

"సిగ్గా నా బొందా! పాత బీరువాకు రంగేసినట్లు పాత మొగుడికి కొత్త బట్టలు కట్టి, కూర్చోబెట్టారు ప్రక్కన! ఇదీ ఒక పెళ్ళేనా? ఇదేమన్నా గొప్పా? షష్టిపూర్తి అందరికీ జరిగేదే!

"మరింకెలా జరగాలంటావ్?"

"బాలవాక్కు, బ్రహ్మవాక్కండీ! మళ్ళీ జన్మలో యిప్పుడు జరిగిన యీ షష్టిపూర్తి కళ్యాణమే మనకి మొదటి పెళ్ళిగా జరగాలి!

"అది ఎలా?"

"మళ్ళీ జన్మలో, మీరు మీ మనవరాలికి కొడుకుగా, నేను నా మనవడికి కూతురుగా పుట్టి, మళ్ళీ మనిద్దరమే పెళ్ళి చేసుకోవాలి. యిప్పటి మాదిరిగానే, శోభనం గదిలోకి రావాలి, సంసారం చేసుకోవాలి... ఇది నా కోరిక!"

"పారిజాతం! ***మనిషి దేనినైనా కోరుకోవడంలో, తప్పులేదుగాని, అలాగే జరుగుతుందని ఆశపడడం అన్ని వేళలా, అందరి విషయంలో నెరవేరేది కాదు. భార్య, భర్తగా పెళ్ళిలో దగ్గరకు చేరతారు... మృత్యువుతో దూరమవుతారు... మధ్యలో జీవితం అనుభవిస్తారు. దానిని అనుకూలించిన రీతిగా! అది, అంతే! నా దృష్టిలో జన్మ అనుబంధమేగాని, జన్మల బంధాలు జన్మపరంపరలులేవు.*** నిన్ను భార్యగా పొందడం, యీ జన్మలో నాకు ప్రాప్తించిన అదృష్టం. నీవన్నట్లు నిజంగా మళ్ళీ జన్మలంటూ వుంటె... నీవేకాదు, నేనూ

కోరుకునేది మనిద్దరి జన్మబంధమే! నరనారాయణులది యుగాల శాశ్వత బంధమంటారు  అది ఎంత వరకు నిజమో నాకు తెలియదుగాని... అదే నిజమైతే.... మనదీ అలాగే వుండాలని కోరుకుంటాను... ఇది, అత్యాశ, అసంభవమేకావచ్చు. కాని, కోరిక మనిషికి తప్పదుకదా!  ఊహల ఊయలలో ఊగడం కంటె, యీ జన్మలో జరిగిన వాస్తవంతో తృప్తి చెందడం మంచిది..... పారిజాతం! పాలగ్లాసేదీ?"

"మర్చిపోయానండీ!... ఈసారి శోభనానికి, పాలగ్లాసుతోనే వస్తానండీ!"

"ఫర్వాలేదులే పారిజాతం!.. ఆనాడు మీ నాన్నగారు, కన్యాదానం పేరుతో అమృత కలశాన్నిచ్చారుగా! అమృతం పారిజాతం క్షీరసాగరం నుండి వచ్చినవేగా! వేరుగా పాలెందుకులే!"

"ఈ నేర్చిన మాటలెందుకండీ! వచ్చే జన్మలో వెరైటీని చూచుకుంటానని ఒక్కమాట చెబితే, నా సంగతేదో, నేను చూచుకుంటాను గదా!"

"అలాగే చూచుకో! నాకు గుర్తు లేకపోయినా, షష్టిపూర్తి కళ్యాణ కథను యింత గొప్పగా నడిపించావు. పొద్దుపోయింది పడుకుందాం!"

"అన్నీ చేసి ఆఖరికి నా మీద  నెట్టేయడం మీకు అలవాటేగా! నలభైఏళ్ళు అనుభవం నాది. ఈ పులుసుతో యీ ముద్ద చాలుగాని, పడుకోండి!

"నిద్రవచ్చేటట్టులేదు పారిజాతం!"

"ఏం ఏమైంది మీకు?"

"శోభనం గదిలో వున్నాం గదా మరి!"

"చాల్లే! కళ్ళు మూసుకుని పడుకోండి. నిద్ర అదే వస్తుంది. **షష్టి పూర్తంటే, సంసార సన్యాసమే! బాగా గుర్తుపెట్టుకోండి!"**

m m m

# 5. తాళి

"కన్యత్వం-బ్రహ్మచర్యం... రెండూ, ఈ మొదటిరాత్రి కోసం. కోటి ఆశలతో, కామ ఆకలితో, వేచి వుంటాయి... అయినా, ఆ తొందర... ఆ వేగం, ఆ వేడి, మీలో వున్నట్లుగా అనిపించడంలేదు నాకు. ఆస్థితిలో, అవి నాలో వుండకూడదు మరి!... ఈ పెళ్ళి, మీ సమ్మతితో జరిగింది కాదని నాకు తరువాత తెలిసింది. అయినా అప్పటికే మూడుముళ్ళు పడిపోయాయి అప్పుడు చేయగలిగేదేముంది? అయినా, శోభనం గదిలోకి వచ్చాను. ఎందుకూ. 'కన్నెచెర' వదిలించడానికి కాదు... అయినా, అది కన్యత్వమో- అన్యత్వమో నాకు తెలియదుగాని కన్యగానే మిమ్మల్ని, మీరు కోరుకున్న చోటుకు పంపడానికి. ఇలా అనడం వినడానికి ఎబ్బెట్టుగానే వుంటుంది. లోక విరుద్ధంగానూ వుంటుంది. అయినా మనసు స్వేచ్ఛను మనిషి గ్రహించాలి. నిజానికి, యీ గది, ఉరకలు వేసే యౌవనాన్ని, పరుగులు తీయించడానికేగాని, ఉపన్యాస వేదిక కాదు. అయినా యిది అలాగే మారింది. కోరికలు చీలికలైనాయి. ఆశలు పాశాలైనాయి..."

"మీ మాటలు, నాకు అర్థం కావడంలేదు. మీరు యిలా ఎందుకు మాట్లాడుతున్నారో నాకు తెలియడంలేదు. నా గురించి మీకా నిర్ణయాలు ఎందుకు, ఎలా వచ్చాయో... అయోమయంగా వుంది. నాలో ఏ లోపం చూచి మీరు యిలా అంటున్నారు?"

"లోపం కాదు... వాస్తవం!"

"ఏ విషయంలో?"

"మీ వ్యక్తిగత వ్యవహారం!"

"వ్యవహారమా? మీరు పొరపాటుగ మాట్లాడారు."

"కాదు! అంతా తెలిసే మాట్లాడాను."

"మీకు తెలిసిందేమో నాకు తెలియదుగాని, నా గురించి, మీరనుకునేది, పూర్తిగా తప్పు అవగాహనే!"

"మొదట్లో నేనూ అలాగే అనుకున్నాను. వాస్తవం తెలిసిన తరువాత కూడ, అది, తప్పు అవగాహన, అని ఎలా అనుకోగలం?"

"మళ్ళీ అంటున్నాను, నా గురించి మీరనుకునేది, పూర్తిగా అసత్యం... పైగా 'కన్నెపొరను కాపాడడం, కోరుకున్నచోటుకు పంపడం'... యీ పిచ్చిమాటలు వింటుంటే ఏదో తెలియని మానసిక అనారోగ్యం, మీలో వుందేమోననే సందేహం కలుగుతోంది... అదే, నిజమైతే, మీలోని లోపాన్ని కప్పిపెట్టి మోసంతో మీరు, నన్ను పెళ్ళి చేసుకున్నారనుకోవలసి వస్తుంది."

"నిజమే! అలాగే అనుకోవాలి మరి! కాని, మీరనుకున్నట్లుకాక, మానసికంగా శారీరకంగా, అన్ని విధాలా వయసుకు తగిన, పూర్తి ఆరోగ్యంగానే వున్నాను. పూర్తి అవగాహనతోనూ, బాధ్యతతోనే నేను యిలా మాట్లాడుతున్నాను. నేను వుపయోగించిన 'వ్యవహారం' అనే మాటను, సెక్సువల్ ఎఫెయిర్‌గా మీరు అర్థం చేసుకున్నారు. అది పూర్తిగా పొరపాటు. నిజానికి యీ పెళ్ళి వ్యవహారంలో నేనే మోసపోయాను."

"భర్త – భార్యగా, తొలిసారి, మనం, యీ గదిలోకి వచ్చాం... అలాగే ప్రవర్తించాలి. కాని, మీరు భార్యతోకాక, పరాయివారితో. మా..."

"... ప్రస్తుతం, మనం, అలాగే అనుకోవాలి!"

"కారణం....?"

"అది, నాకు స్పష్టంగా తెలియదు. కొన్నాళ్ళు యిలాగే, భార్య–

భర్త అనే భావం లేకుండానే కలిసి వుందాం! అందరూ మనల్ని దంపతులుగానే అనుకున్నా... వ్యక్తిగతంగా మనం, అలా అనుకోవద్దు. అందుకు మీ సహకారం కావాలి. ప్లీజ్, నన్ను అర్ధం చేసుకోండి! మూడో వ్యక్తికి, యిది తెలియకూడదు. ఆ మేరకు మన ప్రవర్తన, అతి జాగ్రత్తగా వుండాలి సుమా!"

"ఎన్నాళ్ళిలా?"

"అవసరమైనంతకాలం! నన్ను అపార్థం చేసుకోకండి! మీ మీద అయిష్టత, వ్యతిరేకత, యిందుకు కారణంకాదు... మంచి స్నేహితులుగా వుందాం. సమ్మతమే కదూ?

"ఏ భర్తా, తన భార్యను యిలా 'మీరు' అని అనరు. ఇలా, నన్ను హేళన చేయడమే!"

"హేళనకాదు గాని, మనిద్దరికీ సంబంధించినంత వరకు యింకా అలా భార్య-భర్తగా అనుకోవడంలేదుకదా?

"మీరు అనుకోకపోవచ్చు! నన్ను మీరు, అలా పిలవడం, తాళి కట్టించుకున్న భార్యగా ఏ స్త్రీ భరించలేదు... నా తలరాత యిలా మారిందేవిటండీ?"

"ఆ నమ్మకం నాకు లేకపోయినా, తలరాత తేడా లేదు మనిద్దరికీ!"

"అంటె...?"

"రెస్ట్ తీసుకోండి! నేను కాసేపు పడుకుంటాను."

"శోభనం గది శోక గృహంగా మారింది... అలాగే! మీరు పడుకోండి... ఆ పాలైనా తాగండి!"

"నా మనసు, ఆ స్థితిలో లేదు..."

"ఏ స్థితిలో వున్నా, పాలు తాగడానికేమి? ఎప్పుడూ, తాగేవేగా

అవి!”

“రోజూ అలవాటుగా, తాగేపాలు కావవి, మీరు తాగెయ్యండి!”

“నా కోసం తెచ్చినవి కావవి.”

“ఎవరి కోసం తెచ్చినా... అవి, నా కోసమే అయినా ప్రస్తుత స్థితిలో నేను వాటిని తాగలేను. ఎవరూ తాగకపోవడం, అనుమానానికి కారణం కావచ్చు. ప్లీజ్ మీరు తాగెయ్యండి.”

“అనుమానంతోనే, మీరు, నన్ను యిలా అవమానిస్తున్నారు... వేరే, ఎవరినో అనుకునేదేముంటుంది?”

“...స్త్రీ కన్నీళ్ళు చూచి, నేను భరించలేను. ప్లీజ్! కంట్రోల్ యువర్‌సెల్ఫ్! నన్ను, నా మాటల్ని, సరిగా, అర్థం చేసుకునే ప్రయత్నం చేయండి. మిమ్మల్ని బాధించాలని, హేళన చేయాలని, అవమానించాలని, నా మనసులో, ఏ కోశానాలేదు. నన్ను నమ్మండి!”

“నమ్మేగదండీ, అంతమందిలో మీ ప్రక్కనే కూర్చున్నాను” మీ చేత, తాళి కట్టించుకున్నాను... అందరూ చూస్తుండగానే సిగ్గు విడిచి, మీ కోసం యీ గదిలోకి వచ్చాను... నేను మిమ్మల్ని నమ్మనిదెక్కడ?”

“మీరు చాలా ‘ఎక్సైట్’ అవుతున్నారు. ప్లీజ్ అన్ని విషయాలు తర్వాత మాట్లాడుకుందాం. ప్లీజ్ రిలాక్స్ యువర్‌సెల్ఫ్. నా మాట వినండి!”

“నేనంటే మీకు యిష్టం లేనప్పుడు పెళ్ళి చూపులప్పుడే చెప్పాల్సింది. ఎవరి మనసు వారిది, ఎవరికి తగినవాళ్ళు వారికుంటారు. ఆడదాని జీవితంతో ఆడుకోవాలనుకుంటే, అందుకు నేనే దొరికానా మీకు?... ఎందుకు చేశారు యిలా?...

మాట్లాడరేం?.... ఎంత దురదృష్టవంతురాలినండీ?

"దురదృష్టం, నాతోనే వుంది. అది, మీ వరకు రాదు."

"మీ మాటల్లోనే ఎంతో మర్మం వుంది. మనసు యింకెంత అగాధమో!"

"నా మీద, మీకు కలిగిన, అసహ్యత, కోపం, తగ్గేంతవరకు, మీ యిష్టం వచ్చినట్లు, దూషించండి, నేనేమీ అనుకోను. ఆ తరువాతైనా కాసేపు రిలాక్స్ అవండి. ప్లీజ్!"

"నన్ను మీ భార్యననుకుంటె, మీరలా మాట్లాడతారా?"

"నా బ్రతుకంతా, బాధలను కొనితెచ్చుకోవడమే అవుతోంది."

"నేను మీకంత, బాధగానూ, భారంగానూ వున్నప్పుడు అది తొలగిపోయేందుకు, ఏదో మార్గం చూచుకోండి."

"మార్గం రెడీగానే వుందిలెండి! అదే, నా స్వయంకృతాపరాధం!"

"...మార్గం, రెడీగా వుందా? నన్ను మీకు దూరం చేస్తారా?"

"దగ్గర దూరాలు మనచేతుల్లోలేవు. అవి, అందరికీ సమానంగా వుండవు. నాలాంటి వారికి దూరాలేగాని... దగ్గరలు వుండవు. ప్రస్తుతం యిది మీకూ నాకే సంబంధించినట్లున్నా... అది, ఏదో రూపంలో అందరికీ వుంటుంది. రాత్రి, పగలు కోసమే. పగలు రాత్రి కోసమే! అలాగే, దగ్గర, దూరం కోసమే! దూరం దగ్గర కోసమే! మానవులు ఇష్టమైన కర్మను చేయవలసినవారేగాని, ఆశించినరీతిగా దాని ఫలితాన్ని ఆదేశించేవారు కాలేరు, ప్రేమ దూరమైనా... ద్వేషం, దగ్గరైనా భరించడం మనిషికి, చాలా కష్టం!"

"యౌవన వయసులోనే, యింత వేదాంతం నేర్చారు, సన్యాసం స్వీకరించవలసిన మీరు, పెళ్ళి చేసుకుని మరో జీవితాన్ని, నిర్జీవం

చేశారు. కొందరు అందుకే పుడతారేమోలెండి!"

m m m

"విన్నారుగా! ఇది మొదటిరాత్రి మా యిద్దరి మధ్య జరిగిన సంభాషణ! ఈనాటి వరకు భార్య, భార్తగా మా యిద్దరి మధ్య సంబంధం యిలాగే వుంది. ఇహ ముందు కూడా అంతే!"

"భార్యగా స్వీకరించిన తరవాత, ఆమె పట్ల, మీ ప్రవర్తన యిలా వుండకూడదు మరి!"

"మీరన్నది నిజమే! మర్మంలేని మనస్సుతో చాటులేని మాటలే వస్తాయి. ఆమెను ప్రేమించిన మీరు మీప్రేమ భగ్నకారకుడినైన నాతో, యింత నిగ్రహంగా మాట్లాడగలుతున్నారంటే.... మీలో ఎంతో సంస్కారం వుంది."

"నాతో ఆమెకు వివాహం, ఆమె పేరెంట్స్‌కు యిష్టం కలగలేదు. మీకు కాకపోయినా, మరొకరితోనైనా ఆమెకు వివాహం జరగవలసిందేకదా! నాకా అదృష్టంలేదు. ఇందులో ప్రత్యేకంగా మీరు చేసిందేముంది?.... నా సంస్కారమేముంది?... అయినా భర్తగా, మీరు ఆమె మనసును యింతగా బాధ పెట్టడం.... న్యాయంకాదేమో!"

"నిజమే నేను తపన పడుతున్నది అదే! మీ యిద్దరూ ప్రేమికులన్న సంగతి, లగ్న ముహూర్తానికి, కాస్త ముందు తెలిసినా ఆమెతో నాకు పెళ్ళి జరిగివుండేదికాదు. తీరా కళ్యాణ కార్యక్రమం పూర్తయిన తరువాత మాత్రమే. అదీ, అనుకోని విధంగా తెలిసింది!"

"ఎవరి ద్వారా"

"అక్కడ వున్న వారిలో, ఎవరూ నాకు తెలియదు. కనుక, ఎవరో ఫలానా అని చెప్పలేను. చూశావా! ప్రేమ ఒకరితో, పెళ్ళి

మరొకరితో! అన్నాళ్ళు వాళ్ళిద్దరూ కలిసి తిరిగినా, తీరా పెళ్ళిమాట వచ్చేసరికి, ఎవరిదారి వారిదే అయింది. అనుకున్నవన్నీ జరగవ్! ప్రేమ, దోమ అంటున్నావ్! కాస్త బుద్ధి తెచ్చుకో! అలాంటి పిచ్చివేషాలు వేయకు. తెలిసిందా? అని, సమీపంలో ఎవరో అంటున్న మాటలు వినిపించాయి... అంతే షాక్ తిన్నట్లు మనసు వికలమైంది. అయినా, ఆమె శీలం పట్ల నాకు ఏ కోశానా సంకోచం కలగలేదు... మిమ్మల్ని చూచిన తరువాత, మీ యిద్దరూ సంస్కారం కలిగిన మంచి ప్రేమికులుగానే నాకు అర్థమైంది. ఇంతటి పవిత్ర ప్రేమభావం కలిగిన మీ యిద్దరికీ వివాహం జరగకపోవడం.... నిజంగా దురదృష్టం!"

"జరగవలసినదేదో జరిగిపోయింది. ఇప్పుడవన్నీ ఎందుకు? ఇంతకూ మీరు వచ్చినపని?"

"ఇప్పటివరకు నేను మీ దగ్గర కొచ్చినట్లుగాని, మీరు విన్న యీ టేపును గురించిగాని ఆమెకు ఏమీ తెలియదు... ముఖ్యంగా నేను వచ్చిన పని..., నా మనసులోని మాటను చెబుతాను... మీరు ప్రశాంతంగా వినాలి మరి!

"చెప్పండి!"

"మానసికంగా, మీ యిద్దరి ప్రేమ, నేటికీ అలాగే వుంది కనుక, నాకు సంబంధించి, శారీరకంగా, ఆమె, పవిత్రంగానే వుంది కనుక... భర్తగా ఆమె జీవితం నుండి, నేను తప్పుకుంటాను. అది లీగల్‌గానే! దరిమిలా, వివాహం రూపంలోనే మీరు ఆమెను భార్యగా స్వీకరించి, మీ ప్రేమను, కార్యరూపంలోకి తెచ్చుకుంటే..."

"... అంటే..., మీ భార్యను నేను పెళ్ళి చేసుకోవాలి! అంతేనా మీ వుద్దేశ్యం?"

"ఆవేశపడకండి ప్లీజ్! నా భార్యగా కాదు. మీ ప్రేమికురాలిగా

ఆమెను వివాహం చేసుకోండి! ముందుగా లీగల్‌గా విడాకులు తీసుకుంటాను”

“మీరు ఏం మాట్లాడుతున్నారో, మీకే అర్థం కావడంలేదు. మీరు కట్టిన ‘తాళి’ని ఊడదీసి... ఆమెకు, నేను, మరొకటి, కట్టాలంటారు. అంతేనా మీ సలహా? సమాజం దృష్టిలో మీరు ఆమెకు భర్త! భర్తను వదిలి ప్రేమికుణ్ణి చేరిందని ఆమెకూ, తన కోసం ప్రేమికురాలి కాపురం తీసి, ఆ భర్తకు అన్యాయం చేసినట్లు నాకూ సమాజంలో మంచి కీర్తి ప్రతిష్టలు రావాలని మీ ఉద్దేశ్యమా? సాధారణంగా పునర్వివాహమే స్త్రీకి గౌరవప్రదంగా వుండదు. అలాంటిది భర్త నుండి విడదీసి, ఆమెను, నేను పెళ్ళి చేసుకోవాలా? మతి వుండే మాట్లాడుతున్నారా మీరు? మీ దృష్టిలో ఆమె ప్రాణంలేని వస్తువా, పాలిచ్చే పశువా అమ్మకాలతో చేతులు మారడానికి?..... మీలాగ, నాలాగ మనిషిగా ఆమెకు వ్యక్తిత్వం వుండదా?”

“మీరు నన్ను పూర్తిగా, అపార్థం చేసుకున్నారు. ప్రేమికులను దూరం చేశాననే బాధతోనే, తెలియక చేసిన ఆ తప్పును సరిదిద్దుకోవాలనే తపనతోనే నేను యిలా మీ దగ్గరకొచ్చి మాట్లాడానుగాని, మీ యిద్దరి వ్యక్తిత్వాలను కించపరచడంగాని, తక్కువగా, అంచనా వేయడంగాని కాదు. నిజానికి సాధారణ... సామాజిక, సాంప్రదాయ ధర్మంగా ఆలోచిస్తే.... నా ప్రపోజల్ పూర్తిగా ఆక్షేపణీయం, మతిలేనివాగుడు... అయినా, మీరు విశాల దృక్పథంతో మారుతున్న సమాజ ధర్మాన్ని అనుసరించి, స్త్రీ స్వేచ్ఛకు విలువనిచ్చి, ఆలోచన చేయగలరని, ఆవిధంగా మీరు, నా మనసును సరిగా అర్థం చేసుకోగలరనే ధైర్యంతో యిలా, మీ దగ్గరకొచ్చాను. సహజ ధర్మంగా సమాజపరంగా వ్యక్తిగతంగా చూస్తే తన భార్యగా ‘తాళి’తో

ముద్రపడిన వ్యక్తిని... కారణం ఏదైనా... ఆమెను పెళ్ళి చేసుకోమని, మరోవ్యక్తిని అడగడం... పిచ్చివాడి మాటలుగానే వుంటాయి. ఒకవేళ, తనకు యిష్టంలేని స్థితిలో భార్యగాని, భర్తగాని, లీగల్‌వేలో సంబంధం తెంచుకుని దూరంగా పోవడం అనేది, లోకంలో వున్న పద్ధతిగానీ, మీరన్నట్లు యీ సంతలో వస్తువులా తన భార్యను పెళ్ళి చేసుకోమని మరొకరిని అడగడం పూర్తిగా వెర్రితనమే! కాదనను. అయినా నేను మిమ్మల్ని అలా అడగడంలో, మీ యిద్దరిలోని, ప్రేమభావాన్ని మాత్రమే బేస్ చేసుకుని, దాని సాఫల్యత కోసం నా ప్రయత్నంగా యిలా చెప్పడమేగాని. ఆమె శీలం పట్లగానీ, వ్యక్తిత్వంపట్లగానీ. అనుమాన వ్యతిరేకభావంతో కాదు... ఆవేశరహితంగా, కాస్త హృదయ విశాల దృష్టితో నా మాటలలోని, అర్థాన్ని, అవగాహన చేసుకోగలరనే నమ్మకం, నాకు యింకా వుంది. తొందరలేదు. నా ప్రపోజల్‌ను స్థిమితంగా మరోసారి పరిశీలించండి... సూత్రరీత్యా మీ సమ్మతి దరిమిలా యిదే విషయం ఆమెతో మాట్లాడతాను. ఆమెకు సంబంధించి నా అంచనా మేరకు విషయాన్ని దాని లోతులనుండి, పరిశీలించగల, సునిశిత మేధాశక్తి ఆమెకు వుందనేది నా నమ్మకం. ఏది ఏమైనా నా ప్రపోజల్‌కు సంబంధించి నన్ను అపార్థం మాత్రం చేసుకోవద్దు. ప్లీజ్!... వస్తానండి మీకు సమ్మతమైతే మరోసారి వస్తాను... ఆమె భర్తగా కాదు సుమా, ఒక వ్యక్తిగా మాత్రమే!”

m m m

“మిమ్మల్ని ‘నా భర్త’ అని అనుకునే అవకాశాన్ని నాకు యివ్వరా? భార్య–భర్తగా గుర్తింపుగా అందరిలో మీరు కట్టిన ‘తాళి’తో వుంటూ, వ్యక్తిగతంగా... యిలా, పరాయివారుగా బ్రతకడం, మీ

దృష్టిలో న్యాయంగా వుందా? మీరిలా ప్రవర్తించడానికి, నాలో మీకు కన్పించిన, దోషం- లోపం ఏమిటి? పోనీ, అదైనా చెబితే, నాలోని నాకు తెలియని తప్పు నాకు తెలుస్తుంది కదా! మీ మౌనంతో, యిలా నాకు మానసిక వేదన, హింస కలిగించడం, మీకు ధర్మంగా వుందా? శాడిస్టులైనా, పురుష అహంకారంతో శారీరకంగా భార్యను హింసించి, పైశాచికానందాన్ని పొందుతారేమోగాని, యిలా మౌనంగా, మనసులో నరకాన్ని సృష్టించరు కదా! కనీసం, నన్ను భార్యగానైనా గుర్తించనంత, ఘోర పాపం, నాలో ఏముంది చెప్పండి... వివాహం కాకపోతే, వృద్ధకన్యగా, బ్రతుకును గడిపేదాన్నేమో... ఆ అవకాశం కూడా నాకు లేకుండా చేశారు. దుర్మార్గుడైన భర్త పెట్టే హింసతో అలవాటు పడవచ్చునేమోకాని, మాట్లాడని మంచి భర్తతో బ్రతికేది ఎలాగండీ? ప్లీజ్ భర్తగా, శారీరకంగా నన్ను హింసించండి, భరిస్తాను. మీ మనసును విప్పండి.... విషయం చెప్పండి!"

"..............."

"ప్లీజ్ మాట్లాడండీ! 'శైలజా' అని ఒక్కసారి నన్ను పిలవండి!"

"... మీ నుండి... నాకు విడాకులు కావాలి!"

"వాట్...!"

"అవును శోభనంగదిలోనే చెప్పానుగా, మీ ప్రేమ వ్యవహారం గురించి! మీ ప్రేమకు భంగం కలిగించిన నేను, మిమ్మల్ని భార్యగా అనుకోలేను."

"ప్రేమ పేరుతో నాలో ఏ దోషమూ చేరలేదండీ! నన్ను నమ్మండి!"

"నాకు తెలుసు. మీ యిద్దరిలోనూ కల్మషంలేదు. మీది పవిత్రప్రేమ! మీ ప్రేమలో ఆత్మీయత వుందిగానీ వ్యామోహంలేదు.

అందుకే పెళ్ళిపేరుతో మీకు నేను ఎంతో అపకారం చేశాను. నైతికంగా, పాపం చేశాను. దాని పరిహారానికే మార్గాన్ని వెతుకుతున్నాను. నన్ను అర్థం చేసుకోండి! మరి కొంతకాలం ఓపిక పట్టండి! ప్లీజ్ సహనాన్ని కోల్పోవద్దు... నిజమే మీరన్నట్లు ప్రస్తుతం నా ప్రవర్తనతో, మిమ్మల్ని శాడిస్టుకంటే ఘోరంగా హింస పెడుతున్నాను. అది నాకూ తెలుస్తూనే వుంది. అయినా దీనికి, ఏదో ఒక మార్గం దొరికేవరకు, నేను చేయగలిగిందేమీలేదు... మీరు అపార్థం చేసుకోనంటే, ఒక్క మాట అడుగుతాను... కోపం తెచ్చుకోకుండా సమాధానం చెబుతారా?"

"అడగండి భర్తగా మీకు నాపై సర్వహక్కులు వున్నాయి. అలా వినయపూర్వకంగా అడగనక్కర్లేదు. అడగండి, ఆ ప్రశ్నేదో!"

"మీరు ప్రేమించిన వానికి యిష్టమైతే, మీరు, అతన్ని వివాహం చేసుకోగలరా?"

"ఈ జన్మలో అలా జరగదు... మీరు కట్టిన తాళి, నేను బ్రతికి వున్నంతకాలం, నాతోనే వుంటుంది... ఇది, మార్పులేని నా నిర్ణయం. ఒకవేళ, ప్రస్తుతం నన్ను భార్యగా అంగీకరించలేకపోయినా... ఆరోజు కోసం ఎంతకాలమైనా, ఎదురు చూస్తూనే వుంటాను"

"భర్త ప్రేమకు గుర్తుగా 'తాళి'గాని... కేవలం తాళి కోసమే భర్తకాదు. ఈ వాస్తవాన్ని గుర్తించాలి. తాళిలేని ప్రేమకు విలువ వుంటుందేమోగాని, ప్రేమలేని తాళికి, జీవం వుండదు"

"మీరు కట్టిన తాళిలో, మీ ప్రేమ లేకపోవచ్చునేమోగాని.... దానిలో నా ప్రాణం వుంది. మీరనుకునే గత ప్రేమలో, వయసు ఆకర్షణేగాని, అందులో 'ఆత్మ'లేదు. దానిని మీరు గుర్తించలేకపోయారు. అయినా అది, మీలోపంకాదు. ప్రేమ పట్ల

మీలో స్థిరపడివున్న ఏకపక్ష 'ఇన్స్టింక్ట్', మిమ్మల్ని, అంతదూరం, పోనివ్వడంలేదు. ఒక విధంగా చెప్పాలంటే, మీది, ప్రేమ ఫోబియా... అందుకే యౌవన ప్రారంభంలోని ప్రేమ వ్యక్తిత్వాన్ని పోగొట్టుకుంటుందని, వయసు ఉద్రేకంతో శీలాన్ని కూడ కోల్పోతుందనే సంకుచిత భావం, మీలో బాగా పాతుకుపోయింది. అయితే అలాంటి బలహీనత, కొందరిలో వుండవచ్చు. స్త్రీ పట్ల మగజాతికి, యిది యావరేజ్ వూహ! ఆడదానికీ, స్వంత మనసుంటుంది, అది పిండి ముద్ద కాదు  కర్ర ముక్క కాదు. వ్యక్తిత్వం అభిమానం పరువు, మర్యాదలు విచక్షణ మగవాడిలో కంటే ఆడదానిలో ఎక్కువగానే వుంటాయి.... అయితే వాటిని వ్యక్తం చేసే అవకాశం లేకపోవచ్చు. అందుకే మూగవేదన  మగువకు అలవాటు అవుతుంది మీలాంటి మగవానితో! అయితే మీ విషయంలో, మీ మనసు, ఫోబియాను దాటిపోయింది. మీరు నా భర్త కనుక మరింత చొరవగా చనువుగా, మాట్లాడుతున్నాను.  సైకాలజీ చదువుకున్న వ్యక్తిగా నాకున్న నాలెడ్జి ప్రకారం, మీ ప్రవర్తనను 'ఎనలైజ్' చేస్తే... తేలేదేమంటె... బహుశా, మీరు, భగ్న ప్రేమికులు  సున్నిత హృదయులు. మామూలు మెత్తని మనసు కాదు  మీది టూ మచ్  సున్నితం. అందుకే ప్రేమ నెరవేరని వారంతా మీలాగానే, బాధపడుతూ వుంటారనే 'షార్ట్‌కట్' ఆలోచన మీకుంది.... అస్తమానం దానిని సాగదీస్తూ, అసలు వాళ్ళలో లేని ఆలోచనలు, ఆవేదనలను, మీ స్వంతం చేసుకుని బాధపడుతూ యిదిగో యిలా నన్ను పరోక్షబాధకు గురి చేసినట్లే... యితరుల వేదనకు కారణమవుతూ వుంటారు. ఒకరకంగా, మీది 'ఫిక్షన్‌మైండ్' అండ్ టూ మచ్ సెన్సిటివ్ అండ్ డెలికసీ!..ఇ...

ఇహ, నా సంగతి చెబుతాను వినండి... కాలేజీ రోజుల్లో

అతనూ, నేను ఫ్రెండ్లీగా మాట్లాడుకునేవాళ్లం. ఎక్కువగా, సబ్జెక్ట్ డిస్కషన్ జరుగుతూ వుండేది. అది ఎక్కువగా, మా యిద్దరికే పరిమితం. అంతకు మించి మీరనుకునే స్ట్రాంగ్ అండ్ ఘాట్ ప్రేమ ఏనాడూ మా సమీపంలోకే రాలేదు. అసలు అలాంటి ఆలోచనే మాలో కలగలేదు. ఇది, కెరీర్‌లో సహజమే కదా!... మీకు మాత్రం లేదాయేం! నాకు చెప్పడంలేదుగాని, బహూశా హద్దు దాటని ముద్దు ప్రేమలో మీరూ పడే వుంటారు. అవతల పార్టీతో అవసరం లేకుండానే, మీ మనసులో మీరే 'ప్రేమ ఫిక్షన్' వ్రాసుకుంటాం. అది కాస్తా హారతి కర్పూరమైంది. అంతటితో మీ భగ్న ప్రేమ కళ్ళద్దాలతో అందర్నీ, అలాగే అంచనా వేస్తున్నారు. ఇప్పటికైనా, వాస్తవానికి దిగివస్తారనే యీ కంఠశోష! ఫలితం వుంటుందోలేదో మరి!... అతను అంగీకరిస్తే... అని ఏదో చెప్పబోయారే అక్కడికి కూడా, వెతుక్కుంటూ పోయారా ఏమిటి ఖర్మ! అక్కడ కూడా చదివి వినిపించారా మీ ప్రేమ పరిశోధనా వ్యాసం?"

"................"

"ఇంత విన్న తరువాతనైనా, మాట్లాడతారా లేక యింకా మౌనమేనా? ఇటు చూడండి నేను మీ భార్యనండీ! ఖర్మ! తాళి కట్టిన మనిషికి భార్యనని నన్ను నేను పరిచయం చేసుకోవలసి వచ్చింది."

"ప్రేమ–భార్య... భార్య– ప్రేమ... ఏమిటో అంతా అయోమయంగా వుంది. 'మాయ' 'మిధ్య' అంటే... యిదేనేమో! సన్యాసం తీసుకుంటె, బెస్టనుకుంటాను...."

" మీ పర్సనల్ డేటా చూస్తే.. మీరు అందుకు కూడా అన్‌ఫిట్! బుద్ధిగా శైలజతోనే కాపురం చేసుకోండి... అది బెస్ట్!"

"ఏమోనండి! మీరు యింత చెప్పినా... పూర్వస్థితి నుండి, నా మనసు, యివతలికి రావడంలేదు. మరో మాట! మీరేమీ అనుకోకండి. నేను భగ్న ప్రేమికుడినని మీకు ఎవరు చెప్పారు?"

"ఎవరో ఏమిటి? మీరే!"

"నేనా?"

"అవును మీరే! ఫేస్ యీజ్ ది యిండెక్స్ ఆఫ్ మైండ్' అని కదా చెబుతారు. మా ప్రేమ సంగతి మీకు ఎవరో చెప్పినట్లు మీరు భగ్న ప్రేమికులని, నాకు ఎవరూ చెప్పలేదు. నేను సైకాలజీ చదువుకున్నాను."

"నిజం చెబుతున్నా, మీ ప్రేమ వ్యవహారం గురించి ప్రత్యేకంగా, నాకు ఎవరూ చెప్పలేదు. మన కళ్యాణం పూర్తయి బయటికొచ్చిన తరువాత అలా బయటికెళ్ళాను. అక్కడి జనంలో ఎవరో, ఏదో అంటుంటె, అది, నా చెవిలో పడింది"

"ఏమని పడింది మీ చెవిలో?"

"ఎవరితోనో జరగవలసిన పెళ్ళి యీయనతో జరిగింది. పాపం. ఆ ప్రేమికుణ్ణి ఏం చేసిందో శైలజ' అని "

"దానిమీద, మీరు ప్రేమ గ్రంథం వ్రాసి నాకు అంకితం యిచ్చారు. అంతేనా?... స్నేహితుల్ని, ప్రేమికులుగా, హీరో హీరోయిన్‌లుగా డైలాగులు వ్రాసి మాకు, సినిమా పెళ్ళి చేయాలనుకున్నారు. మీరు ఇంతటి వారని తెలిస్తే, పెళ్ళిచూపులనాడే... పుల్‌స్టాప్ పెట్టేదాన్ని"

"అలా జరిగి వుంటే, అందరికీ హాయిగానే వుండేది."

"భార్యకు పెళ్ళి చేస్తాననే మీలాంటి త్యాగ పురుషులు యింకా ఎందరున్నారో, యింతటి జనాభాలో ఇంత జరిగింది కనుక, మనం

సైకాలజిస్ట్ దగ్గరకు పోదామండి. కౌన్సిలింగ్ ద్వారా, మనకి తెలియని, మానసిక లోపాలు మనలో వుంటె... వాటిని తెలుసుకుని సరిచేసుకునే అవకాశం వుంటుంది.

"నాకు అలాంటి అవసరంలేదండీ!"

"ఉంది! భార్యను, 'అండీ' అనడంలోనే తెలుస్తోందిగా, సైకాలజిస్ట్ అవసరం వుందో లేదో!"

"దానిని అలవాటు అనుకోవచ్చునుగదా! లేదా మర్యాద మాటగా భావించవచ్చుగా?"

"అదేదో, అక్కడే కౌన్సిలింగ్‌లోనే తెలుసుకుంటె యింకా క్లియర్‌గా వుంటుంది!"

"మనం విడాకులు తీసుకుంటె... ఏమిటి నష్టం మీకు?"

"మళ్ళీ మొదటికే వచ్చారా?... నా మాట కాదనకండి! సైకాలజిస్ట్ దగ్గరకు పోదాం!"

"అలాగే, నాలో, ఏదో లోపం వుండి భయపడుతున్నట్లు నేనెందుకు కాదనాలి? అలాగే కానీయండి. నా సైడ్ నో అబ్జెక్షన్... అయినా, నా గుట్టంతా విప్పేశావ్... నా బతుకంతా చదివేశావ్. నీవే, పెద్ద సైకాలజిస్ట్‌వి. ఇంకా వేరే వారితో పని ఏముంది?"

"మీ గుట్టంతా, నేనే విప్పానా? నా చేత అన్నీ చెప్పించారు గాని! మీ లవ్ ఎఫెయిర్ గురించి, మాట మాత్రమైనా చెప్పారా? ఇతరుల నుండి లాగడమేగాని, మీ గుప్పిట విప్పరు!"

"ఏదీ, నన్ను చెప్పనిస్తేగా! నీవే, నన్ను మద్దెల వాయింపు వాయించావ్! అయినా అడిగావ్ కనుక, గుర్తున్నంత వరకు చెబుతాను. నాకు పెళ్ళి చేయాలని ఒక సంబంధం కుదిర్చారు. అదివరకు కుదిరినవే, రెండు మూడు తప్పిపోయాయి. జాతకంలో అలాగే వుందట!

సిద్ధాంతిని అడిగితే, 'కళ్యాణ ఋతువు వచ్చేసింది. యీసారి వచ్చే సంబంధం ఖాయం' అని అన్నాడట! అది సెటిలైంది. నిశ్చితార్థం కూడా జరిగిపోయింది.

ఒక రోజు ఆమె ఫోన్ చేసింది. గుడికి రమ్మని. వెళ్ళాను. నన్ను చూచి ఆమెతో వచ్చినామె అవతలికెళ్ళింది. దేవుడి దర్శనం అయిందా అని అడిగితే, కాదని, తల అడ్డంగా త్రిప్పి మౌనంగా వుంది. నేను రెట్టించి అడిగితే ఆమె నా మొహంలోకి చూచింది. కన్నీళ్ళు ధారాపాతంగా వస్తున్నాయి. నాకు కంగారైంది. చెప్పానుగా, ఆడవాళ్ళ కన్నీళ్ళు చూడలేనని! ఎప్పుడైనా మా అమ్మ కంట్లో నీరు చూస్తే.... చిన్నతనంలో ఏడ్చేవాణ్ణి. కారణమడిగితే, తాను ఒకర్ని ప్రేమించినట్లు అటూ యిటూ పెద్ద వాళ్ళెవరూ ఒప్పుకోలేదని, చివరికి ప్రేమికులిద్దరూ చనిపోవడానికి నిశ్చయించుకున్నట్లు, నిశ్చితార్థం జరిగింది కనుక, నాకు ఒకసారి కన్పించి వెళ్ళాలనే వుద్దేశ్యంతో వచ్చినట్లు చెప్పింది. భోరున ఏడ్చింది. నిజం చెబుతున్నా, నా మాట నమ్మండి. ఆ స్థితిలో ఆమెను చూచేసరికి మగవాడినైనా - నాకూ దుఃఖం ఆగలేదు... ఏదో తెలియని ఉద్వేగంతో 'మీ పెళ్ళి నేను చేస్తాను, అని అనేశాను."

"జరిపించారా?"

"అవును, జరిపించాను. నా స్నేహితుల సహకారంతో రహస్యంగా మొదట గుళ్ళో దండలు మార్పించి దరిమిలా నాతో సహా వచ్చినవారి సాక్షి సంతకాలతో రిజిష్టర్ మారేజ్ చేయించి కొంతకాలం పాటు దూరంగా వెళ్ళిపొమ్మని పంపించేశాం. ఆ 'షాక్' మనసులో స్థిరపడి పెళ్ళంటేనే నాకు విరక్తి భావం కలిగింది. అయినా మా వాళ్ళ బలవంతం మీద. పెళ్ళి చూపులకోసం మీయింటికొచ్చి....

చెబితే నమ్మరేమోగాని... మేకప్‌లో మిమ్మల్ని చూశాక....

"నిన్ను అని అనండి..."

"అలాగే... ఎక్కడ ఆపాను....?"

"నిన్ను చూచిన తరువాత దగ్గర ఆపారు"

"అవును 'షాక్' తిన్నాను"

"ఎందుకు?"

" ఆ బ్యూటీకి! ఆ షాక్‌కు, మీరు పెట్టిన మర్యాద స్వీట్లను తినడం కూడా మర్చిపోయాను..."

"చెప్పానుగా, మీరు ఫిక్షన్ స్పెషలిస్టులని! నమ్మించేటట్లు చెప్పడంలో మీరు ఘనాపాటి!"

"నిజం శైలజా! ఆ షాక్ తగ్గి నీతో పెళ్ళి తొందర, ఫస్ట్‌నైట్ ఆరాటం ఎక్కువై పోయాయి... తీరా, కళ్యాణ వ్యవహారం పూర్తయి, అలా కాస్త బయటికెళ్తే... జనంలోంచి, మీ 'ప్రేమషాక్' తగిలింది. అది నషాళానికంటి పెళ్ళి మత్తు కాస్తా దిగిపోయింది. అందుకే అన్నాను, దురదృష్టం నాతోనేవుందని " ఆ తరువాత నడిచిన కథ నీకు తెలిసిందే కదా!"

"ఆ షాక్‌తో నాకు పెళ్ళి చేయాలనుకున్నారు, అంతేగా?"

"... ఆ పరిస్థితి అలాంటిది. జాతకం తారుమారై... పల్టీలు కొట్టి, బ్రతుకు ఉల్టా అయింది."

"గతం మర్చిపొండి! ఇహ మీదట, నా జీవితకాలమంతా మీకు నేను 'షాక్ ప్రూఫ్'గా వుంటాను. ప్రేమ పెళ్ళిళ్ళ ఉద్యోగం పూర్తిగా మానెయ్యండి! సరేనా?...'సరే' అనండి!"

"ఏమైనా, నేనే ఓడిపోయాను శైలా! ఇహ, యిల్లరికం రమ్మన్నా వస్తాను."

"ఆ అవసరం, మా డాడీకి ఏమీలేదు. త్రిమూర్తుల్లాంటి ముగ్గురు కొడుకులున్నారు. ఆయనకు మళ్ళీ మీరెందుకు, తిండి దండగ! ఎవరో వచ్చినట్లున్నారు చూడండి!"

"హలో! వెల్‌కమ్... శైలజా! యిలా రా! ఎవరొచ్చారో చూచుకో!"

"మీరా! రండి! అలా కూర్చోండి!"

" మీ యిద్దరూ అలా కూర్చోండి. మీకు ఒక శుభవార్త చెప్పడానికొస్తే... అలా డల్‌గా కన్పిస్తున్నారేమి? నేను రావడం మీకు యిబ్బందిగా వుందా?"

"అబ్బే అదేంలేదు. బావున్నారా?"

" మీ పెళ్ళికి నేను రాలేకపోయాను. రాలేదు. అఫ్‌కోర్స్, నాకు ఆహ్వానం రాలేదనుకోండి! అయినా మీరు మాత్రం నా మ్యారేజ్‌కు తప్పనిసరిగా రావాలి! వచ్చితీరాలి... ఇదిగో శుభలేఖ!... ఈ వూరిలో యింకా కొంతమందికి కార్డులు యివ్వాలి. వీలైతే మళ్ళీ వస్తాను. వచ్చినా, రాకపోయినా మీరు మాత్రం తప్పక రావాలి. వస్తానండి."

" అదేవిటి, వెంటనే వెళ్ళిపోతున్నారు. కాఫీ అయినా తాగి వెళ్ళండి. శైలజ చేతి కాఫీ చాలా టేస్ట్‌గా వుంటుంది గదా! వీలైతే భోజనానికి కూడా రండి!"

" థ్యాంక్స్! ఫర్వాలేదండి!... వస్తానండి!"

"..............."

"శైలజా..."

"ఏమిటి పిలిచారు?..."

"నేను పిలవలేదు. ఈ శుభలేఖ చదువుతున్నాను. అంతే!

నీవు చూడలేదుగా చూడు..."

"ఏముంది విశేషం... మామూలే కదా!"

"కాదు. వధువు పేరు చూశావా?"

"అవును శైలజ! అయితే..."

" నా కోరిక నెరవేరింది..."

"ఎలా?"

"శైలజతోనే ! నీ ప్రియుడికి పెళ్ళి!"

"అసలు మతి వుండే మాట్లాడుతున్నారా మీరు? ఏ పేరైనా ఒకరికే వుంటుందా? మీ పేరు, మీ అమ్మపేరు, మరెవరికీ లేవా?

"...అది కాదు. వధువుల పేర్ల కాంబినేషన్ చూడు. ఈ శైలజతో కాకపోయినా మరో శైలజతోనైనా, నీ ప్రియుడికి పెళ్ళి జరుగుతోంది. నాకెంతో తృప్తిగా వుంది!"

"మళ్ళీ ఏదో పురుగు తొలుస్తున్నట్లుంది మీ బుర్రలో!..."

"పాత పురుగు కాదులే! మనం ఎలాగూ హనీమూన్‌కు పోలేదు గదా!"

"అయితే..."

"ఆ శైలజ వాళ్ళు ఎలాగూ వెళ్తారు. మనమూ వీళ్ళతో కలిసి రెండు జంటలుగా..."

"హనీమూన్‌కు వెళ్దామంటారా? షాక్‌లతో యింతవరకూ, మతేపోయిందనుకున్నాను కామన్‌సెన్స్‌తో పాటు 'సిగ్గు' కూడా లేకుండా పోయినట్లుంది. లేకపోతే ఏమిటండి! హనీమూనంటె, పిక్నిక్‌కు వెళ్ళడమా? ఇలాంటి వాటికి జంటగా వెళ్తారుగాని, జంటలుగా ముఠా కట్టుకునిపోతారా?"

"గత అనుభవంలేక, అలా అన్నానులే కోపగించకు. నాది

సోషలిజమ్ మైండ్ గదా!"

"అన్నీ అనుభవంతోనే రావు, చూచి తెలుసుకునేవే ఎక్కువగా వుంటాయి. ఏంటి, ఆ శుభలేఖను అలా, భగవద్గీతను పట్టుకుని కూర్చునట్లు కూర్చున్నారు? లేచి రండి! ఆకలి కూడా తెలియడంలేదా?

"ఏమిటోనండి శైలజగారూ! షాక్ మీద షాక్, ఇదో షాక్! లైఫంతా, యీ షాక్‌లతోనూ, స్ట్రోక్‌లతోనే గడిచిపోయేటట్లుంది. ఇది నా జన్మ విశేషం కావచ్చులెండి. ఎవరేం చేయగలరు?"

m m m

# 6. సారస్వతం

తోచిందే మనసుకు– చేస్తోంటే మనిషి...,
చట్టుబండలె మరి – సమాజ ధర్మం!
ఎప్పటికప్పుడు – మళ్ళీ మళ్ళీ...
కోరుకున్న వారితోనే – కాపురమంటె...
కూలిపోవడమేగా – కుటుంబవ్యవస్థ?
బజారు 'కేరాఫ్' – భావి పౌరులకు.
నాగరిక ప్రగతి – సాంస్కృతిక వున్నతి,
పాలనా వ్యవస్థ – పౌరధర్మం...
సాగర సంగమమే సుమా– ఆటవిక న్యాయమే మరి!
అదుపు మనిషికి – అవసరమే బ్రతుకుకు
అందుకే ప్రభుత్వం – ఆచార ఆంక్షలు
సర్కారు చట్టాలు – సమాజ ధర్మాలు...,
మత నిబంధనలు – మనిషి బంధుత్వాలు.
ఆధ్యాత్మిక ఆశలు– భౌతిక ద్వంద్వాలు
ఆకార వికారాలు – ఆలోచనా భేదాలు
జీవికి సహజమే యివి – మనిషికే కాదు సుమా!
ఇస్తుంది ప్రకృతి – ఆకృతి జీవికి...,
పోషిస్తుంది తానే – పెంపుడు తల్లిగ
నియమాలు తప్పి – నిజాయితీ వదలి
స్వార్థమే మనిషికి – సార్థక నామమైతే...
దోపిడీయే వృత్తిగా – ద్రోహమే ప్రవృత్తిగా,

అవినీతే నిత్యం - ఆరాధనా ధ్యేయమై...,
సమాధి చేస్తూ - సమాజ ధర్మాన్ని...
నాగరికతంటూ - నానా రకాలుగా...
అభినయిస్తోంది జనత- ఆత్మవంచనతో!
మార్గదర్శకులమంటూ - మత వేషాలతో...
సమాజ సేవకులమంటూ - సంఘాల పేరుతో...
ప్రజాసేవంటూ రాజకీయ మాస్కుతో
ఎవరు ఏదైనా- దారులు వేరైనా - పేరులు మరేమైనా...
ధ్యేయం ఒక్కటే సుమా- అది ధన దోపిడీయె!
మనిషిలో మార్పే - వ్యవస్థకది తీర్పు!
ఓటు రాజకీయం- 'బోటు మల్లయ్యే' సుమా!
చేతన స్ఫూర్తితో - ఆచరణ దీక్షతో...
సాధించాలి యువత- సామాజిక సమతను.
మూఢనమ్మకాలు - మూర్ఖత్వ పోకడలను
వదిలేసి పూర్తిగ - కదలాలి నవతరం!
సాధించలేనిదేది - సాధన వుంటె మనిషికి
దీక్షే రక్ష- దిగంతాల స్పర్శకైన
మనిషే కర్త- మనీషి కాగలిగితే!
కారాడుతున్నా నెగిటివ్ - కాలుదువ్వి...
పోరాడాలి పాజిటివ్- పొజిషన్‌లో నిలిచి
నెగిటివ్‌తోనే వుంది - పాజిటివ్ సత్తా!
ఎదురైనా తొలి ఓటమి - తుది విజయం దానిదే!

m m m

# 7. సాహిత్యం

సార్వజనీనం - సాహిత్య సాకారం...
పాక్షిక ప్రయోజనమె- అభిమాన రచన!
వర్గ సాహిత్యం - వ్యక్తి 'నామా'...
సర్వహితమా అది - సాహిత్యమతమా?
కొందరికేకాదు - సాహిత్య మాధుర్యం, దాని చాతుర్యం
చేరాలి అందరికీ - అక్షర పరిచయం
కావ్య పురుషులుగా - కథా నాయకులుగా,
నిలిపింది సాహిత్యమే- యుగాల హీరోలుగా!
ఊహిస్తే ఒకసారి - సాహిత్య రాహిత్యతను
శూన్యమేగద- మానవ చరిత, దేవుళ్ళ ఉనికి!
కావ్య వర్ణనలు - కథానాయక 'లీల'లు...
ఆదర్శమా మనిషికి - ఆచరణ సాధ్యమా?
సాపత్యమా అవి - సమాజ న్యాయానికి?
యుగాల ధర్మం - వేరువేరుగ వుంటె...
కలియుగానికేల - గత యుగాల ధర్మం?
చెల్లలేదు కృతం - త్రేతానికి...
మారింది త్రేతం - ద్వాపరానికి ...
లేదా, కలియుగానికి - ప్రత్యేక ధర్మం?
కాదుగా మారేది - ధర్మ స్థిరత?
ఆధిక్య పోరాటమె- ఆనాటికి ... యీనాటికి!
ప్రజలను చంపుటె - ప్రభువుల కీర్తి!

‘కాలె డాగ్ అండ్ కిల్లిట్...’

కాలె డెమన్ – అండ్ స్లెయిన్‌దెమ్!

ఉందిగా సాహిత్యం – వర్ణించి ఒప్పింప!

అలవాటయింది యిది– అనుకరణ మనిషికి.

భౌతిక– ఆధ్యాత్మిక – జ్ఞాన దీపికకు...

కాదా మనిషి – కర్తగా, కార్యకర్తగా?

Know the wisdom of the Eternity

Through the Body - the Divinity

m m m

# 8. బ్రతుకు బాధ్యత

బ్రతకాలి మనిషి - బాధ్యతగా భావ్యంగా!
బాధ్యతంటె కాదు - స్వార్థమొకటె....!
కానా- పీనా - మకానా.....
కావలసినవే అవి - పిపీలికానికైనా
శ్రమించాలి మనిషి- చేతనైన తీరుగా!
అవకాశాల హద్దులు - అవసరాల గుర్తులుగా
ఆశించాలి దేనినైనా - ఆర్జించాలి తెలిసి, నీతి!
సుఖాలు, కష్టాలు - వ్యక్తిగత భావాలు, అనుభవాలు
రెండిటి బ్యాలెన్స్ - సంయమన సమతూకం!
నిగ్రహం, నిజ జీవితంలో - అనుగ్రహ భాషణే సుమా!
కోరిక, కర్మ - ఫలితం, అనుభవం...
భౌతిక తథ్యం - శారీరక సహజం!
కోరిక ఒడిలో ఆశ - కొనితెచ్చే కష్టమే సుమా!
నిరాశ, పేరాశ - నిష్క్రియా వికృతమే!
బ్రతుకు భౌతికమే - నిత్య దర్శనమే అది
కర్మ కంపల్సరీ - సుఖం, టెంపరరీ!
పుట్టుకే పునాది - అది గిట్టుటె సమాధి!
ఆర్తి - తృప్తి - పూర్తి - కావవి సమాప్తి!
వయసు దశలలో అవి - మారవచ్చు దిశలు!
పోదు వునికి వాటికి - ఉన్నంత వరకు వూపిరి!
పుట్టుకతో సుఖద్దుఖాలు- పాపపుణ్యాలు...

చావుతో, స్వర్గ నరకాలు (ట) – ముక్తి మోక్షాలు
సమాప్తే కద వాటి ఉనికి, వాస్తవాలు
మిగులునదేది మళ్ళీ జన్మకు – కర్మఫల అనుభవాలకు
ఎవరో మరి కర్త – అనుభవింప వాటిని?
తెలియునా 'జీవి'కి – స్పర్శ లేక అనుభవం?
కాలేవు ఋజువు – ఊహాలు అన్నీ –
నీలోనే వుండగా – నిజ జీవిత నిర్ధారణ
అందులోనే వుండగా – అనుభవ సాక్ష్యాలు...
ఏదో వుందంటూ – ఎవరో చెబుతోంటె
చూచుటేల నింగివైపు – వదిలి నీలోనిది?
ఉంది నీలోనే అది...
సృష్టి సూక్ష్మతగ – జీవాత్మ, అంతరాత్మగ!
ఉంటుంది అక్షర సూక్ష్మతే – సాహిత్య స్థూలతలో!
సూక్ష్మ స్థూలతగ – అదే స్థూల సూక్ష్మతగ
సృష్టి పదార్థం – దాని శక్తి నిక్షిప్తత!
ఆత్మగ, పరమాత్మగా – అవగాహనే, ఆధ్యాత్మికం!
ఉనికి పదార్థం – దాని వైబ్రేషనే శక్తి,
దృశ్యతగ ద్వయం – ఏకం అదృశ్యతగ
సర్వవ్యాప్తి పరమాత్మ – సాకార సూక్ష్మత!
విషయ జ్ఞానం – వస్తురూపం...
సత్య జ్ఞానం – అదే, స్వయం భు
భౌతిక, ఆధ్యాత్మికతలు – దృశ్య, అదృశ్య, భావ, భావనలె!
వ్యక్తిగతం, మరణం – మిగిలేది సృష్టి సూక్ష్మం!

అశాశ్వత, శాశ్వతాలు– పదార్థ – పరమాత్మలే!
పరస్పర ఆధారాలు – ఉనికి, వ్యక్తతె సుమా!
చేతన చలన క్రియా రూపమె – పదార్థ జీవకోటి!
స్పర్శ చేతన పరిణామ వున్నతే – మానవ జీవి ప్రత్యేకత!
(So)
Love the 'Self' (life) and like the others!
It comes once and ends forever!
Compassion is the consciousness... and
The Passion is the mind of sensory...
No existence except the matter...

m m m

# 9. పదార్థ ధర్మం

నిజం ఒక్కటే– నేల నింగిలో ...!
లేదు దృష్టాంతం – దృశ్యానికి స్పష్టంగా...
ప్రతిబింబం ప్రతిరూపం – ఊహా వాస్తవాలె!
లేదు ఎవిడెన్స్ – ప్రోవిడెన్స్‌కు...
నమ్మకమంటావూ... అది, మనసు వికారం!
నిజమేనంటావూ..... అదీ అంతే మరి!
అప్పటికే వాస్తవం అది – కాదుగా శాశ్వతం!
ఏదీ స్థిరత?– శాశ్వతానికి మాత్రం?
మారకపోయినా తాను – మారుస్తూనే వుంటుంది సర్వాన్ని!
అదే విశ్వ కేంద్రం – సృష్టి ఆధారం...!
తెలుసు మనిషికి – పుట్టుక – చావుల సంగతి
అయినా బ్రతకాలి – ఆ మధ్యదే జీవితమని!
కావాలి కర్మ – మరి బ్రతకాలంటె జీవి!
కర్మంటె కాదు – వెనక ముందుల జన్మలు!
వర్తించేది కర్మలు – వర్తమానమే సుమా!
వస్తూనే వుంటుంది స్మృతిగా – అదే గతం!
అనిపించే 'హోప్' కావచ్చు–అదే భవిత!
అనుభవ దృశ్యం – వర్తమాన కర్మఫలం!
చావు బ్రతుకుల వాస్తవాలకు – మరణానంతర ఊహలకు
వర్తించవు పూర్వ, ఉత్తర మీమాంసలు – తర్క, వితర్కాలు
పుట్టిన బీజం – మరో పుట్టుటకే సుమా!
హేతుమూలం రెండిటికీ – సృష్టి బీజం, ప్రకృతి రూపం

వచ్చామా ఎక్కడి నుండో - పుట్టడానికి భువిపై? - నో!
శాశ్వతమా జీవి - పూర్వ స్థావరమెక్కడ దానికి?
అంటారుగా వేదాంతులు - శాశ్వతం 'ఆత్మ' ని...
తత్వశాశ్వతేగాని - లేదు, దాని ఉనికి స్థిరత!
హేతువేది జన్మకు? - లేదుగా 'తొలి' కర్మ దానికి...
లేదుగా జన్మ- సంపర్క శూన్యతతో...?
విశ్వవ్యాప్తిలో భూమి - సూక్ష్మకణమె సుమా!
ప్రత్యేకత ఏమి దీనికి - జీవుల స్థావరంగ?
ప్రకృతే సుమా అది - ప్రాణవాయువు కలిగినదిగ!
ధర్మం, జీవ పదార్థానికి - మారుట 'జీవి'గా!
నిఖిల జగత్‌లో పదార్థం - నిర్జీవమె అత్యధికం!
'జీవి' పరిణామ ధర్మం - అది ప్రకృతికే సుమా!
అనుకూల, ప్రతికూల - ఆరంభ సమాప్తిలతో
సాకార, నిరాకార- నిత్యత్వమె సృష్టిది!
అదె, 'సృష్టి -స్థితి-లయ' - పదార్థ శాశ్వత ధర్మం
సూక్ష్మ - స్థూల - సూక్ష్మ క్రమంలో...
కదులుతూనే వుంటుంది విశ్వం - కాల నిర్ణయంతో!
కాదు పుట్టుక - మనిషికే ప్రత్యేకం!
మానవ జీవిగ ప్రారంభం - మనిషిగా పరిణామం!
ఆలోచన ప్రత్యేకం- అవగాహన క్రమంలో!
పరిశీలన, పరిశోధన- ప్రగతి మార్గాలుగా,
నాగరిక మూలాలు యివి - సమాజ స్థాపన ప్రస్థానంలో
శాస్త్ర సిద్ధాంతాలు - మతతత్వ ప్రచారాలు
వ్యవస్థ రాజ్యాంగమే - యుగాల ఎమెండ్‌మెంట్స్‌తో

# 10. ద్వంద్వం

గాలి– నీరు– ఆహారం...
కాక, మరేవిటి ఆధారం, శరీర ఉనికికి?
కలిసి వుంది ఆక్సిజన్ – నీటిలో, నేలలో, గాలిలో
నేల నుండే నీరు – అంతేగా మరి ఆహారం...
విసర్జితాలు అవి – చేరతాయి మొదటికే!
కాల్చినా, పూడ్చినా – శరీరమూ అంతే మరి!
కాలేది కార్బన్ – కాల్చేది  అగ్ని...!
బూది విబూదిగా గమనం శూన్యంలోకి...
నిలిచి వుండునా ప్రాణవాయువు, నికరంగా శరీరంలోనే?
ఉచ్ఛ్వాస, నిశ్వాస– నిత్యమూ 'ఇన్ అండ్  ఔట్!
మనసూ అంతే సుమా – ప్రకృతి  టు ఫలితం వరకు!
సీజనల్ ప్రకృతి – నిత్య మార్పే , దాని కూర్పు
జీవితమూ అంతేమరి – బాల్య యౌవన – వృద్ధాప్యాలతో
అన్ని జీవులకు కామన్ – ఆహార అన్వేషణ!
ప్రత్యేకం మనిషికి – జ్ఞానాన్వేషణ!
అన్వేషణ కొందరిదే – అనుభవం అందరిదీ!
సైన్సూ అంతే... శాస్త్రమూ అంతే...!
ఎందరిదో శ్రమశక్తి – కొందరికే సంపద!
'ఆస్తే' అంకురార్పణ – సంపద కేంద్రీకరణకు
జరగవలసిందేదో – జరుగుతుందంటూ...
'కర్మ'కు వదిలేస్తే – కావలసిన దానిని...

జరిగేదెలా ప్రగతి – గడిచేదెలా బ్రతుకు?
అనుభవించాలి ఎవరైనా – కర్మ ఫలితమంటూనే!
'సరండరైతే నాకు – తొలగిస్తానంటె 'కర్మ'ను...
కాదది కనీసం – మానవ న్యాయం కూడా!
దైవ సూక్తి కాదది – కల్పితమేమో మరి!
'తన' ఆత్మనే కలిగిన – 'తన'లోని నరుని
తగునా దైవానికి – దాసోహమనిపించుట?
ఎవరిదో కర్మ – వారికే ఫలితం...
కావచ్చు అనుభవం– 'షేర్'గా కొందరికి!
నేరం ఎవరిదో – శిక్షా వారికే...!
జరగాలి యిలా – మానవ న్యాయం
అన్యాయమే గదా! ఇందుకు భిన్నం?
నిరాకరిస్తే ఫలితాన్ని – చేస్తే రద్దు శిక్షను
దైవ న్యాయమా యిది – 'తన' వారు, 'పర' వారుగ
వదిలేసి 'తన' వారిని – శిక్షిస్తే 'పర' వారిని...
ఆక్షేపణే సుమా – మానవ లెవెల్లో...!
జరుగును 'కర్మ'– ఆశించి ఫలితాన్ని...
సఫలం, విఫలం – సగం ఫలితం...
కావచ్చు ఏదైనా – కర్మ పూర్తితో, స్ఫూర్తితో
జరుగునా కర్మ– 'ఏదో' కోరికే లేక?
ఊహతో ఆలోచన – బుద్ధితో కర్మ...
జరిగేది యిదే– నిజజీవిత నిర్వహణలో!
కలిమి లేములు – స్త్రీ పురుష భేదాలు...

లేదు మినహాయింపు – బాల్య వృద్ధాప్యాలకు
జీవులన్నిటికీ యిది – జీవిత అలవాటే!
ఎరుగము పుట్టుట – తెలియదు చచ్చుట...
తెలిసింది జీవితమె– పోషించుటే ధర్మం!
సుఖద్దుఖాలు – ద్వంద్వ వాస్తవాలు
ప్రకృతే ద్వంద్వం– ప్రతిజీవికది బంధం!
సంసార బంధుత్వాలు – సమాజ అనుబంధాలు...
తప్పవు జీవులకవి – జాతి భేదాలతో!
బుద్ధి జీవి మనిషి – వృద్ధి బాటె, తనది...
ఆర్జన, జ్ఞానార్జన – అన్వేషణ, అంత్ణకరణ
కుటుంబ కూడిక – సమాజ నిర్మాణం
భౌతిక, ఆధ్యాత్మిక – జీవిత నిర్వహణ
ప్రగతి మార్గంలో కృషి – సాధ్యత మనిషికే!
ఊహలు , అపోహలు – భావనలు, భ్రమలు
మనోవికారాలు – సాకార నిరాకారాలు,
మతాలు, వేదాంతాలు – సిద్ధాంత, రాద్ధాంతాలు,
రాజులు, రాచరికాలు – ఇజాలు, క్రసీలు
ప్రజాస్వామ్యాలు – డైనాస్టీ దాష్టీకాలు...
దయాదాక్షిణ్యాలు – రాక్షస హృదయాలు
“... ఎన్నో మరెన్నో – అన్నీ మానవులకే సుమా!
కర్మ నిజం – కాజ్ వాస్తవం – నిత్యత, అదే సత్యత!
దృశ్యం, దృష్టాంతం – అనుభవం, అనుభూతి
భౌతికమిదే – భావం, భాషలో...!

కాబోదు జీవితం – లేక, కాజ్ అండ్ కర్మ
భౌతికం ప్రధానం – బ్రతకాలి 'ద్వంద్వం'తో
మరో పార్శ్వ ఆధ్యాత్మికం – మానవజీవితానికి
లేదు ఆధ్యాత్మికం – ఎక్కడో.... మరెక్కడో...
బాహ్య – అంతః దృష్టి – భాష్యాలు యీ రెండిటికి.

m m m

# 11. రాజకీయం

ఓదార్పు మనిషికి – మత విశ్వాసం!
ధైర్యం మనసుకు – దైవభావం
ఉపయోగమే, యీ రెండు  ఊహలైనా గాని
వాస్తవం కంటే ఒకోసారి – కల్పితమే 'మేలు' సుమా!
అవసరార్థమే అది – హాని చేయని మేర!
భౌతికాతీతంగా – ఆధ్యాత్మిక జ్ఞానం,
దృశ్య, అదృశ్య – భావ భావనలతో..!
చేయాలి మతం – మానవజాతికి మేలు...
చేస్తున్నది భిన్నం – తత్ విరుద్ధమే సుమా!
రాక్షసిగా మారి – రాజకీయ విషవృక్షం
చేస్తోంది 'దుష్ట' రక్షణ – శిష్ట భక్షణ!
విద్యా, వేదాంతం – మతమూ, దేవుడు...,
కావేవీ మినహాయింపు – రాజకీయ స్వార్థానికి!
పతనం, పవిత్రతకు – అందలం, అనర్హతకు
ప్రజాస్వామ్యమంటూ –  ప్రజా పీడితులుగా...
రాచరిక కేంద్రాలు – సామంత రాజ్యాలు
వారసత్వాలు – యువరాజ పట్టాభిషేకాలు
ఓటు వ్యాపారాలు – 'నోటు' రాజకీయాలు
కోట్ల దోపిడీలు – కొలువు తీరే దర్బారులు
రాజ్యమేలుతుంది – రౌడీ ఫాసిజం!
వ్యక్తిస్వామ్యం – పార్టీ నియంతృత్వం

పతన ప్రజాస్వామ్యం – ప్రబల పెత్తందారీతనం!
బానిసత్వమేనా ప్రజలకు – స్వతంత్ర భారత్‌లో
రాచరిక కుటుంబాలు – రాణివాస నిలయాలు
రాష్ట్రాధినేతలుగా – రాజభవన్, నివాసాలు...,
కప్పంతో సరిపెట్టారు, సామంతరాజులు... 'నాడు'!
సమర్పిస్తూ వ్యక్తిత్వాలను
సమాధి కడుతూ నీతి నియమాలను
తరిస్తున్నారు వ్యక్తి పూజతో – ప్రజాస్వామ్య ముసుగుతో!
అధినేత చదరంగం – పావులే 'ప్రజా' నాయకులు
ఉంటుందా ప్రజాస్వామ్యంలో – వారసత్వపాలన?
ఉందా యిది 'గ్లోబల్'గా – ఏ దేశంలోనైనా?
చేరింది గల్లీకి – ఢిల్లీ వారసత్వ జాఢ్యం!
జాతి, మతం – సంస్కృతి, సాహిత్యాలు
జాతీయతే ప్రధానం – అంతార్జాతీయ దృక్పథానికి
తప్పదు ప్రాంతీయం– జాతీయానికైనా...
కావాలి ఫెడరల్ డెమోక్రసీ – పీపుల్స్ రూల్
కాకూడదు విచ్ఛిన్నత – వికేంద్రీకరణతో
లేదు స్థానం రాజకీయానికి – స్థానిక పాలనతో
సోషలిజమంటె కాదు – సర్కారు వ్యాపారం...
కమ్యూనిజమంటె కాదు – వర్గతత్వమొకటె....
ప్రజాస్వామ్యమంటె కాదు – ప్రముఖుల పాలన....
సంపద జాతికి – అనుభవం ప్రజలది...
వర్గతత్వం – అది, జాతి లక్షణమె సుమా!

అంతర్గతమె మరి – వర్గ పోరాటం కూడా!
వ్యక్తి 'బేస్'గ యిది – స్వార్థ సహజతె!
బీజమె దీనికి – స్ట్రగుల్ ఫర్ ఎగ్జిస్టెన్స్!

m m m

# 12. ధ్యాన ప్రస్థానం

చర్చించినా, అర్చించినా – పూజించినా ధ్యానించినా...
కావాలి ధ్యేయం – జ్ఞాన సంచితమె!
ఆకృతే శరీరం – విగ్రహానికైనా...
ఆత్మకు నిలయం – అదే దేవాలయం
శాశ్వతానికేదీ ఉనికి – శరీరమే లేక
బ్రహ్మలో పరమాత్మ – 'ఆటం'లో ఎనర్జీ
సృష్టిలో ఆత్మ– మనిషిలో జీవాత్మ
లేనిదెక్కడ విశ్వాత్మ – పదార్థ ఉనికిలో
ధ్యానం .... 'పర' ధ్యానం
అవధానం – సంధానం
ఫీచరేదైనా – మనో కేంద్రీకరణే దాని నేచర్
మనసంటే .... నథింగ్ బట్
పంచేంద్రియ ప్రభావిత – సెన్సోరియం
గతం, దానికి స్మృతి – వర్తమానం కర్మగతి!
ఊహలు, ఆశలు – అంచనాల సమీకృతం, భవిష్యత్
ఆలోచనాలంబం – ఆచరణ, దాని క్రియా రూపం
బుద్ధి మిళితం – అవసర పరిసరాల ప్రోత్సాహం!
It is an instant aspect of the Sensorium
Functionally it would be in aciton
Whether it is good or bad - low or high,
It is the feeling and the action of the thought"

శ్వాస – ధ్యాస – ధ్యానం
కేంద్రీకృతం, ఏకం – ట్రాన్స్
ట్రాన్స్‌ంటే కాదు – యోగ నిద్ర, నిద్రమత్తు
చేతన చలన సమీకృతం – ట్రాన్స్!
అంత:స్పృహ – బాహ్యతా దృశ్యతతో
మరో పార్శ్వం మనసుకు – ఆధ్యాత్మికం
డైవర్షన్ ఆఫ్ ది ఫీలింగ్ ఇన్‌టు ది కన్‌వర్షన్
ఆఫ్ ది థాట్;
ది పెనెట్రేషన్ ఆఫ్ ఇట్ ఇన్‌టు ది ఇంత్యూషన్
దెన్ ది మెర్జింగ్ ఆఫ్ ఇంత్యూషన్
ఇన్‌టు ద స్పిరిచ్యువల్ కాన్షస్‌నెస్
దెన్ ది స్పిరిచ్యువల్ కాన్షస్‌నెస్ టు ద డివైన్ కాన్షస్‌నెస్
ది కన్‌కమిటేషన్ ఆఫ్ ది సోల్
టు ద యూనివర్సల్ సోల్, ది సుప్రీమ్
దట్ ఈజ్ ది యాబ్‌సొల్యూట్ ఆఫ్ ది స్పిరిచ్యువాలిటీ
హ్యావింగ్ బీన్ విత్ ద ప్రాక్టీస్ ఆఫ్ ధ్యానప్రస్థాన్
యూ మే హ్యావ్ యాన్ ఇన్‌ట్యూటివ్ పెర్‌సెప్షన్
ఆఫ్ ద సుప్రీమ్ బీయింగ్
నో నీడ్ ఆఫ్ హ్యావింగ్ ద సీక్‌వెస్ట్రేషన్.

– సో బీయిట్